thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 354 | కరీంనగర్ శనివారం, 1 మార్చి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

### తమిళనాట పెరుగుతున్న జాతీయవాదం..

చెన్నై: ప్రధాని నరేంద్రమోదీ రాజకీయాల కోసం కాకుండా వాస్తవంగానే తమిళ ప్రజలను, తమిళ సంస్కృతి సంప్రదాయాలను ప్రేమిస్తున్నారని, జాతీయవాదం పెరుగుతున్నందున తమిళ ప్రజలు మోదీని ఆదరిస్తారనే నమ్మకం తనకుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. మదురై జిల్లా ఎ.వల్లాల్‌పట్టి గ్రామంలో టంగ్‌స్టన్ పథకాన్ని రద్దుచేసినందుకు ధన్యవాదాలు తెలిపేందుకు అరిటాపట్టి పరిసర గ్రామాలకు చెందిన గ్రామ పెద్దలు, రైతులు, వివిధ ఉద్యమ సంస్థల ప్రతినిధులు కిషన్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం దేశాభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తోందని, తమిళ సంస్కృతితోపాటు దేశ సంస్కృతి, వారసత్వ సంపదను పరిరక్షిస్తోందన్నారు. ప్రధాని మోదీని అమితంగా ఆదరిస్తున్న తమిళ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా

# పని చేద్దాం!

## కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి

## గాంధీ భవన్‌లో టిపిసిసి విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం




హైదరాబాద్ : రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ లోని గాంధీభవన్ లో శుక్రవారం టీపీసీసీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ హాజరయ్యారు. ఈ సమావేశానికి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ గౌడ్ అధ్యక్షత వహించారు. సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మీనాక్షి నటరాజన్ లాంటి ఇన్చార్జిని నియమించినందుకు ముందుగా ఏఐసీసీకి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రక్రియ నిరంతరంగా కొనసాగాలని, అలాగే ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. పార్టీ జెండా మోసిన వారికి ఖచ్చితంగా గుర్తింపు ఉంటుందని, పార్టీ కోసం కష్టపడిన వారికే నామినేటెడ్ పదవులు ఇస్తామన్నారు. సుదీర్ఘకాలంగా పనిచేసిన వారిలో కొంతమందికి అవకాశాలు రాలేదన్న విషయం తన దృష్టికి వచ్చిందని, కానీ అటువంటి వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత పార్టీపై ఉందన్నారు. రాబోయే రోజుల్లో సుదీర్ఘకాలంగా పార్టీ కోసం పని చేసిన వారికి తప్పకుండా ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. వివిధ జిల్లాలలో ఖాళీగా ఉన్న కార్పొరేషన్లు, మార్కెట్ కమిటీలు, నామినేటెడ్ పోస్టుల భర్తీ చేయాల్సి ఉందని, మార్చి 10వ తేదీలోగా అన్ని జిల్లాలలో నియామకాలు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రులకు సీఎం ఆదేశించారు. పదవులు వచ్చిన వారు పార్టీ కోసం కష్టపడాలని, అప్పుడే పార్టీ బలోపేతం అవుతుందన్నారు. పనితీరు సక్రమంగా లేని నాయకులకు ఎట్టి పరిస్థితుల్లో పదవుల రెన్యువల్ ఉండదని సీఎం తేల్చిచెప్పారు. మంచిని మైక్ లో చెప్పండి.. చెడును చెవిలో చెప్పాలని సీఎం ఈ సందర్భంగా కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన ప్రజా పాలనగా సాగిందని ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినట్లు సీఎం ప్రకటించారు. రూ. 4200 కోట్లు వెచ్చించి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన ఘనత ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. అలాగే గృహ జ్యోతి పథకాన్ని ప్రవేశపెట్టి 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందిస్తున్నామన్నారు. కేవలం 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా జనవరి 26వ తేదీన మూడు బృహత్తర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, రైతు భరోసా కార్యక్రమం ద్వారా రైతులకే కాకుండా వ్యవసాయ కూలీలకు సైతం ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. రుణమాఫీని విజయవంతంగా అమలు చేసి రైతులకు ప్రభుత్వం భరోసానిచ్చిందన్నారు. మన విజయాలను మనమే చెప్పుకోవాలని, అప్పుడే ప్రజల్లో మనం చేసే మంచి వెళ్తుందన్నారు. యావత్ దేశం మొత్తం గర్వించేలా కులగణన సర్వే చేసి దేశానికి ఆదర్శంగా నిలిచామని, ఎందరో విమర్శకులు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అభినందిస్తున్నారన్నారు. ఇటీవల దావోస్ పర్యటనలో అత్యధిక విదేశీ పెట్టుబడులను ఆకర్షించిన రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. రాష్ట్రంలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, అలాగే స్పోర్ట్స్ యూనివర్సిటీని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. దేశానికి తెలంగాణ కొత్త మోడల్ ను క్రియేట్ చేస్తుందని రాహుల్ గాంధీని ప్రధానిని చేసే వరకు ప్రతి కార్యకర్త శాయశక్తులా పని చేయాలని సీఎం పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ పట్టుదలతోనే కులగణన, ఎస్సీ ఉపకులాల వర్గీకరణ చేయగలిగినట్లు సీఎం అన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉంటేనే సంక్షేమ పథకాలను అమలు చేశామని, దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశ ప్రజల కోసం రాహుల్ గాంధీ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. చివరగా కార్యకర్తలతో రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే ఎజెండాగా పనిచేయాలని సీఎం కోరారు.

**కిషన్ రెడ్డి పై సీఎం ఫైర్..** కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పై మరోమారు సీఎం రేవంత్ రెడ్డి ఫైర్ అయ్యారు. కిషన్ రెడ్డి వల్లే మెట్రో, మూసీ ప్రాజెక్టులు ఆగిపోయాయని, కిషన్ రెడ్డి సైంధవ పాత్ర పోషిస్తున్నారన్నారు. కేంద్ర కేబినెట్ ముందు ప్రాజెక్టుల అంశం పెట్టకుండా, మిగతా మంత్రులపై కిషన్ రెడ్డి ఒత్తిడి తెస్తున్నట్లు సీఎం ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధికి సహకారం అందించడంలో కేంద్రం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఆరేళ్లు కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి తెలంగాణకు ఒక్క ప్రాజెక్టు తెచ్చారా అంటూ సీఎం ప్రశ్నించారు.

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న 8మంది మృతి.. విషాదంగా ముగిసిన రెస్క్యూ ఆపరేషన్

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న 8మంది మృతి చెందినట్లుగా అధికారులు వెల్లడించారు. గత వారం రోజులుగా వాళ్ల ఆచూకి కోసం రెస్క్యూ ఆపరేషన్ చేపట్టినప్పటికి ప్రయోజనం లేకపోయింది. టన్నెల్లో చిక్కుకున్న 8మందిలో ఇద్దరు ఇంజనీర్లు, ఆరుగురు కూలీలు ఉన్నారు. టన్నెల్‌లోని అధునాతన పరికరాలు, రాడర్‌లతో మూడు మీటర్ల మట్టిలో చిక్కుకుని సజీవ సమాధి అయిన్నట్లుగా గుర్తించారు.

**టన్నెల్లో సజీవ సమాధి..** ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న 8మంది కార్మికులు మృతి చెందారు. ఈనెల 21న తేదీన టన్నెల్లో గల్లంతైన 8మంది కోసం రెస్క్యూ ఆపరేషన్ చేపట్టంది ప్రభుత్వం. ఇందులో రెస్క్యూ ఆపరేషన్ కోసం భారీ యంత్ర సామాగ్రితో పాటు రెస్క్యూ సిబ్బంది, రైల్వే నిపుణుల సహాయంతో టీబీఎం మిషన్, ప్లాస్మా గ్యాస్ కట్టర్ల సహాయంతో టన్నెల్ ను కట్ చేసి శిథిలాలను తొలగించి 8మంది మృతదేహాలను బయటకు తీశారు. చనిపోయిన 8మందిలో ఇద్దరు ఇంజనీర్లు, ఆరుగురు కూలీలు ఉన్నారు.

**విషాదంగా ముగిసిన రెస్క్యూ ఆపరేషన్..** సరిగ్గా వారం రోజుల క్రితం ఇదే రోజున 8మంది టన్నెల్‌లో చిక్కుకున్నారు. వారి జాడ తెలుసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అత్యాధునిక యంత్ర పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈరోజు గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడర్‌ను లోపలికి పంపింది. పైకప్పు కూలిపడిన చోట శిథిలాల కింద ఏముందని పరిశీలించారు. ఈక్రమంలోనే మూడు అడుగుల మట్టిలో




8మంది మృతదేహాలు కూరుకుపోయి ఉన్నట్లుగా పరికరం ద్వారా తెలుసుకున్నారు.

**వారం తర్వాత శవాలు గుర్తింపు..** ఇక టన్నెల్‌లో సజీవ సమాధి అయిన 8మంది మృతదేహాలను బయటకు తీస్తున్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తారు. దీనిపై ఇప్పటి వరకు అధికార, ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేసుకున్నాయి. అయితే లోపల చిక్కుకున్న కార్మికులు ప్రాణాలతో ఉంటారని భావిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం రెస్క్యూ ఆపరేషన్ సరిగా చేపట్టడం లేదని ..బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈనేపథ్యంలోనే లోపల చిక్కుకున్న 8మంది చనిపోయినట్లుగా తేలిపోయింది.




హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ తొలిసారిగా రాష్ట్రానికి వచ్చారు. ఆమెకు కాచిగూడ రైల్వే స్టేషన్ లో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తో సహా ఇతర కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈరోజు (ఫిబ్రవరి 28వ తేదీన) గాంధీభవన్ లో పీసీసీ చీఫ్ బి.మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరుగనున్న టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశానికి మీనాక్షి నటరాజన్ హాజరవుతారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా సమావేశానికి హాజరుకానున్నారు. తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జి మీనాక్షి నటరాజ్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని రాజ్యాంగ విలువలను పరిరక్షిస్తానని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు , ముఖ్యమంత్రి సహకారంతో తెలంగాణలో పార్టీ బలోపేతం చేస్తానని ఆమె తెలిపారు.

# హైదరాబాద్-బెంగళూరును డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌గా ప్రకటించండి

## రక్షణమంత్రి రాజనాథ్ సింగ్‌ను కోరిన సీఎం రేవంత్ రెడ్డి



నేషనల్ సైన్స్‌డే ఎగ్జిబిషన్ పాల్గొన్న కేంద్ర మంత్రి రాజనాథ్, సీఎం

హైదరాబాద్ : దేశాన్ని రక్షించడంలో హైదరాబాద్ అత్యంత క్రియాశీలక పాత్ర పోషిస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు గచ్చిబౌలి స్టేడియంలో ఇవాళ(శుక్రవారం) కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తో కలిసిన నేషనల్ సైన్స్ డే ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఇక్కడ డీఆర్‌డీవో, డిఫెన్స్, ఏరోస్పేస్ ఉత్పత్తులకు చెందిన 200 స్టాల్స్ ప్రదర్శించారు. డిఫెన్స్, ఏరోస్పేస్ రంగంలో భారత సామర్థ్యాలను ప్రదర్శించేలా స్టాల్స్ ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు నేషనల్ సైన్స్ డే ఎగ్జిబిషన్ జరగనుంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ దేశ రక్షణ బాధ్యత యువతీ యువకులపై ఉందని చెప్పారు. బీడీఎల్, హెచ్ఏఎల్, మిధాని వంటి కీలక సంస్థలు హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సైన్స్ ప్రదర్శన వల్ల విద్యార్థులు, యువతకు దేశరక్షణ పట్ల అవగాహన కలుగుతుందన్నారు. ప్రస్తుతం యువత ఐటీ ఉద్యోగాలవైపే మొగ్గు చూపుతోందని.. సంప్రదాయ ఇంజినీరింగ్ విద్యపై కూడా విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సీఎం సూచించారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్-బెంగళూరును 'డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్'గా ప్రకటించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి శుక్రవారం కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరారు. జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన రెండు రోజుల సైన్స్ అండ్ టెక్నాలజీ మహోత్సవం విజ్ఞాన్ వైభవ్- 2025లో పాల్గొన్న రేవంత్ రెడ్డి, దీనిని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇక్కడి గచ్చిబౌలిలో ప్రారంభించారు. హైదరాబాద్ మరియు బెంగళూరు దేశ రక్షణ రంగానికి ముఖ్యమైన కేంద్రాలని, రక్షణ పారిశ్రామిక కారిడార్‌గా ప్రకటిస్తే, అది భారీ పెట్టుబడులను తీసుకువస్తుందని అన్నారు. రాకెట్ తయారీతో సహా స్కై రూట్ వంటి స్టార్టప్‌లు కూడా అభివృద్ధి చెందుతాయని ముఖ్యమంత్రి చెప్పారు మరియు ఈ విషయంలో సహకారం మరియు మద్దతు అందించాలని రాజ్‌నాథ్ సింగ్‌ను కోరారు."రక్షణ రంగంలో భారతదేశాన్ని నంబర్ వన్ దేశంగా ప్రోత్సహించడానికి మేము ప్రయత్నాలు చేస్తాము" అని రాజనాథ్ హామీ ఇచ్చారు. దేశంలో రక్షణ రంగంలో హైదరాబాద్ నగరం ముఖ్యమైన క్రియాశీల పాత్ర పోషిస్తోందని, దేశభక్తి మరియు దేశాన్ని రక్షించే బాధ్యతపై లక్షలాది మంది విద్యార్థులను ప్రేరేపించడానికి మరియు వారికి అవగాహన కల్పించడానికి ఈ సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించబడిందని ఆయన అన్నారు. ప్రతి సంవత్సరం తెలంగాణ నుండి లక్ష మందికి పైగా ఇంజనీరింగ్ పట్టభద్రులు, ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్ చదువుతున్నవారు అమెరికా వెళ్తున్నారని, వారిలో దేశభక్తితో కూడిన దేశ రక్షణ వ్యవస్థ ప్రాముఖ్యతను వివరించేందుకు ఈ సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ నుండి అమెరికాకు ఐటీ నిపుణులను పంపడంతో పాటు దేశ రక్షణ రంగానికి అవసరమైన సమర్థవంతమైన ఇంజనీర్లను అందించడానికి మేము ప్రయత్నిస్తున్నామని, రక్షణ రంగానికి మరిన్ని ఇంజనీర్లను తయారు చేయడం చాలా ముఖ్యమని రెడ్డి అన్నారు. భారతదేశం స్వాతంత్ర్యం పొందటానికి ముందు మరియు తరువాత హైదరాబాద్‌లోని BDL, HHL, మిదానీ, DRDO వంటి అనేక సంస్థలు దేశ రక్షణ రంగానికి ఉత్పత్తి రంగంలో అనూహ్యంగా పనిచేస్తున్నాయని ఆయన అన్నారు. ప్రముఖ శాస్త్రవేత్త సర్ సివి రామన్ మరియు శాస్త్ర రంగానికి ఆయన చేసిన అద్భుతమైన కృషికి గౌరవసూచకంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని DRDO, AeSI మరియు కలాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. కొన్నాళ్లపాటు తాను సైన్స్ అధ్యాపకుడిగా పని చేశా: రాజ్‌నాథ్ సింగ్ ఈ కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. కొన్నాళ్లపాటు తాను సైన్స్ అధ్యాపకుడిగా పని చేశానని కేంద్రమంత్రి వెల్లడించారు. నోబెల్ గ్రహీత సర్ సీవీ రామన్ ఫిబ్రవరి 28న రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్నారని.. ఆయన గౌరవార్థం ఏటా ఈరోజును జాతీయ సైన్స్ దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని గుర్తు చేశారు. ప్రస్తుతం వ్యవసాయంతో పాటు అన్ని రంగాల్లో సైన్స్ ముఖ్యపాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. తాను కూడా సైన్స్ విద్యార్థినేనని.. కొన్నాళ్లు సైన్స్ అధ్యాపకుడిగా కూడా పనిచేసినట్లు పునరుద్ఘాటించారు. సైన్స్ వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులు గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులనుద్దేశించి ప్రసంగించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. మానవ పరిణామ క్రమాన్ని, సైన్స్ అభివృద్ధిని విద్యార్థులు అధ్యయనం చేయాలని సూచించారు. ఇన్నోవేషన్, దేశ ప్రగతిలో విద్యార్థులదే కీలకపాత్రన్న ఆయన.. అందుకనుగుణంగా కొత్త ఆవిష్కరణలకు అలవాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులకనుగుణంగా ఉండాలన్నారు. నూతన ఆవిష్కరణలకు భారత్ హబ్‌గా రూపొందుతోందని పేర్కొన్నారు. దేశంలో సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోందని, రక్షణ రంగంలోనూ అనేక మార్పులు తీసుకొస్తోందని తెలిపారు.

# రాష్ట్రానికి నిధులు మంజూరు చేయించడం కిషన్‌రెడ్డి బాధ్యత



హైదరాబాద్: రాష్ట్రానికి నిధులు మంజూరు చేయించడం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బాధ్యతని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయనకు సీఎం లేఖ రాశారు.

కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రిగా ఉండగానే చెన్నై, బెంగళూరు మెట్రో విస్తరణకు ఆమోదం లభించిందన్నారు. హైదరాబాద్ మెట్రోపై మాత్రం పలుమార్లు విజ్ఞప్తి చేసినా పురోగతి లేదన్నారు. సబర్మతి, గంగా పునరుజ్జీవనంపై కిషన్‌రెడ్డి పలుమార్లు ప్రకటనలు చేశారని.. మూసీపై ఎందుకు విషం చిమ్ముతున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రాజెక్టుల విషయంలో కిషన్‌రెడ్డి పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. "ప్రాజెక్టులపై మాట్లాడితే.. మమ్మల్ని అడిగి ఇచ్చారా? అంటూ విమర్శిస్తున్నారు. నాది అవగాహనా రాహిత్యమని కిషన్‌రెడ్డి అనడం తీవ్ర అభ్యంతరకరం.

కేంద్ర మంత్రిగా ఉన్నమీరు తెలంగాణ ప్రజలకు ఏం చేశారో చెప్పండి? వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకు ఎదురుదాడి చేయడం సమంజసం కాదు. ఇకనైనా రాష్ట్ర ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని విజ్ఞప్తి చేస్తున్నాం" అని లేఖలో రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# యువతపైనే దేశ రక్షణ బాధ్యత: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: దేశ రక్షణ బాధ్యత యువతపైనే ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దేశ రక్షణలో హైదరాబాద్ దశాబ్దాలుగా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో డీఆర్‌డీవో ఆధ్వర్యంలో నిర్వహించిన 'విజ్ఞాన్ వైభవ్' ప్రదర్శనలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో కలిసి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. దేశ రక్షణలో తెలంగాణ పాత్ర కీలకంగా ఉందన్నారు. బీడీఎల్, హెచ్ఏఎల్, మిధాని వంటి కీలక సంస్థలు హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సైన్స్ ప్రదర్శన వల్ల విద్యార్థులు, యువతకు దేశరక్షణ పట్ల అవగాహన కలుగుతుందన్నారు. ప్రస్తుతం యువత ఐటీ ఉద్యోగాలవైపే మొగ్గు చూపుతోందని.. సంప్రదాయ ఇంజినీరింగ్ విద్యపై కూడా విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సీఎం సూచించారు.

# నా మూడు ప్రశ్నలకు హరీశ్‌రావు సమాధానం చెప్పాలి




హైదరాబాద్: ఎస్ఎల్‌బీసీ వద్ద ప్రమాదం వ్యవహారంలో రాజకీయ దురుద్దేశంతోనే మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు చేస్తున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన భారాస.. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును ఎందుకని పెండింగ్ పెట్టిందని ప్రశ్నించారు. ఈ మేరకు గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు.

"హరీశ్‌రావును నేను సూటిగా ప్రశ్నిస్తున్నా. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను 200 మీటర్లు తవ్వి మిగతాది ఎందుకు వదిలేశారు? తక్కువ లాభం వస్తుందనా? టన్నెల్ నిర్మాణం పూర్తి అయితే కాంగ్రెస్‌కు పేరు వస్తుందనా? నా మూడు ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పాలి. ప్రకృతి విపత్తులనూ భారాస నేతలు రాజకీయంగా వాడుకుంటున్నారు. అతి తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ఎస్ఎల్‌బీసీని ఎందుకు పెండింగ్‌లో పెట్టారు? ఈ ప్రాజెక్టు గురించి మాట్లాడే హక్కు భారాసకు లేదు. అద్భుతం జరిగితే తప్ప టన్నెల్‌లో చిక్కుకున్న 8 మంది బతికే అవకాశం లేదు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

ప్రమాదం జరిగినప్పుడు పనులు చేపట్టిన సంస్థ ప్రతినిధులు అప్రమత్తం చేసి ఉండకపోతే 40 మంది వరకు కార్మికులు చనిపోయేవారు" అని మంత్రి పేర్కొన్నారు.

# మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్



దిల్లీ: వరంగల్ జిల్లా మామునూరు విమానాశ్రయం అభివృద్ధికి కేంద్రం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు మామూనూరు ఎయిర్ పోర్ట్ ఆపరేషన్స్‌కి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఉత్తర్వులు ఇచ్చారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి 150 కి.మీ పరిధిలో మరో విమానాశ్రయం ఉండకూడదని గతంలో జీఎంఆర్ సంస్థతో ఒప్పందం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.. జీఎంఆర్‌తో ప్రత్యేకంగా చర్చలు జరిపారు. దీంతో మామునూరుకు జీఎంఆర్ అంగీకారం తెలిపింది. జీఎంఆర్ అంగీకారం తెలపడంతో విమానాశ్రయం పనులు చేపట్టేందుకు పౌరవిమానయాన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టాలని ఎయిర్ పోర్ట్ అథారిటీని రామ్మోహన్ నాయుడు ఆదేశించారు. ఎయిర్‌పోర్టు విస్తరణకు అవసరమైన 256 ఎకరాల భూ సేకరణకు రూ.205 కోట్లు విడుదల చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే జీవో విడుదల చేసింది. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సంబంధించి డిజైన్లతో కూడిన డీపీఆర్‌ను సిద్ధం చేయాలని ఎయిర్‌పోర్టు అథారిటీకి రోడ్లు, భవనాల శాఖ లేఖ రాసింది. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న 150 కి.మీ. ఒప్పందాన్ని జీఎంఆర్ సంస్థ విరమించుకుంది. ఇప్పటికే ఎయిర్‌పోర్టు పరిధిలో 696 ఎకరాల భూమి ఉంది. ఆ భూమికి అదనంగా మరో 253 ఎకరాల భూమిలో కొంత రన్‌వే విస్తరణ, టెర్మినల్ బిల్డింగ్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ), నేవిగేషన్ ఇన్‌స్ట్రుమెంట్ ఇన్‌స్టలేషన్ నిర్మాణాలు చేపట్టనున్నట్లు రోడ్లు, భవనాల శాఖ వెల్లడించింది. నిజాం కాలంలో మామునూరు నుంచి వాయుదూత్ విమానాలు నడిచేవి. భారత్, చైనా యుద్ధ సమయంలో కీలక సేవలందించాయి. దాదాపు 32 ఏళ్ల కిందట మూతపడిన మామునూరు విమానాశ్రయానికి మళ్లీ 'రెక్కలు' రానున్నాయి. అప్పుడప్పుడు శిక్షణ ఎయిర్‌క్రాఫ్ట్‌లు నడుస్తున్న ఈ విమానాశ్రయం నుంచి మళ్లీ విమానం ఎగరనుంది.

**మామునూరు ఎయిర్‌పోర్టు కల సాకారం: మంత్రి కోమటిరెడ్డి...**

రాష్ట్ర ప్రభుత్వం చొరవతో మామునూరు ఎయిర్‌పోర్టు కల సాకారమైందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి రావడంతో ఎయిర్‌పోర్టు పనులు వేగవంతమవుతాయన్నారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు కేంద్రం అనుమతి తెలపడం పట్ల మంత్రి కొండా సురేఖ హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేంద్ర పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

# ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యల్లో కీలక పురోగతి!



శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం (ఎస్ఎల్‌బీసీ)లో చిక్కుకున్న వారి కోసం కొనసాగుతోన్న సహాయక చర్యల్లో కీలక పురోగతి కనిపించింది. టన్నెల్‌లో చిక్కుకున్న వారి ఆచూకీని గుర్తించేందుకు పలువిధాలా గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్ టెక్నాలజీ ద్వారా సొరంగం స్కానింగ్ చేస్తుండగా.. ఐదుచోట్ల మెత్తని భాగాలు ఉన్నట్లు స్కానింగ్‌లో గుర్తించారు. టీబీఎం ముందు భాగం, దెబ్బతిన్నభాగంలో ఐదు మెత్తని భాగాలను గుర్తించారు. దీంతో చిక్కుకుపోయిన వారు అక్కడే ఉన్నట్లుగా సహాయక సిబ్బంది భావిస్తున్నారు. మరోవైపు, ఆ మెత్తని భాగాలు మానవ దేహాలు కావచ్చు.. కాకపోవచ్చు అని అధికారులు పేర్కొంటున్నారు. మెత్తని భాగాలు ఉన్నచోట తవ్వకాలు జరపనున్నారు. తవ్విన తర్వాత మానవ దేహాలా కాదా అనేది స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అలాగే, ఈ ఘటనలో గల్లంతైనవారి పరిస్థితిపై కాసేపట్లో అధికారిక సమాచారం వచ్చే అవకాశం ఉంది.




# కొన్నాళ్లు సైన్స్ అధ్యాపకుడిగా పనిచేశా: కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్

కొన్నాళ్లపాటు తాను సైన్స్ అధ్యాపకుడిగా పని చేశానని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా డీఆర్‌డీవో విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన ప్రదర్శనకు కేంద్ర రక్షణమంత్రి హాజరై ప్రసంగించారు.

నోబెల్ గ్రహీత సర్ సీవీ రామన్ ఫిబ్రవరి 28న రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్నారని.. ఆయన గౌరవార్థం ఏటా ఈరోజును జాతీయ సైన్స్ దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని గుర్తు చేశారు.

ప్రస్తుతం వ్యవసాయంతో పాటు అన్ని రంగాల్లో సైన్స్ ముఖ్యపాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. తాను కూడా సైన్స్ విద్యార్థినేనని.. కొన్నాళ్లు సైన్స్ అధ్యాపకుడిగా కూడా పనిచేసినట్లు పునరుద్ఘాటించారు. సైన్స్ వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులు గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులనుద్దేశించి ప్రసంగించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.

మానవ పరిణామ క్రమాన్ని, సైన్స్ అభివృద్ధిని విద్యార్థులు అధ్యయనం చేయాలని సూచించారు. ఇన్నోవేషన్, దేశ ప్రగతిలో విద్యార్థులదే కీలకపాత్రన్న ఆయన.. అందుకనుగుణంగా కొత్త ఆవిష్కరణలకు అలవాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులకనుగుణంగా ఉండాలన్నారు. నూతన ఆవిష్కరణలకు భారత్ హబ్‌గా రూపొందుతోందని పేర్కొన్నారు. దేశంలో సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోందని, రక్షణ రంగంలోనూ అనేక మార్పులు తీసుకొస్తోందని తెలిపారు.

# ప్రతి నియోజకవర్గంలో మినీ ఇండస్ట్రియల్ పార్క్: మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళల కోసం మినీ ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేస్తామని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఫిక్కిలో నిర్వహించిన తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ ఎంటర్‌ప్రైజెస్ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇండస్ట్రియల్ పార్కుల్లో ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తలకు 10 శాతం ప్రత్యేకంగా కేటాయిస్తామన్నారు. "ఎస్సీ, ఎస్టీలు ఎదిగితేనే సమాజం అభివృద్ధి చెందుతుంది. చేవెళ్ల డిక్లరేషన్‌లో దళితులకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం కచ్చితంగా నెరవేరుస్తుంది. దళితుల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేసే పార్టీ కాంగ్రెస్ మాత్రమే. ఓవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతూనే.. మరోవైపు సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించాం. పారిశ్రామికవేత్తలకు రాయితీగా అందాల్సిన బకాయిలు రూ.4500 కోట్లకు పైనే ఉన్నాయి. వీటిలో రూ.2,200 కోట్లు ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకే రావాల్సి ఉంది. మేం అధికారంలోకి రాగానే ఈ బకాయిల చెల్లింపుపై దృష్టి సారించాం. వచ్చే నెలలో రూ.300 కోట్లు చెల్లిస్తాం. ఎక్కువ మంది కార్మికులకు ఉపాధి అందించే ఎంఎస్ఎంఈ ప్రత్యేక పాలసీ తీసుకొచ్చాం. స్కిల్ సెంటర్లను ఏర్పాటు చేసి పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యమున్న మానవ వనరులను అందిస్తాం. కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. రుణాలు పొందటంలో ఔత్సాహిక ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరిస్తాం. తమిళనాడు, కర్ణాటకలో పారిశ్రామిక విధానాలపై అధ్యయనం చేయడానికి కమిటీని ఏర్పాటు చేస్తాం. ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు, పారిశ్రామికవేత్తలు, అధికారులతో కూడిన ప్రత్యేక బృందాన్ని నియమిస్తాం. ప్రత్యేక బృందం ఇచ్చే నివేదిక ఆధారంగా దళిత పారిశ్రామికవేత్తలకు మరింత ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటాం" అని శ్రీధర్‌బాబు తెలిపారు.

# భాజపా పాలనలో అన్ని విధాలుగా అణచివేత: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్: సమాజంలో అన్ని వర్గాలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. భాజపా పాలనలో దేశంలో అన్ని విధాలుగా అణచివేత కొనసాగుతోందని ఆరోపించారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. ఇప్పుడు జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమం అవసరమని వివరించారు. రాష్ట్రంలో కులగణన, ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. కుటుంబ సర్వేలో పాల్గొనని కేసీఆర్ కుటుంబం కూడా సామాజిక న్యాయం గురించి మాట్లాడుతోందని ఎద్దేవా చేశారు. ఏడాది కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని.. ప్రచారం చేయడంలో కొంత వెనుకబడిపోయామని తెలిపారు. దేశం మొత్తంలో తెలంగాణలోనే ఈ ఏడాది ఎక్కువ ధాన్యం పండించినట్లు పేర్కొన్నారు. అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని.. ఇవన్నీ జనంలోకి తీసుకెళ్లి ప్రచారం చేసుకోవాలని వివరించారు. పీసీసీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**FORM IV**

Statement about ownership and other particulars about newspaper ( Churakalu ) to be published in the first issue every year after the last day of February.

| | | |
|---|---|---|
| 1. Place of publication | : | H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001 |
| 2. Periodicity of its publication | : | DAILY |
| 3. Printer's Name | : | RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS |
| Nationality | : | INDIAN |
| Address | : | Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA. |
| 4. Publisher's Name | : | MOHAMMED IMRAN |
| Nationality | : | INDIAN |
| Address | : | H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001 |
| 5. Editor's Name | : | MOHAMMED IMRAN |
| Nationality | : | INDIAN |
| Address | : | H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001 |
| 6. Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | : | MOHAMMED IMRAN |

I, MOHAMMED IMRAN hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
MOHAMMED IMRAN
Signature of Publisher

Date 01-03-2025

# ప్రాథమిక హక్కుల పట్ల అవగాహన అవసరం

## - మార్చి 1....ప్రపంచ పౌర రక్షణ దినోత్సవం




ప్రతి సంవత్సరం మార్చి మొదటి తేదీన, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలు ప్రపంచ పౌర రక్షణ దినోత్సవాన్ని జరుపుకుంటారు. 1990లో, ఇంటర్నేషనల్ సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ ఈ రోజును ప్రపంచ పౌర రక్షణ దినంగా ప్రకటించింది. ఐసిడిఒ అనేది ఒక లాభాపేక్ష లేని ఇంటర్ గవర్నమెంటల్ ఆర్గనైజేషన్. పౌర హక్కుల పరిరక్షణ, సౌకర్యాల కల్పన, ప్రజల ఎదుగుదల, సురక్షితంగా ఉండటానికి సహాయ పడుతుంది. 59 దేశాలు ఐసిడిఒ లో సభ్యత్వం కలిగి ఉన్నాయి. ఇది ఆయా దేశాలలోని పౌర రక్షణ దళాల మానవ వనరుల నిర్వహణను మెరుగు పరచడానికి అనేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తుంది. అన్ని దేశాలు, ప్రజలందరికీ ఆదర్శ నీయమైన ఒక ఉమ్మడి ప్రమాణంగా పత్రాన్ని నిర్దేశిస్తూ
1948 డిసెంబరు 10న ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఐక్య రాజ్యసమితి సర్వప్రతినిధి సభ తీర్మానాన్ని ఆమోదించి, ప్రపంచ మంతటా పరిరక్షించు కోవాల్సిన ప్రాథమిక మానవ హక్కులను తొలిసారిగా నిర్దేశించింది. ఈ సందర్భంగా హక్కుల విషయంలో ఏ ఆర్టికల్ ఏమి సూచిస్తుంది అనే విషయం తెలుసు కుందాం.

ఆర్టికల్ 1: మనుషులందరికీ పుట్టుకతోనే స్వేచ్ఛ, సమానత్వం లభిస్తాయి. గౌరవం, హక్కుల విషయంలో అందరూ సమానులే. మనుషులందరికీ సొంత ఆలోచన, అంతః చేతన ఉంటాయి. ఒకరితో మరొకరు సోదరభావంతో మెలగాలి. ఆర్టికల్ 2: ఈ పత్రంలోని అన్ని హక్కులూ, స్వేచ్ఛలూ ప్రతి ఒక్కరికీ ఉంటాయి. జాతి, రంగు, లింగం, భాష, మతం లాంటి అంశాల ప్రాతిపదికగాగాని, రాజకీయ నేపథ్యం వల్లగాని, భిన్నాభిప్రాయం వల్లగాని, జాతీయ లేదా సామాజిక మూలాలవల్లగాని, సంపదలో వ్యత్యాసాల వల్లగాని, పుట్టుక లేదా ఇతర ప్రాతిపదికల వల్లగాని వివక్ష చూపడానికి వీల్లేదు.
వ్యక్తులను వారి దేశం లేదా భూభాగం రాజకీయ/అంతర్జాతీయ హోదా ఏమిటనేదాని ప్రాతిపదికగా ఎలాంటి వివక్షా చూపరాదు.
ఆర్టికల్ 3: జీవించే హక్కు, స్వేచ్ఛా హక్కు, స్వీయ భద్రతా హక్కు ప్రతి మనిషికీ ఉంటాయి.
ఆర్టికల్ 4: ఎవ్వరినీ బానిసగా చేసుకోవడానికి వీల్లేదు. బానిసత్వాన్ని, బానిస వ్యాపారాన్ని అన్ని రూపాల్లో నిషేధించాలి.
ఆర్టికల్ 5: ఎవ్వరినీ చిత్రహింసలకు గురిచేయరాదు. ఎవ్వరినీ క్రూరమైన, అమానవీయమైన, అవమాన కరమైన శిక్షకు గురిచేయరాదు.
ఆర్టికల్ 6: ప్రతి చోట చట్టం ముందు వ్యక్తిగా గుర్తింపు పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది.
ఆర్టికల్ 7: చట్టం ముందు అందరూ సమానులే. ఎలాంటి వివక్షా లేకుండా చట్టపరమైన రక్షణ పొందే హక్కు అందరికీ ఉంది. ఈ డిక్లరేషన్‌కు విరుద్ధంగా, ఎలాంటి వివక్షకు గురికాకుండా అందరికీ సమానమైన రక్షణ ఉంటుంది.
ఆర్టికల్ 8: రాజ్యాంగం, లేదా చట్టం కల్పించిన ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లే చర్యల విషయంలో సంబంధిత జాతీయ ట్రైబ్యునల్ నుంచి పరిష్కారం పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది.
ఆర్టికల్ 9: ఎవ్వరినీ ఏకపక్షంగా అరెస్టు చేయడానికిగాని, నిర్బంధించడానికిగాని, ప్రవాసానికి పంపించడానికిగాని వీల్లేదు.
ఆర్టికల్ 10: క్రిమినల్ నేరాభియోగాలపైగాని, తన హక్కులను, బాధ్యతలను నిర్ణయించే విషయంలోగాని స్వతంత్ర, నిష్పాక్షిక ట్రైబ్యునల్ ఆధ్వర్యంలో నిష్పాక్షిక, బహిరంగ విచారణ పొందే హక్కు ప్రతి ఒక్కరికీ సమానంగా ఉంది.
ఆర్టికల్ 11: (1) శిక్షార్హమైన నేరాభియోగాన్ని ఎదుర్కొంటున్న ప్రతి ఒక్కరూ, బహిరంగ విచారణలో చట్ట ప్రకారం దోషిగా తేలే వరకు నిర్దోషిగానే భావించాలి. ఈ మేరకు ఆ వ్యక్తికి హక్కు ఉంది. ఈ విచారణలో, తనను తాను రక్షించుకోవడానికి అవసరమైన అన్ని హామీలూ వ్యక్తికి ఉంటాయి.
(2) ఎవరైనా వ్యక్తి చేసిన తప్పిదం లేదా పని అది జరిగిన సమయానికి జాతీయ, లేదా అంతర్జాతీయ చట్టం ప్రకారం శిక్షార్హమైన నేరం కాకపోతే, ఆ వ్యక్తిని శిక్షార్హమైన నేరంలో దోషిగా ప్రకటించడానికి వీల్లేదు. శిక్షార్హమైన నేరం జరిగినప్పుడు వర్తించే శిక్ష కన్నా తీవ్రమైన శిక్షను విధించడానికి కూడా వీల్లేదు.
ఆర్టికల్ 12: ఏ ఒక్కరి వ్యక్తిగత గోప్యత, కుటుంబం, ఇల్లు, ఉత్తరప్రత్యుత్తర విషయాల్లో ఏకపక్షంగా జోక్యం చేసుకోవడానికిగాని, గౌరవ ప్రతిష్ఠలపై దాడి చేయడానికిగాని వీల్లేదు. అలాంటి జోక్యం, దాడుల నుంచి చట్టపరమైన రక్షణ పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. ఆర్టికల్ 13:(1) దేశంలో స్వేచ్ఛగా తిరిగే, నివసించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. (2) సొంత దేశం నుంచి లేదా ఏ దేశం నుంచి అయినా వెళ్లిపోయే హక్కు, తన దేశానికి తిరిగి వచ్చే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నాయి. ఆర్టికల్ 14: (1) పీడన నుంచి తప్పించుకొనేందుకు ఇతర దేశాలను ఆశ్రయం అడిగే, పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నాయి. (2) ఐక్యరాజ్యసమితి సూత్రాలకు, ప్రయోజనాలకు విరుద్ధమైన చర్యలు లేదా రాజకీయతేర నేరాలపై నిజమైన ప్రాసిక్యూషన్ జరిగే సందర్భంలో ఈ హక్కు ఉండకపోవచ్చు. ఆర్టికల్ 15: (1) ఏదైనా జాతీయతను కలిగి ఉండే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. (2) ఎవరికీ ఏకపక్షంగా జాతీయతను తొలగించకూడదు, అలాగే జాతీయతను మార్చుకొనే హక్కును నిరాకరించకూడదు. ఆర్టికల్ 16: (1) జాతి, జాతీయత లేదా మతం పరిమితులు లేకుండా పెళ్లి చేసుకొనేందుకు, కుటుంబాన్ని కలిగి ఉండేందుకు వయోజనులైన మహిళలకు, పురుషులకు హక్కు ఉంది. వివాహం చేసుకొనేటప్పుడు, వివాహ బంధంలో ఉన్న కాలంలో, దీనిని రద్దుచేసుకొనేటప్పుడు వారికి సమానమైన హక్కులు ఉంటాయి. (2) పెళ్లికి ఇద్దరు వ్యక్తుల్లో స్వేచ్ఛాయుత, సంపూర్ణ అంగీకారం ఉంటేనే పెళ్లి చేసుకోవాలి. (3) సమాజంలో కుటుంబమనేది ఒక సహజమైన, ప్రాథమికమైన భాగం. కుటుంబానికి సమాజం, రాజ్యం రక్షణ కల్పించాలి.
ఆర్టికల్ 17: (1) సొంతంగాగాని, ఇతరులతో కలసి గాని ఆస్తులు కలిగి ఉండేందుకు ప్రతి ఒక్కరికీ హక్కుంది. (2) ఎవరికీ ఏకపక్షంగా ఆస్తిని దూరం చేయడానికి వీల్లేదు.
ఆర్టికల్ 18: స్వేచ్ఛాయుత అంతఃచేతనత్వానికి, స్వేచ్ఛగా ఆలోచించడానికి, మతాన్ని పాటించడానికి ప్రతి ఒక్కరికీ హక్కు ఉంది. మతాన్ని లేదా విశ్వాసాన్ని మార్చుకొనే హక్కు ఇందులో భాగం. ఒంటరిగాగాని, ఇతరులతో కలిసిగాని ప్రైవేటుగాగాని, బహిరంగంగాగాని తన మతవిశ్వాసాలను పాటించే, బోధించే స్వేచ్ఛ, పూజించే స్వేచ్ఛ అందరికీ ఉన్నాయి.
ఆర్టికల్ 19: ప్రతి ఒక్కరికీ భావ ప్రకటనా హక్కు ఉంది. ఇతరుల జోక్యం లేకుండా సొంత అభిప్రాయాలు కలిగి ఉండే హక్కు, సరిహద్దులతో సంబంధం లేకుండా ఏ మార్గం నుంచైనా సమాచారం, ఆలోచనలు కోరే, స్వీకరించే హక్కు ఇందులో భాగం.
ఆర్టికల్ 20: (1) స్వేచ్ఛగా శాంతియుతంగా సమావేశమయ్యేందుకు, సంఘంగా ఏర్పడేందుకు ప్రతి ఒక్కరికీ హక్కుంది. (2) ఏదైనా సంఘంలో భాగస్వామి కావాలని ఎవరినీ బలవంతపెట్టడానికి వీల్లేదు.
ఆర్టికల్ 21: ప్రతి ఒక్కరికీ తమ దేశ ప్రభుత్వంలో ప్రత్యక్షంగా లేదా ఎంచుకున్న ప్రతినిధి ద్వారా భాగస్వామ్యమయ్యే హక్కు ఉంది.
1) ప్రతి ఒక్కరికీ తమ దేశంలో ప్రభుత్వ సేవలను సమానంగా పొందే హక్కు ఉంది. 2) ప్రభుత్వానికి ప్రజాభీష్టం ప్రాతిపదిక కావాలి. నిర్దేశిత కాలానికి జరిగే నిజమైన ఎన్నికల్లో ఈ ప్రజాభీష్టం వ్యక్తంకావాలి. ఈ ఎన్నికల్లో సార్వజనీన, సమానమైన ఓటు హక్కు ఉంటుంది. రహస్య ఓటింగ్ లేదా దానికి సమానమైన స్వేచ్ఛాయుత ఓటింగ్ నిర్వహించాలి.
ఆర్టికల్ 22: సమాజంలో సభ్యులుగా ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత హక్కు ఉంది. తన గౌరవానికి, తన వ్యక్తిత్వం స్వేచ్ఛగా అభివృద్ధి చెందటానికి ఆవశ్యకమైన ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులను జాతీయ కృషి, అంతర్జాతీయ సహకారం ద్వారా దేశ వనరులకు అనుగుణంగా సాధించుకునే హక్కు ఉంది. ఆర్టికల్ 23: (1) ప్రతి ఒక్కరికీ పని చేయడానికి హక్కుంది. స్వేచ్ఛగా కోరుకొన్న ఉపాధిని పొందడానికి, పనిచేయటానికి న్యాయమైన, అనుకూలమైన పరిస్థితులు పొందడానికి, నిరుద్యోగిత నుంచి రక్షణ పొందటానికి అందరికీ హక్కుంది. (2) ప్రతి ఒక్కరికీ ఎలాంటి వివక్షా లేకుండా సమాన పనికి సమాన వేతనం పొందే హక్కు ఉంది. (3) పని చేసే ప్రతి ఒక్కరికీ తాను, తన కుటుంబం మానవ గౌరవంతో మనుగడ సాగించటానికి హామీ ఇచ్చేలా న్యాయమైన, అనుకూలమైన వేతనం పొందే హక్కు ఉంది. అవసరమైతే ఇతర మార్గాల్లో అదనంగా సామాజిక రక్షణ పొందే హక్కు ఉంది. (4) ప్రతి ఒక్కరికీ తన ప్రయోజనాలను కాపాడుకోవటం కోసం కార్మిక సంఘాలు ఏర్పాటు చేయటానికి, వాటిలో చేరటానికి హక్కు ఉంది. ఆర్టికల్ 24: ప్రతి ఒక్కరికీ పనిగంటలకు హేతుబద్ధమైన పరిమితిని, నిర్దేశిత కాలానికి వేతనంతో కూడిన సెలవులను పొందే హక్కు, విశ్రాంతి, విరామం తీసుకునే హక్కు ఉన్నాయి. ఆర్టికల్ 25: (1) ప్రతి వ్యక్తికీ ఆహారం, దుస్తులు, నివాసం, వైద్యసేవలు, ఇతర సామాజిక సేవలు సహా.. తను, తన కుటుంబ ఆరోగ్య, సంక్షేమాలకు తగిన జీవన ప్రమాణం పొందే హక్కు ఉంది. నిరుద్యోగం, అనారోగ్యం, వైకల్యం, వైధవ్యం, వృద్ధాప్యం లేదా తన నియంత్రణలో లేని ఇతర కారణాల వల్ల జీవనోపాధి లేకపోవటం నుంచి భద్రత పొందే హక్కు ఉంది. (2) మాతృత్వం సమయంలో మహిళలకు, బాల్యదశలో చిన్నారులకు ప్రత్యేక సేవ, సహాయాలు పొందే హక్కు ఉంది. పెళ్లి ద్వారా పుట్టినా, పెళ్లి కాకుండా పుట్టినా చిన్నారులు అందరికీ సమానమైన రక్షణ లభించాలి.
ఆర్టికల్ 26:(1) ప్రతి ఒక్కరికీ విద్యాహక్కు ఉంది. కనీసం ప్రాథమిక, మౌలిక స్థాయుల్లో అయినా అందరికీ విద్య ఉచితంగా అందాలి. ప్రాథమికవిద్య తప్పనిసరిగా ఉండాలి. సాంకేతిక విద్య, వృత్తినైపుణ్య విద్య అందుబాటులో ఉండాలి. ఉన్నతవిద్య ప్రతిభ ప్రాతిపదికన అందరికీ సమానంగా అందుబాటులో ఉండాలి. (2) మానవ వ్యక్తిత్వం సంపూర్ణంగా వికసించేలా, మానవ హక్కులను, మౌలిక స్వాతంత్ర్యాలను గౌరవించేదిగా విద్య ఉండాలి. (3) తమ పిల్లలకు ఏ తరహా విద్య అందించాలో ఎంచుకునే హక్కు తల్లిదండ్రులకు ఉంది. ఆర్టికల్ 27: (1) ప్రతి ఒక్కరికీ సమాజ సాంస్కృతిక జీవనంలో స్వేచ్ఛగా పాలుపంచుకోవడానికి, కళలను ఆస్వాదించడానికి, శాస్త్రీయ పురోగతిలో, వాటి ప్రయోజనాల్లో భాగం పంచుకోవడానికి హక్కు ఉంది. (2) ప్రతి వ్యక్తికీ తను సృజించిన ఎలాంటి శాస్త్రీయ, సాహిత్య, కళా ఉత్పత్తుల నుంచి లభించే నైతిక, భౌతిక ప్రయోజనాలను పరిరక్షించుకునే హక్కు ఉంది. ఆర్టికల్ 28: ఈ ప్రకటనలో నిర్దేశించిన హక్కులు, స్వాతంత్ర్యాలు సంపూర్ణంగా సాకారమయ్యే సామాజిక, అంతర్జాతీయ పరిస్థితులు పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. ఆర్టికల్ 29: తన వ్యక్తిత్వం సంపూర్ణంగా వికసించటం సాధ్యమయ్యే సమాజం పట్ల ప్రతి ఒక్కరికీ బాధ్యతలు కూడా ఉన్నాయి. (1) ప్రతి ఒక్కరూ తన హక్కులు, స్వాతంత్ర్యాలను వినియోగించుకొనే క్రమంలో– ప్రజాస్వామ్య సమాజంలో ఇతరుల హక్కులు, స్వాతంత్ర్యాలకు తగిన గుర్తింపు, గౌరవం, నైతికత, శాంతిభద్రతలు, సాధారణ సంక్షేమం కోసం చట్టం నిర్దేశించిన పరిమితులకు మాత్రమే లోబడి ఉండాలి. (2) ఈ హక్కులు, స్వాతంత్ర్యాలను ఏ విధంగానూ ఐక్యరాజ్యసమితి లక్ష్యాలు, సూత్రాలకు వ్యతిరేకంగా ఉపయో గించరాదు. ఆర్టికల్ 30: ఈ ప్రకటనలోని ఏ అంశమైనా ఇందులో నిర్దేశించిన హక్కులు, స్వాతంత్ర్యాల్లో దేనినైనా ధ్వంసం చేసేందుకు, లేదా ఏమైనా చేసేందుకు ఏ రాజ్యానికీ, సంఘానికీ, వ్యక్తికీ వీలు కల్పిస్తున్నట్లు భావించరాదు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ఆంధ్రరాష్ట్ర తొలి శాసన సభాపతి నల్లపాటి వెంకటరామయ్య - మార్చి 1... నల్లపాటి జయంతి



నల్లపాటి వెంకటరామయ్య ( 1901 మార్చి 1 – 1983 జూన్ 28) న్యాయవాది, రాజకీయవేత్త, ఆంధ్రరాష్ట్ర తొలి శాసన సభాపతి. ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నరసరావుపేట సమీపంలోని జొన్నలగడ్డ గ్రామంలో అంకమ్మ, కోటమ్మ దంపతులకు 1901, మార్చి 1న జన్మించారు. నరసరావుపేటలో ఎస్ ఎస్ యల్ సి, గుంటూరులో ఇంటర్ పూర్తి చేశారు. మద్రాసులోని పచ్చయప్ప కళాశాలలో బిఏ పట్టభద్రుడయ్యారు. వినుకొండ రెవెన్యూ ఆఫీసులో గుమాస్తాగా చేరి బ్రిటిష్ వారి కొలువులో ఇమడలేక ఉద్యోగం వదిలివేశారు. తిరిగి మద్రాసు వెళ్ళి న్యాయశాస్త్రం అభ్యసించి న్యాయవాది అయ్యారు. గుంటూరులో న్యాయవాది అన్నవరాజు సీతాపతిరావు వద్ద సహాయకునిగా కొంతకాలం పనిచేసి 1928లో నరసరావుపేటలో న్యాయ వాదిగా కొనసాగారు. పల్నాడు ప్రాంతంలో న్యాయవాదిగా కీర్తిప్రతిష్టలను పొందారు. 1932లో వెంకటరామయ్య తాలూకా బోర్డు అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ సెనేట్ మెంబరుగా నియమితులై విద్యావ్యాప్తికి కృషి చేశారు. 1952లో నరసరావుపేట నియోజకవర్గం నుండి కాసు వెంగళరెడ్డిపై పోటీ చేసి శాసనసభ్యునిగా గెలిచారు. 1953 అక్టోబరు 1న స్పీకర్ పదవికి ఎన్నిక జరగగా కందవల్లి కృషారావుపై వెంకటరామయ్య గెలుపొందారు. 1953 అక్టోబరు 1న ఆంధ్రరాష్ట్రం ఏర్పడి ప్రకాశం ముఖ్యమంత్రిగా ఎన్నుకొన బడగా, 1953 నవంబరు 23న వెంకటరామయ్య సభాపతిగా ఎన్నికయ్యారు. వెంకటరామయ్య గెలుపును ముఖ్యమంత్రి ప్రకాశం పంతులు ప్రతిష్టాత్మకంగా భావించారు. తొలి శాసనసభ స్పీకర్ గా వెంకటరామయ్య చరిత్రలో నిలిచి పోయారు. 25 సంవత్సరాలు న్యాయవాద వృత్తిలో కొనసాగిన వెంకట రామయ్య శాసనసభను కూడా న్యాయబద్ధంగా నడిపారు. శాసనసభను నిబంధనల మేరకు సజావుగా నడిపించి అన్ని పార్టీల వారి అభిమానాన్ని చూరగొన్నారు. 1955లో కరణం రంగారావుపై ఐక్య కాంగ్రెస్ అభ్యర్థిగా, శాసనసభ్యునిగా గెలిచారు. 1962లో రాజకీయాల నుండి వైదొలగి 1978వరకు న్యాయవాది వృత్తిలో కొనసాగారు. 1983 జూన్ 28న నరసరావుపేటలో కన్నుమూశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# దేశం గర్వించ దగ్గ సివిల్ సర్వెంట్ పరికిపండ్ల నరహరి

## మధ్య ప్రదేశ్ రాష్ట్రంలో నరహరి అనితర సేవలు






ఒక సాధారణమైన టైలర్ కుటుంబంలో జన్మించి సామాజికంగా, ఆర్థికంగా ఎన్నో ఒడిదొడుగులను ఎదుర్కొని భారతదేశం గర్వించదగిన స్థానంలో నిలిచారు శ్రీ పరికిపండ్ల నరహరి, ఐఏఎస్. తను పదవ తరగతి చదువుతున్న రోజుల్లోనే ఐఏఎస్ అధికారి కావాలని ధృఢ సంకల్పంతో... ఆ దిశగా అడుగులు వేస్తున్న క్రమంలో అడుగడుగున ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తన తండ్రితో మొదటి సారి ఇంజనీరింగ్ కౌన్సిలింగ్ కోసం హైదరాబాద్ వెళ్ళినప్పుడు భోజనం చేయడానికి కూడా డబ్బులు లేని పరిస్థితిని ఈ రోజుకు కూడా పలు సందర్భాల్లో ఆయన గుర్తు చేసు కుంటారు. ఎన్ని కష్టాలు వచ్చిన తన గమ్యం ముందర అవి చిన్నగానే కనిపించేవనీ చెప్తారు. ఇంటి నుండి ప్రతి నెల డబ్బులు పంపించలేని పరిస్థితి ఉండడంతో నెల వారి కర్చులకోసం ట్యూషన్స్ చెప్తూ ఇంజనీరింగ్ లో యూనివర్సిటీ టాపర్ గా నిలిచిన గొప్పతనం ఆయనది. ఇంజనీరింగ్ పూర్తి చేసుకొని ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసేస్ లో ఉత్తీర్ణత సాధించి ఒక సంవత్సరం పాటు సైంటిస్ట్ గా సేవలు అందించారు. ఆర్థిక ఇబ్బందుల వలన ఒక సంవత్సరం పాటు IES ఉద్యోగం చేసి తరువాత ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రభుత్వ స్టడీ సర్కిల్లో పూర్తి స్థాయిలో సివిల్స్ కోసం ప్రిపరేషన్ మొదలు పెట్టారు. 2001 లో సివిల్స్ లో ఆల్ ఇండియా 84వ ర్యాంక్ సాధించి మధ్య ప్రదేశ్ క్యాడర్ IAS అధికారిగా నియమింప బడ్డారు. ఎన్నో ఆశలు, ఆశయాలతో ఆ స్థానంలో నిలిచిన వారు ప్రతి పోస్టింగ్ లో తన మార్క్ పనితనంతో ప్రజల మరియు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల మన్ననలు పొందుతున్నారు. మునిసిపల్ కమిషనర్ మొదలుకొని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శిగా మధ్య ప్రదేశ్ లోని ఎన్నో జటిలమైన సమ్యసలకు సమాధానంగా నిలిచారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అందించిన అవార్డులే వారి పని తీరుకు నిదర్శనం. నరహరి హమారా లాడ్లి లక్ష్మి యోజన(బంగారు తల్లి) పథకం రూపొందించారు. భేటీ బచావో – భేటీ పడావో పథకానికి పునాదులు వేసారు. సోషల్ మీడియా ద్వారా గ్రివియన్స్ మొదలుపెట్టిన మొదటి ఐఏఎస్ అధికారిగా నిలిచారు. హరియాలి (హరిత హారం) అనే కార్యక్రమంతో ఒకే రోజు లక్ష మొక్కలని నాటించారు. ఇండోర్ సిటిని స్వచ్ సర్వెక్షన్ లో క్లీనేస్ట్ సిటి ఆఫ్ ఇండియా గా నిలిపారు. ఇండోర్ జిల్లాని బహిరంగ మల మూత్ర విసర్జన రహిత జిల్లాగా నిలిపారు. గ్వాలియర్ జిల్లాలోని 95 శాతం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మరియు జనసంద్రంగా ఉండే ప్రదేశాల్లో దివ్యాంగులకోసం కచ్చితంగా రాంప్ లు కట్టించారు. స్కిల్ డెవలప్మెంట్ స్కీమ్స్ ద్వారా ఒక్క సంవత్సరంలో 36 లక్షల మంది యువకులకు బ్యాంకుల ద్వారా ఋణాలు ఇప్పించే కార్యక్రమం చేపట్టారు. నరహరి ఎన్నో రాష్ట్ర ప్రభుత్వ అవార్డులు అందుకున్నారు. వికలాంగులకోసం వారు చేసిన సేవలను మరియు స్వచ్ సర్వెక్షన్ – ఇండోర్ కు గానూ కేంద్ర ప్రభుత్వం గుర్తించి రాష్ట్రపతి అవార్డు అందించారు. ప్రతి సంవత్సరం భారతదేశ ఉత్తమ ఐఏఎస్ అధికారులలో పలు ఏజెన్సీస్ మరియు ప్రభుత్వం ఇచ్చే జాబితాలో టాప్ 5 ఐఏఎస్ అధికారిగా నిలిచారు. మధ్య ప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్ అధికారిగా విధులు నిర్వర్తిస్తు అన్ని విజయాలు సాధించినప్పటికి తను పుట్టిన గడ్డకి సేవా చేయాలని ఆలోచనతో తన మిత్ర బృందం ద్వారా ఆలయ ఫౌండేషన్ ని స్థాపించి విద్యా, వైద్య మరియు ఉపాధి రంగాలలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. మారుమూల గ్రామాల్లో, తండాల్లో మెడికల్ క్యాంప్స్ నిర్వహిస్తున్నారు. తలసెమ్మియా పిల్లల కోసం రక్తదాన శిబిరాలు వందలాది కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. వెయ్యి మందికి పైగా వికలాంగులకు కృత్రిమ అవయవాలు, వీల్ చైర్స్, ట్రై సైకిల్స్, వినికిడి యంత్రాలను అందించారు, నిరంతరాయంగా అందిస్తున్నారు. ఎన్నో పాఠశాలల్లో, కళాశాలల్లో, యూనివర్సిటీలలో స్వయంగా వ్యక్తిత్వ వికాసా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మోటివేషనల్ స్పీకర్స్ ద్వారా వేల సంఖ్యలో కార్యక్రమాలు ఫౌండేషన్ ద్వారా చేపట్టారు. కార్పొరేట్ కంపెనీలలో యువతీ, యువకులకు ఉచిత నైపుణ్య శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. బసంతనగర్ లో శంకర వారి సహకారంతో ఆలయ ఫౌండేషన్ ఉచిత కంటి ఆసుపత్రి నిర్మించి వేల సంఖ్యలో నిరంతరాయంగా ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. రాజ్యాంగ బద్ధంగా అన్ని అవకాశాలు అందరికీ దక్కాలి, నిర్ణయాత్మకమైన స్థానాల్లో అన్ని వర్గాల ప్రజలు ఉంటేనే సామాజిక న్యాయం జరుగుతుందని, నాయకులుగా ఎదిగే అవకాశం అందరికి రావాలని, నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసే ఆలోచన ఉన్న యువతకి లీడర్షిప్ ట్రైనింగ్ క్లాసెస్ జన అధికార సమితి ద్వారా నిర్వహిస్తున్నారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అన్ని అవకాశాలు అన్ని వర్గాలు అందిపుచ్చుకొని విధంగా అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నారు. నైపుణ్యం కలిగిన యువతీ యువకులకు మరియు బ్యాంకులకు వారధిగా BICCI సంస్థ ఉంటు లోన్లు వచ్చే విధంగా సహకారం అందిస్తున్నారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాల మిస్ట్...9440595494**



# పోసానికి 14 రోజుల రిమాండ్

రైల్వే కోడూరు: కులాలు, సినీ అభిమానులు, రాజకీయ పార్టీల మధ్య విద్వేషాలు, వైషమ్యాలు రెచ్చగొట్టేలా వ్యవహరించారంటూ నమోదైన కేసులో వైకాపా నేత, సినీనటుడు పోసాని కృష్ణమురళికి అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. గురువారం రాత్రి 9.30 గంటల నుంచి శుక్రవారం ఉదయం 5 గంటల వరకు ఇరుపక్షాల మధ్య సుదీర్ఘంగా వాదనలు కొనసాగాయి. పోసాని తరపున పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. బీఎన్ఎస్ చట్టం ప్రకారం పోసానికి 41ఏ నోటీసులు ఇచ్చి బెయిల్ ఇవ్వాలని పొన్నవోలు కోర్టును కోరారు. అందుకు నిరాకరించిన మెజిస్ట్రేట్ 14 రోజుల వరకు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. మార్చి 12 వరకు పోసాని రిమాండ్‌లో ఉండనున్నారు. పోసానిని రాజంపేట సబ్ జైలుకు తరలించారు.

# చురకలు

## సంపాదకీయం

## తెలంగాణలో భారీ పోలింగ్.. అంతర్మథనంలో అధికార పార్టీ!

తెలంగాణలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన పోలింగ్‌లో భారీ ఓట్లు నమోదయ్యాయి. కొన్ని చోట్ల పోలింగ్ 94 శాతానికి చేరగా.. రమారమి అన్ని చోట్లా 80 శాతం వరకు పోలింగ్ నమోదైంది. ఎక్కడా 70 శాతానికి తక్కువగా పోలింగ్ నమోదు కాకపోవడం గమనార్హం.

దీంతో అధికార పార్టీ కాంగ్రెస్ అంతర్మథ నంలో పడిపోయింది. వాస్తవానికి ఎక్కువ పోలింగ్ నమోదైతే.. ప్రభుత్వ వ్యతిరేకతకు సంకేతం గా ఉంటుందన్న చర్చ ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు తర్జన భర్జన పడుతున్నారు.

**ఎక్కడెక్కడ ఎలా ఎలా?...** తెలంగాణలో ఒక గ్రాడ్యుయేట్.. రెండు టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల పోలింగ్ గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగింది. వరంగల్-నల్గొండ-ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, కరీంనగర్-మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్ ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు పోరు సాగింది. ఈ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మంచిర్యాల సహా పలు ప్రాంతాల్లో సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఎన్నికల ప్రచారం లో పాల్గొన్నారు. ఇక, ఈ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ పోటీకి దూరంగా ఉంది. అయితే.. లోపాయికారీగా.. వేరే వ్యక్తులకు మద్దతు ఇచ్చినట్టు సమాచారం. మరోవైపు.. బీజేపీ అభ్యర్థులు, మద్దతు దారులు కూడా ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ నేరుగా ప్రచార పర్వంలోకి దిగారు. దీంతో ఎన్నికలు సాధారణ ఎన్నికల పోరును తలపించాయి. ఈ నేపథ్యంలో ఓటింగ్ శాతం పెరగడంతో అది తమకు లాభిస్తుందని.. ప్రభుత్వ వ్యతిరేకత కనిపించిందని బీజేపీ నాయకులు చెబుతున్నారు.

**ఎక్కడెక్కడ ఎలా ఎలా ?....** వరంగల్- నల్గొండ- ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి.. 93.55 పోలింగ్ శాతం నమోదైంది. ఒక్క నల్గొండలో 90 శాతం పోలింగ్ నమోదు కాగా.. వరంగల్ జిల్లాలో 80 శాతం పోలింగ్ దాటింది. ఖమ్మంలోనూ 80 శాతం పోలింగ్ నమోదైంది. కరీంనగర్- మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్ టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో 77.95 శాతం పోలింగ్ దాటినట్టు లెక్కలు చెబుతున్నాయి. కరీంనగర్- మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంలో 82 శాతం పోలింగ్ నమోదైంది. ఇది ఊహించిన దానికన్నా 20 శాతం ఎక్కువని కాంగ్రెస్ నాయకులు చెబుతుండగా.. తాము ఊహించిందనేనని.. రేవంత్ సర్కారుపై విసిగిపోయిన నిరుద్యోగులు.. తమకే మద్దతు పలికారని కమలనాథులు చెబుతున్నారు. కాగా.. ఎన్నికల కౌంటింగ్ మార్చి 3వ తేదీన నిర్వహించనున్నారు.

# భక్తుల కోరికలు నెరవేర్చే యాదగిరి లక్ష్మీనరసిం హుడు - మార్చి 1నుండి మార్చి 11 వరకు బ్రహ్మోత్సవాలు

తెలంగాణలోని ప్రముఖ ఆలయాలలో ఒకటైన, ఉమ్మడి నల్లగొండజిల్లా (ప్రస్తుత యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండల కేంద్రము సమీపములో ఎత్తయిన గుట్టపై ఉన్న శ్రీలక్ష్మి నరసింహస్వామి దేవాలయములో మార్చి 1నుండి మార్చి 11వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. ఋష్యశృంగ మహర్షి, శాంతల పుత్రుడు యాదమహర్షి చిన్నతనం నుంచే హరి భక్తుడు. ఆంజనేయస్వామి సలహాపై ప్రస్తుతం యాదగిరిగా పిలవబడుతున్న ప్రదేశంలో చాలా కాలం తపస్సు చేశారు. అప్పుడు ఒక రాక్షసుడు ఆహార అన్వేషణలో అటుగావచ్చి నిశ్చల తపస్సులో వున్న ఈ ఋషిని చూసి తినబోయాడు. ఆ విషయం తపస్సులోవున్న ఋషికి తెలియలేదు గానీ, ఆయన ఎవరి గురించైతే తపస్సు చేస్తున్నాడో ఆ శ్రీ హరి ఆయుధం అయిన సుదర్శన చక్రం వచ్చి ఆ రాక్షసుని సంహరించింది. అది చూసిన ఋషి ఆ సుదర్శన చక్రాన్ని పలు విధాల ప్రార్థించి, భక్తులకు వివిధమైన బాధలు కలుగకుండా దుష్ట సంహారం చేస్తూ అక్కడే వుండిపొమ్మని కోరగా ఆ సుదర్శనము అనతికాలం లోనే అక్కడ వెలయ బోవుచున్న లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ శిఖరాన షట్కోణాకారాన వెలసి స్వామి దర్శనానికి వచ్చు భక్తులను సదా కాపాడుతూ వుంటానని వరమిచ్చి అంతర్ధానం అయినట్టు కథనం. యాద మహర్షి తన తపస్సును కొనసాగించగా, ఆయన తపస్సుకి మెచ్చి నరసింహస్వామి ప్రత్యక్షమై, యాద మహర్షి కోరిక మీద అక్కడ లక్ష్మీ నరసింహస్వామి గా వెలిశాడు. ఆ ఋషి కోరిక మీదే ఆ కొండ యాదగిరిగా ఋషి పేరుమీద ప్రసిద్ధికెక్కింది. ఆ ఋషి తపస్సు చేసింది, స్వామి ప్రత్యక్షమైంది కొండక్రిందవున్న పాత లక్ష్మీ నరసింహస్వామి గుడి దగ్గర అని అంటారు. యాద మహర్షి కోరిక మీదే ఆంజనేయస్వామి యాదగిరిలో క్షేత్రపాలకుడుగా వున్నాడు. ప్రహ్లాదుని రక్షించటానికి, అహోబిలంలో నరసింహస్వామి స్తంభాన్ని చీల్చుకుని వచ్చి హిరణ్యకశిపుని సంహరించిన తర్వాత ఆ భీకర రూపాన్ని శాంత పరచటం ఎవరికీ సాధ్యం కాలేదట. అప్పుడు దేవతలంతా లక్ష్మీదేవిని ప్రార్థిస్తే ఆమె ప్రత్యక్షమై స్వామిని శాంతింప చేసిందట. అప్పుడు ప్రహ్లాదుడు స్వామిని అక్కడే ప్రసన్న రూపంలో కొలువై వుండమని కోరాడట. అయితే స్వామి అతి భీకర రూపంలో దర్శనమిచ్చిన ఆ ప్రదేశంలో శాంత రూపంతో కొలువై వుండటం లోక విరుద్ధమని అక్కడికి సమీపంలో వున్న యాదగిరిలో లక్ష్మీ నరసింహస్వామి గా లోక కళ్యాణార్థం కొలువు తీరుతానని బయల్దేరారు, లక్ష్మీ సమేతుడై కొండపై గల గుహలో వెలిశారు. ఆయనవెంట ప్రహ్లాదుడూ, సకల దేవతలు వచ్చి ఆయనతోపాటు ఇక్కడ కొలువుతీరి స్వామిని సేవిస్తూ వచ్చారట. రాక్షస సంహారంచేసి లోక కళ్యాణం



చేశారని సంతోషంతో స్వామివారి కాళ్ళని బ్రహ్మదేవుడు ఆకాశ గంగతో కడిగాడట. ఆ ఆకాశ గంగ లోయలలోంచి పారి విష్ణు పుష్కరిణిలోకి చేరింది. ఈ పుష్కరిణికి కూడా చాలా ప్రాముఖ్యం వుంది. ఇందులో స్నానంచేసి స్వామిని సేవించినవారికి సకల కోరికలూ తీరుతాయి. ఇక్కడ పితృకార్యాలు చేస్తే పితృ దేవతలు తరిస్తారు. చాలామంది భక్తులు ఆరోగ్యం, గ్రహపీడా నివారణ, వగైరా కోరికలతో కొన్నాళ్ళపాటు ఇక్కడ వుండి విష్ణు పుష్కరిణిలో స్నానం చేసి స్వామిని సేవిస్తారు. అంతేగాక ఇప్పటికీ రోజూ రాత్రుళ్ళు ఆ చుట్టుప్రక్కల కొండలమీద తపస్సు చేసుకుంటున్న ఋషులు విష్ణు పుష్కరిణిలో స్నానంచేసి స్వామిని అర్చిస్తారట. దానికి నిదర్శనంగా వారు వచ్చేటప్పుడు మృదంగ ధ్వనులు వస్తాయట. పాదాల గుర్తులు కొందరు చూశారుట. వారు స్వామిని అర్చించిన గంధ పుష్పాదులు కూడా నిదర్శనమంటారు. మెట్ల మార్గాన వెళ్తే దోవలో శివాలయం కనబడుతుంది. ఇక్కడ శివుడు లక్ష్మీ నరసింహస్వామి కన్నా ముందు స్వయంభూగా వెలిశాడు. ఇంకో విశేషం .. ఈ మెట్లు ఎక్కి స్వామిని సేవించినవారి కీళ్ళ నొప్పులు తగ్గుతాయని భక్తుల విశ్వాసం యాదగిరి లక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయ ముఖద్వారం యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం నల్గొండ జిల్లాలో ప్రముఖ మైన దివ్య క్షేత్రం: యాదగిరి గుట్టకు సంబందించిన కథకు మూలం వాల్మీకి రామాయణంలో వున్నది. విభాండక ఋషి కుమారుడు రుష్యశృంగుడు. అతని కుమారుడు హాద ఋషి, అతనినే హాదర్షి అని కూడ అంటారు. అతను నరసింహ స్వామి భక్తుడు. అతనికి స్వామివారిని ప్రత్యక్షంగా చూడాలని కోరిక పుట్టింది. ఆంజనేయస్వామి సలహా మేరకు తపస్సు చేయగా స్వామి ప్రత్యక్షమవుతాడు. ఆ ఉగ్ర నరసింహ మూర్తిని చూడలేక శాంత స్వరూపంతో కనిపించమని యాదర్షి కోరగా స్వామి వారు కరుణించి లక్ష్మి సమేతుడై దర్శన మిచ్చి "ఏంకావాలో కోరుకో" మంటే యాదర్షి స్వామి వారికి "శాంత మూర్తి రూపంలోనె కొలువై కొండపై ఉండి పొమ్మని కోరాడు. ఆవిధంగా లక్ష్మి నరసింహ స్వామి కొండపై అలా కొలువై ఉండి పోయాడు. కొన్నాళ్ళకు స్వామివారిని వేర్వేరు రూపాల్లో చూడాలనిపించి యాదర్షి మరలా తపస్సు చేశాడు. అతని కోరిక మేరకు స్వామి వారు జ్వాలా, యోగా, నంద, గండబేరుండ, నారసింహ రూపాల్లో దర్శనమిచ్చాడు. అందుకే ఈ క్షేత్రాన్ని పంచ నారసింహ క్షేత్రం అంటారు. ఆ ఋషి కోరిక మీదే ఆ కొండ యాదగిరిగా ఋషి పేరుమీద ప్రసిద్ధికెక్కింది. బ్రహ్మోత్సవాలు తొలిరోజు ఈ నెల 1న విశ్వక్సేన ఆరాధనతో ఆరంభమై అలంకార అవతార సేవలతో కొనసాగి మార్చి 11న చక్రస్నానం, మహాపూర్ణాహుతితో ముగుస్తాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా 1న ఉదయం 10 గంటలకు విశ్వక్సేన ఆరాధన, స్వస్తివాచనం, రక్షాబంధనం, సాయంత్రం మృత్సాంగ్రహణం, అంకురారోహణ పర్వాలు నిర్వహిస్తారు. 2 ఉదయం 8 గంటలకు అగ్ని ప్రతిష్ట, 11 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం 6:30 గంటలకు భేరీ పూజ, హవనం, దేవతాహ్వానం నిర్వహిస్తారు. 3న ఉదయం తొమ్మిది గంటలకు మత్స అవతార అలంకార సేవ, వేద పారాయణం, రాత్రి 7 గంటలకు శేష వాహన సేవ, 4న ఉదయం 9 గంటలకు వటపత్ర శాయి అలంకార సేవ , రాత్రి 7 గంటలకు హంస వాహన సేవ, 5 ఉదయం 9 గంటలకు శ్రీకృష్ణలంకార సేవ, రాత్రి 7 గంటలకు పొన్నవాహన సేవ, 6న ఉదయం 9 గంటలకు గోవర్ధన గిరి దారి అలంకార సేవ, రాత్రి 7 గంటలకు సింహ వాహన సేవ, 7న ఉదయం 9 గంటలకు జగన్మోహిని అలంకార సేవ, రాత్రి 7 గంటలకు అశ్వవాహన సేవ, తదుపరి శ్రీ స్వామి వారి ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు. 8న ఉదయం 9 గంటలకు శ్రీరామ అలంకార హనుమంత వాహనం సేవ , రాత్రి 8 గంటలకు గజవాహన సేవ, శ్రీ స్వామి అమ్మవార్ల తిరు కళ్యాణోత్సవం నిర్వహిస్తారు. 9వ తేదీన ఉదయం 9 గంటలకు మహా విష్ణు అలంకారం, గరుడోత్సవము, రాత్రి 8 గంటలకు దివ్యవిమాన రథోత్సవం, 10వ తేదీన ఉదయం 10.30 గంటలకు మహా పూర్ణాహుతి, చక్రతీర్థం, సాయంత్రం 7 గంటలకు శ్రీ పుష్పయాగం, దేవతో ద్వాసన, 11వ తేదీన ఉదయం 10 గంటలకు శ్రీ స్వామివారికి అష్టోత్తర శతకటాభిషేకం, రాత్రి 9 గంటలకు శ్రీ స్వామివారి శృంగార డోలోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. దేవస్థానం ఈఓ భాస్కర్ రావు నేతృత్వంలో అధికారులు, అర్చకులు, సిబ్బంది వివిధ శాఖల అధికారుల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లలో తలమునకలై ఉన్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# కఠోర నియమాలు... రంజాన్ దీక్షలు



పండగ, పర్వం అంటే శుభవేళ, ఉత్సాహంగా జరుపుకునే ఉత్సవ సమయం అని అర్థం. పండుగలు మానవ జీవన స్రవంతిలో భాగమై, జాతీయతకు, సామూహిక జీవన విధానానికి, సంస్కృతి వికాసానికి దోహదపడుతున్నాయి. పండుగ అనేది ఏ మతానికి సంబంధించినది అయినా సరే, దాని వెనుక ఒక సందేశం, ఒక శాస్త్రీయత, ఒక సదాచారం దాగి ఉంటాయి. పండుగ మానవాళికి హితాన్ని బోధిస్తుంది. ముస్లిములు అత్యంత పవిత్రంగా జరుపుకునే రంజాన్ సైతం ఇదే హితాన్ని మానవాళికి అందిస్తుంది. ముస్లిములు చాంద్రమానం క్యాలెండర్ ను అనుసరిస్తారు. చాంద్రమాన అనుసరణీయ, ఇస్లామీయ క్యాలెండర్ తొమ్మిదవ నెల రంజాన్. క్రమశిక్షణ దాతృత్వం ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం. ముస్లిం సోదరులకు పరమ పవిత్రమైన రంజాన్ నెల సందర్భంగా, నెల రోజుల పాటు నిర్వహించనున్న ఉపవాస దీక్షలు... కఠోర నియమాలకు, దీక్షా దక్షతలకు ప్రబల నిదర్శనాలు. దివ్య ఖురాన్ అవతరించిన నెలలో విధిగా ఆచరించవలసిన నియమం ఉపవాస వ్రతం. ఉపవాసాన్ని "పార్సీ" భాషలో "రోజా" అంటారు. పరమ పవిత్రంగా ప్రత్యేక ప్రార్థనలతో, ఉపవాస దీక్ష కంకణులైన ధార్మికులు, భక్తి శ్రద్ధలతో అన్ని అలవాట్లకు దూరంగా ఉంటూ, నెల రోజులు దీక్షలో నిమగ్నమై ఉంటారు. "రంజాన్" పండగ పేరు కాదు. నెల పేరు. "రంజ్" అనగా కాలుట (జ్వలించుట) ఉపవాసము చేయుటచే, మను షులుచేయు పాపమును కాలి పోవునని భావము. నెల అంతయు, ఉదయం నుండి సూర్యా స్తమయం వరకు ఉపవాసం ఉండి, రోజా పాటిస్తూ రోజుకు 5 సార్లు నమాజ్ పఠిస్తూ, మసీదులలో ఎక్కువ సమయం గడుపుతారు. ఐదు సార్లు చేసే నమాజులు.....ఫజర్ (సూర్యోదయమునకు పూర్వము) జూహర్ ( మధ్యాహ్నం తర్వాత) అనర్ ( సూర్యాస్త మయానికి పూర్వము) మగరీబ్ (సూర్య సమయానికి ముందు చీకటి పడ్డాక) ఇషా (అర్ధరాత్రికి ముందు చేయాల్సిన సమాజులు. ఈ నెలలో రాత్రి చేయు ప్రత్యేక ప్రార్థనలు "తరావీహ్" అంటారు. నెలలో ఖురాన్ ను పూర్తిగా పఠిస్తారు. ముస్లి సిద్ధాంతాలను విశ్వసించి పాటిస్తారు. ఆయన దూతలను హృదయ పూర్వకంగా విశ్వసించడం, రోజు 5 సార్లు నమాజు నమాజు పఠిచడం, పూర్తిగా ఉపవాస దీక్షను పాటించడం, పేదలకు దానం చేయడం మక్కా యాత్ర చేయడం, ప్రధాన సిద్ధాంతాలు. రోజా లో ఉండగా ఉమ్మిని మింగ రాదు. బీడీ, సిగరెట్ లాంటివి కాల్చడం చేయరాదు. మద్యం సేవించ రాదు. మందులు తీసుకొనరాదు. చాడీలు చెప్పుట, ఇతరులను దుర్భాషలాడడం, అబద్ధం చెప్పుట, చెడు పనులు చేయుట నిషిద్ధాలు, వీటిని పాటించ కుంటే, అల్లాహ్ దృష్టిలో తాను చేసిన వ్రతమునకు విలువ ఉండదు. బీదలకు సహాయం చేసి, వారి నుం దీవెనలు పొందాలి. సూర్యోదయానికి ముందు తినే ఆహారాన్ని "సహరీ" అంటారు. సూర్యాస్తమయం తర్వాత ఖర్జూరపు పండు గాని ఇతర ఫలాలను తీసుకోవడాన్ని "ఆఫ్తారీ" అంటారు. రంజాన్ మాసంలో మరొక విశేషం అత్యధిక దానధర్మాలు చేయడం. సంపాదనాపరులు, సంపన్నులైన వారు. రంజాన్ నెలలో పేదలను ఆదుకోవాలని ఖురాన్ బోధిస్తోంది. ఆస్తిలో నుంచి, నిర్ణీత మొత్తాన్ని, పేదలకు దానం చేయడాన్ని "జకాత్" అంటారు. దీనిని పేదల "ఆర్థిక హక్కు"గా పేర్కొంటారు. దీని ప్రకారం. ప్రతి సంవత్సరాంతంలో మిగిలిన, తన సంపద నుండి 30 శాతం చొప్పున ధన, వస్తు, కనకాది ఏవైనా, నిరుపేదలకు దానం ఇస్తారు. పేద వారు కూడా అందరితో పాటు పండుగను. జరుపుకోవడానికి, సంతోషంగా పాలుపంచుకు నేందుకు "జకాత్" ఎంతగానో ఉపయోగ పడుతుంది. ఈద్ అసలు పేరు "ఈద్ - ఉద్- ఫితర్". ఫితర్ అంటే దానము. జకాత్ తో పాటు 'ఫిత్రా దానానికి" రంజాన్ నెలలో ఎంతో ప్రాముఖ్యత ఉంది. మూడు పూటలా తిండికి, ఒంటినిండా బట్టకు నోచుకోని పేదవారు, అభాగ్యులకు, పండగ సందర్భంలో దానం చేయాలని, ఇస్లాం మతం బోధిస్తోంది. "ఫిత్రా దానం" అని పిలుస్తారు. ఉపవాస వ్రతాలు విజయవంతం కావడానికి, దేవుని పట్ల కృతజ్ఞతగా, పేదలకు ఫిత్రా దానం చేయడం. ఫిత్రా దానాన్ని విధిగా నియ మించడానికి కారణం, ఉపవాస వ్రత నియమాన్ని పాటించే సమయంలో హృదయంలో కలిగే చెడు భావనలు, తలంపులు, ఆలోచనలు, నోటి నుండి వెలువడే అసత్యాలు, అనాలోచిత పొరపాటు, అన్నీ క్షమించ బడతాయని, మహమ్మద్ అనుచరుడు అబ్దుల్లా బిన్ మసూద్ ఉవాచ. రంజాన్ మాసంలో జరుపుకునే ఇస్తార్ విందులో, ఆత్మీయ స్వభావాలు ప్రస్ఫుటం అయితాయి. సామూహిక జీవన విధానానికి, విశాల ఆలోచన దృక్పథానికి, ఇఫ్తార్ విందులు నిదర్శనాలు. పవిత్ర ఆరాధనలకు, ధార్మిక చింతనకు, దైవభక్తికి, క్రమశిక్షణకు, ఇంద్రియ నిగ్రహమునకు, స్వీయ నియంత్రణకు దాతృత్వానికి, ఆలవాలమైన రంజాన్ మాంసం, మనిషి సత్ ప్రవర్తన దిశలో సాగడానికి, మార్గాన్ని సుగమం చేస్తుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# తెలుగు భాషకు ఖండవల్లి ఎనలేని సేవ - మార్చి 1...ఖండవల్లి లక్ష్మీరంజనం జయంతి

తెలుగునాట తెలుగు భాష నేర్చు కోవడానికి అవకాశాలు మృగ్యమైన కాలంలో మాతృభాషపై మమకారం తో విద్యార్థులకు తెలుగు భాష నేర్చుకునే అవకాశం కల్పించడానికి ఆచార్య ఖండవల్లి లక్ష్మీ రంజనం చేసిన కృషి అనన్య సామాన్యం. సానుకూల దృక్పథంతో, అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పరిపాలనా కాలంలో తెలుగు సాహి త్యానికి, చరిత్రకు ఖండవల్లి లక్ష్మీ రంజనం విశేష సేవలు అందించా రు. ఉస్మానియా విశ్వ విద్యాలయం లో ఆచార్యుడిగా పనిచేసిన ఆయన విద్యార్థుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో తెలుగు భాషకు ప్రముఖ స్థానం లభించడం వెనుక ఆయన విశేష కృషి దాగి ఉంది. ఆంధ్రప్రదేశ్ లో ప్రథమంగా ప్రాచ్య కళాశాలను, తెలుగు మీడియం సాయం కళాశాలను, ఒక సంగీత పాఠశాలను నెలకొల్పి, వాటికి విశాలమైన భవనాలు కట్టించారు. తన ఇంటిలోనే వేద పాఠశాలను 1980లో స్థాపించి సర్వ వర్ణాల వారికి తానే వేదాన్ని స్వయంగా బోధించారు. ఆంధ్ర రచయితల సంఘానికి 1957లో అధ్యక్షులై అనేక గ్రంథాలను ముద్రించారు. ఇంగ్లీషు, తెలుగు భాషలలో శర వేగంగా రాసేవారు. మద్రాసు మెయిల్, దక్కన్ క్రానికల్, భారతి, కృష్ణా, స్రవంతి మొదలైన పత్రికలలో అనేకమైన వ్యాసాలు ప్రకటించారు. ఖండవల్లి లక్ష్మీరంజనం ( మార్చి 1, 1908 - జూన్ 18, 1986) సుప్రసిద్ధ సాహిత్యవేత్త, పరిశోధకులు. ఆయన తూర్పు గోదావరి జిల్లా పెదపూడి గ్రామంలోని మాతామహులైన కోరాడ నరసింహులు ఇంటిలో మార్చి 1, 1908 న జన్మిం చారు. సూర్యనారాయణ, సీతమ్మ తల్లిదండ్రులు. తండ్రి ఉద్యోగ రీత్యా వరంగల్లుకు రావడంతో ఆయన మాధ్యమిక, ఉన్నత పాఠశాల విద్యలు మట్టెవాడలో, హనుమ కొండ లోను పూర్తయ్యాయి. తరు వాత ఉన్నత విద్యకై హైదరాబాదు చేరుకుని 1924లో నిజాం కళాశాల లో బీఏ సంస్కృతం చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. 1928లో నిజాం కళాశాలలో తెలుగు, సంస్కృతం, ప్రాచీన భారత చరిత్రలలో బి.ఎ. పట్టా పొందారు. తరువాత సిటీ కళాశాలలో అధ్యాపకులుగా చేరి 1936లో తెలుగు, సంస్కృతాలలో ఎం.ఎ. పరీక్షలో మద్రాసు ప్రెసిడెన్సీలో సర్వ ప్రథము లుగా ఉత్తీర్ణులయ్యారు. ఖండవల్లి 1936 నుంచే సాహిత్యసేవ ప్రారం భించారు. 'తెలుగుదుక్కి' శీర్షికతో వ్యాసాలు ప్రచురించారు. త్రివేణి లాంటి ఆంగ్ల పత్రికల్లో ఆధునిక కవిత్వం గురించి అనేక వ్యాసాలు రాశారు. 1936లో ఎంఏ (తెలుగు సంస్కృ తం)లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ఉస్మానియా విశ్వ విద్యాలయంలో తెలుగు లెక్చరర్ గా చేరారు. రాయ ప్రోలు సుబ్బారావు పదవీ విరమణ చేశాక ఆచార్య (ప్రొఫెసర్) పీఠాన్ని అధిష్టించారు. ఖండవల్లికి విద్యార్థి దశ నుంచే ఆదిరాజు వీరభద్రరావు లాంటి పరిశోధకులతో, గోలకొండ పత్రికా సంపాదకులు సురవరం ప్రతాపరెడ్డి లాంటి ప్రజా సాహిత్య సేవకులతో, లోకనంది నారాయణ లాంటి సాహిత్య పోషకులతో పరిచయం ఏర్పడింది. ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు శాఖలో అధ్యాపకులుగా చేరి, తరువాత 1946లో ఆ శాఖకు అధ్యక్షులై, 1964లో పదవీ విరమణ చేశారు. ఆయన కృషి కారణంగా తెలంగాణలో 1956 నుంచి ప్రాచ్య భాషాధ్యయనంలో డిగ్రీ తరగతులు (బీఓఎల్) మొదల య్యాయి. 1957 నుంచి ఓరియంటల్ కళాశాలలు సాయంకాలం పూట పనిచేసేలా ప్రారంభమయ్యాయి. ఇంగ్లీషు భాషా పరిచయం లేని పేదసాదా విద్యార్థు లు ఈ కళాశాలల్లో చదివి, ఎంఏ తెలుగు, సంస్కృతం పట్టాలు పొంది కళాశాలల ఉపన్యాసకులు కాగలిగారు. 1966లో తెలుగు మాధ్యమంలో సాయం డిగ్రీ కళాశాలను స్థాపించారు. 1960లో హైదరాబాదులో వేద పాఠశాలను ప్రారంభించి, తాను కూడా తరగతులు తీసుకునేవారు. ఉస్మానియా లో ఆయన కాలంలో తెలుగు శాఖ బాగా అభివృద్ధి చెంది, తెలుగు ఎం.ఎ. చదివే విద్యార్థుల సంఖ్య పెరిగి, 1952 నుండి తెలుగులో పి.హెచ్.డి. పట్టాలకు పరిశోధన ప్రారంభమైంది. ఆయన రాసిన పుస్తకాల్లో ఆంధ్రుల చరిత్ర%-% సంస్కృతి, ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము, తెనుగుదుక్కి, లక్ష్మీరంజనం వ్యాసావళి, ఆంధ్రదేశ చరిత్ర భూగోళ సర్వస్వము మూడు సంపుటాలు, కాసె సర్వప్ప రాసిన సిద్దేశ్వర చరిత్రము, శ్రీనాథుని హర విలాసము (పరిష్కరణ గ్రంథాలు) ప్రసిద్ధాలు. ఆయన ఆంధ్ర మహా భారతం పరిశోధన ప్రతిని ఎనిమిది సంపుటాలుగా తెలుగు శాఖ పక్షాన ప్రకటించారు. వివేకానంద ఎడ్యుకేషనల్ సొసైటీ పేరుతో ఒక విద్యాసంస్థను ప్రారం భించి బాల బాలికలకు వేరువేరుగా ఉ



న్నత పాఠశాలలను నెలకొల్పారు. కొమర్రాజు లక్ష్మణరావు... విజ్ఞాన సర్వస్వం ముద్రించడంలో ఖండవ ల్లి విశిష్టమైన కృషిచేశారు. ఆయన 'ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము' అనే చక్కని రచన చేశారు. సోదరు డు ఖండవల్లి బాలేందు శేఖరంతో కలసి తెలుగులోను, ఇంగ్లీషులోను రచించిన 'ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి' అమూల్యమైన గ్రంథం. హైదరాబాద్ లోని శ్రీకృష్ణదేవరాయ గాంధ్ర భాషా నిలయం కార్యదర్శిగా రెండేళ్లపాటు పనిచేశారు. పుస్తకాల సేకరణ, చందాల కోసం తెలంగాణ అంతటా పర్యటించారు. వర్ధంతు లు, జయంతులు ఎన్నో జరిపారు. ఆంధ్ర సారస్వత పరిషత్ సభ్యులు గా పనిచేసి దాని విస్తరణకు విశేష కృషి చేశారు. 'నిజాం రాష్ట్ర గ్రంథాలయ సంఘం' కార్యదర్శిగా కూడా పనిచేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధ్యక్షులుగా 1964లో విశ్రాంతి తీసుకున్నాక, మరో 22 సంవత్సరాలు సాహిత్య సేవ చేసి, 1986, జూన్ 18న హైదరాబాద్‌లో మరణించారు. ఆయన స్థాపించిన ఆంధ్ర ప్రాచ్య కళాశాల ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం ప్రభుత్వ ప్రాచ్య కళాశాలగా అభివృద్ధి చెందింది. ఖండవల్లి శత జయంతి, కళాశాల స్వర్ణోత్సవాలు 2008లో హైదరాబాదులో ఘనంగా జరిగా యి. ఈ సందర్భంగా ప్రత్యేక సంచికను ప్రచురించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## అన్నింటికీ ఉపకారవేతనాలే..!

తాండూరు: తాండూరులోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు రాక పోవడంతో విద్యార్థుల ఉపకార వేతనాల నుంచే వ్యయం చేయాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల ఒక్కో నర్సింగ్ విద్యార్థికి రూ.5,000 ఉపకార వేతనాన్ని నేరుగా ఖాతాలో జమచేస్తోంది. ఈ డబ్బుల్లోంచి విద్యార్థులు ప్రతి నెల రూ.3,000 చొప్పున కళాశాల నిర్వహణ చూస్తున్న సిబ్బందికి చెల్లిస్తున్నారు. వీటితోనే భోజనం, వసతి గృహ నిర్వహణ తదితర ఖర్చులకు వెచ్చిస్తున్నారు. ఈ విషయమైన స్థానికంగా తీవ్ర విమర్శలు నెలకొన్నాయి.

**గతేడాదినుంచే ఆరంభం**

2023-24 విద్యా సంవత్సరం నుంచి తాండూరులో ప్రభుత్వం నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేసింది. మొదటి బ్యాచ్‌లో 60 మంది విద్యార్థులకు గాను 50 మంది ప్రవేశం పొందారు. వీరిలో 45 మంది కళాశాల వసతి గృహంలోనే ఉంటున్నారు. వీరినుంచి డబ్బు స్వీకరిస్తున్నారు. యూనిఫామ్, పుస్తకాల కోసం రూ.20వేల వసూలు మొదటి సంవత్సరం ఒక్కో విద్యార్థి నుంచి రూ.20వేల చొప్పున వసూలు చేస్తున్నారు. ఈ డబ్బుల్లోంచి నాలుగేళ్ల వరకు సరిపడా పుస్తకాలు, యూనిఫామ్స్, బూట్లు, క్యాప్స్ కొనుగోలుకు వ్యయం చేస్తున్నారు. వీటిలోంచే ఓ నెలకు సంబంధించిన మెస్ బిల్లును



చెల్లిస్తున్నారు. నర్సింగ్ కళాశాల నిర్వహణకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడమే ఇందుకు కారణమని విమర్శలొస్తున్నాయి.

**డబ్బులు తీసుకుంటున్నది వాస్తవమే..**

నర్సింగ్ కళాశాల నిర్వహణకు ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదు. దీంతో గత్యంతరం లేక వారికొచ్చే ఉపకార వేతనాల నుంచి వసూలు చేస్తున్నాం. విద్యార్థులకు నిత్యం భోజనాలు, ఇతర ప్రాథమిక సౌకర్యాలకు ఉపకార వేతన సొమ్మునుంచే చెల్లిస్తున్నాం. తాండూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు వసతి గృహాలు, తరగతి గదులు వేర్వేరుగా ఉండేలా రూ.25 కోట్లతో రెండు భవనాలను నిర్మిస్తోంది. ఇవి అందుబాటులోకి వస్తే విద్యార్థులకు అన్ని రకాల వసతులను ప్రభుత్వమే కల్పిస్తుంది. విజయా రాణి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్, తాండూరు.

## వినియోగం పెరిగినా.. తలెత్తదు అవాంతరం

తాండూరు : చలికాలం ఇంకా పూర్తికాకముందే జిల్లాలో వేసవిని తలపించేలా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీంతో విద్యుత్ వాడకమూ ఎక్కువవుతోంది. డిమాండ్‌ను ఎక్కడా తగ్గించకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. ఈ నేపథ్యంలోకథనం.

అటవీ ప్రాంతాల్లోనూ వేడి వాతావరణం

జిల్లా వ్యాప్తంగా 34 నుంచి 36 సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదౌతున్నాయి. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు వేడి వాతావరణం నెల కొంటోంది. రాత్రి వేళ ఉక్కపోతలు మొదలయ్యాయి. అడవులు ఎక్కువగా ఉన్న అనంతగిరి, దామగుండం, ధారూర్, అనంతగిరి, జిన్‌గుర్తి, మైల్వార్, నాగుల పల్లి, రాస్నం, జుంటుపల్లి వంటి తదితర గ్రామాల్లోనూ వేడి వాతావరణం ఏర్పడటం గమనార్హం. జిల్లాలోని గృహాల్లో గాలి పంకాలు, ఏసీలు, కూలర్లు వంటి వాటికి విద్యుత్తు వాడకం ఎక్కువైంది. ఇంట్లో ఆహార పదార్థాలు పాడవకుండా ఉండేందుకు రిఫ్రిజిరేటర్లను వినియోగిస్తున్నారు. మిక్సీలను వాడుతున్నారు. ఇక యాసంగి పంటల సాగుకు నీటిని తోడేందుకు విద్యుత్తును వినియోగిస్తున్నారు. మార్చి నుంచి మే వరకు ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల నుంచి 40 డిగ్రీలు దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆమేరకు సరఫరాలో అంతరాయం లేకుండా ఇప్పటి నుంచే సమాయత్తమయ్యారు.

సమస్యల నివారణకు ఏంచేస్తున్నారంటే..

నియంత్రికలకు మరమ్మతులు.

పాడైన ఏబీ స్విచ్‌లను తొలగించి కొత్తవాటి ఏర్పాటు.

వదులుగా ఉన్న తీగలను సరిచేయడం.

తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను కొట్టివేయడం.

ఉపకేంద్రాల్లో సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

అత్యవసరమైతే తప్ప లైన్ క్లియరెన్స్ (ఎల్.సి) స్వీకరణ.

ఇదీ వాడకం తీరు

సాధారణ రోజుల్లో.. 6.89 మిలియన్ యూనిట్లు (ఎంయూ).

ప్రస్తుతం పెరిగిన వినియోగం.. 7.2 ఎం.యూ నుంచి 7.3 ఎం.యూ.

డిమాండ్ దృష్ట్యా మరింత అప్రమత్తం

జిల్లాలో అవాంతరాలు లేకుండా విద్యుత్తును సరఫరా చేస్తున్నాం. మార్చి నుంచి మే వరకు డిమాండ్ మరింత పెరుగుతుంది. ఆమేరకు ఇప్పటినుంచే మరింత అప్రమత్తంగా ఉంటున్నాం. అత్యవసర సమయంలో తప్ప అధికారికంగా సరఫరాలో ఎక్కడా కోతలు విధించడంలేదు. లీలావతి, విద్యుత్తు ఎస్.ఈ ఆపరేషన్, వికారాబాద్

## అధికారి తనిఖీ.. పనుల్లో చురుకు!

ఖమ్మం : ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉంటే పనులు వేగంగా జరుగుతాయనడానికి ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం ఒక ఉదాహరణ. ఇటీవల కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ స్టేడియాన్ని పరిశీలించారు. సమస్యల మూలాలను గ్రహించి ఏం చేయాలో ఆదేశించారు. వారం గడవక ముందే ఇప్పుడు స్టేడియంలో పునరుద్ధరణ పనులు ఊపందుకున్నాయి. అథ్లెటిక్స్ అకాడమీలోని క్రీడాకారుల వసతి, ఇతర సదుపాయాలను తీర్చిదిద్దే పనులు చేస్తున్నారు. దశాబ్దాలుగా అరకొర వసతులతో కొట్టుమిట్టాడుతున్న క్రీడాకారులకు ఇప్పుడు తగిన సదుపాయాలు సమకూరనున్నాయి. మంచాలు, పరుపులు, బీరువాలు, వారికి అవసరమైన దుస్తులు, పరికరాలు సమకూరుతున్నాయి. స్విమ్మింగ్ పూల్‌ను సుందరంగా తీర్చిదిద్దే పనులతో పాటు నీటిని శుద్ధి చేసే యంత్రాలు సైతం మార్చే పనిలో ఉన్నారు. స్విమ్మింగ్ పూల్ ప్రాంగణాన్ని ఉద్యానవనంలా మార్చాలని కలెక్టర్ ఆదేశించిన క్రమంలో ఇప్పటికే కార్పొరేషన్, ఉద్యానవన విభాగాల ఉద్యోగులు పరిశీలించారు. అందుకు తగిన అంచనాలు సిద్ధం చేస్తున్నారు. మైదానంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. కలెక్టర్ పరిశీలన తర్వాత స్విమ్మింగ్ పూల్, అథ్లెటిక్స్ అకాడమీల స్వరూపం మారుతోంది. ఉన్నతాధికారులు వచ్చామా? వెళ్లామా? అని కాకుండా కాసింత సమయం కేటాయించి దృష్టి సారిస్తే ఎలాంటి మార్పులు సాధ్యమో స్టేడియంలో జరుగుతున్న పనులే చక్కటి ఉదాహరణ.

# ఉత్పత్తి వద్దే చెత్త విచ్ఛిత్తి



కరీంనగర్ : తడి, పొడి చెత్తను వేరు చేసి ఎక్కడికక్కడే చెత్తను తగ్గించాలనే ఉద్దేశంతో కరీంనగర్ నగర పాలక సంస్థ కార్యాచరణ తీసుకుంది. పారిశుధ్య పనుల నిర్వహణలో భాగంగా డంపింగ్ యార్డులో గుట్టలుగా చెత్త పేరుకుపోతుండటం, బయోమైనింగ్ ద్వారా చెత్త ప్రాసెసింగ్ జరుగుతున్నా ఆశించిన స్థాయిలో ఫలితం ఉండటం లేదు. ఈ నేపథ్యంలోనే కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ చెత్త సమస్యపై దృష్టి సారించి ఉత్పత్తి దగ్గరే తగ్గించేలా కార్యాచరణ తీసుకున్నారు. 7వ డివిజన్ హౌసింగ్‌బోర్డుకాలనీ, 31వ డివిజన్ లక్ష్మీనగర్, గాయత్రీనగర్ ఎంపిక చేశారు. చెత్త రహిత డివిజన్లుగా తీర్చిదిద్దేందుకు చర్యలు ప్రారంభించారు.

**పది శాతమే డంపింగ్‌యార్డుకు తరలింపు**

ఇంటి నుంచి వచ్చే పొడి చెత్తను క్షేత్రస్థాయిలో 90 శాతం తగ్గించాలి. ఏమాత్రం పనికి రాని 10 శాతం వ్యర్థాలను రీసోర్స్ పార్కు కేంద్రంలోని చెత్తను తగ్గించే మిషన్‌లో వేసి కొత్తపల్లి డంపింగ్‌యార్డుకు తరలిస్తారు. పొడి చెత్తలో అధికంగా పుస్తకాలు, ప్లాస్టిక్ కవర్లు, అట్టలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, బొమ్మలు, చెప్పులు, వస్త్రాలు, గాజు పరికరాలు, ఇనుము, ఇతర వస్తువులు ఉంటాయి. వీటిని డంపింగ్‌యార్డుకు వెళ్లకుండా రిక్షా కార్మికులు, చెత్త సేకరించే వారితో వేరు చేసి వారికి ఆదాయ మార్గాన్ని చూపిస్తారు.

**ప్రజల భాగస్వామ్యం అవసరం**

ఇంట్లోంచి వచ్చే చెత్తా చెదారం తీసుకొచ్చి శానిటేషన్ ట్రాక్టర్‌లో, స్వచ్ఛ ఆటోలో వేస్తుంటారు. పొడి చెత్తలో వచ్చే వస్తువులు నామమాత్రంగా వేరు చేస్తుండగా మిగతా చెత్తంతా డంపింగ్‌యార్డుకు వెళ్తోంది. అక్కడ దుర్వాసనతోపాటు మంటలు రావడం, పొగ వచ్చి ఆ ప్రాంతంలో కాలుష్యం కమ్ముకుంటుంది. అలా కాకుండా ఇంటి నుంచే దేనికి అదే వేరు చేస్తే సగానికి పైగా చెత్త తిరిగి వినియోగించుకోవడానికి వీలు ఉంటుందనే విషయాన్ని గుర్తించాలి. పట్టణాలు, నగరాల్లో ప్రజలు ఎవరికి వారు ఆలోచన చేస్తే చెత్త తగ్గించుకునే వీలుంది.

**అవగాహన కార్యక్రమాలు..**

డంపింగ్‌యార్డుకు చెత్తను పంపించకుండా సేకరించిన చోట వేరు చేసేలా స్వచ్ఛ ఆటో కార్మికులకు, మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తడి, పొడి చెత్తతో ఉపయోగాలు, నష్టాలను వివరించడం డంపింగ్‌యార్డు వెళ్లకుండా పొడి చెత్తను తిరిగి వినియోగించుకోవడం ప్రతి ఆటోకు ఉన్న మైకు ద్వారా ప్రచారం చేయడం

అపార్టుమెంట్లలో తడి చెత్తను ఒక చోటకు చేర్చి కంపోస్టు మిషన్ ద్వారా ఎరువు తయారు చేసేలా చూడటం, ఆ మిషన్ కొనుగోలు చేసేలా ప్రోత్సహించడం స్వచ్ఛ ఆటోల ద్వారా ప్రతి రోజు 500 ఇళ్ల నుంచి చెత్త సేకరిస్తారు. ఎంపిక చేసిన రెండు డివిజన్లలో వారానికి రెండు రోజులు మంగళ, శుక్రవారం పొడి చెత్త, ఆది, సోమ, బుధ, గురువారం, శనివారాల్లో తడి చెత్త సేకరిస్తున్నారు.

# చి'వరి'కి అందని నీరు



జగిత్యాల : జిల్లాలోని ఆయకట్టు చివరి భూములకు కాలువ నీరు అందడం లేదు. కాకతీయ ప్రధాన కాలువ జిల్లా నుంచే వెళుతుండగా డిస్ట్రిబ్యూటరీలు, ఉప కాలువలు, పిల్లకాలువల ద్వారా పంటలకు మళ్లిస్తారు. కానీ ప్రధాన కాలువతోపాటు డిస్ట్రిబ్యూటరీలు, ఇతర కాలువల లైనింగ్ చాలాచోట్ల దెబ్బతినడం, చెట్లు పెరగటం, షట్టర్లు, కట్టలు శిథిలంకావటం వంటి కారణాలతో నీటి తరలింపు సామర్థ్యం తగ్గింది. 9 వేల క్యూసెక్కుల సామర్థ్యంగల కాకతీయ కాలువలో ప్రస్తుతం 6,500 క్యూసెక్కులకు మించి నీటిని తరలిస్తే గండ్లు పడుతుండటంతో గరిష్ఠంగా 5,500 క్యూసెక్కులనే వదులుతున్నారు. యూటీలు, డ్రాపులు, సూపర్ ప్యాసేజ్‌లు, అక్విడెక్టులు తదితర నిర్మాణాలు చాలాచోట్ల దెబ్బతినటంతో ఏ కాలువనిండా నీటిని తరలించలేక దాదాపుగా 37 వేల ఎకరాల చివరి ఆయకట్టుకు నీరందటం లేదు.

**చేపట్టాల్సిన చర్యలు**

యాసంగికి ఎస్సారెస్పీ నుంచి 17.50, చెరువుల ద్వారా 5.45 టీఎంసీల నీటిని ఏప్రిల్ మొదటివారం ఇవ్వనున్నారు. ఇప్పటికే 4 తడులు పూర్తికాగా మరో 3 తడులు వస్తాయి కానీ.. జిల్లాలో పెద్దఎత్తున సాగుచేసిన వరిపైరు పూర్తికానందున మరో నీటితడి కావాలి.

చివరికి నీటి ఎద్దడి ఏర్పడుతున్నందున కాలువలకు అధికంగా నీటిని విడుదల చేయాలి. కాలువలకు అమర్చిన మోటార్లను పరిమిత సమయం మేరకే నడిచేలా చూసి దిగువకు నీరు పారించాలి.

రూ.89 కోట్ల వరకు మరమ్మతులు, ఇతర పనులకు వెచ్చించినా.. సకాలంలో నిధులురాక చాలావరకు పనులను చేపట్టలేదు. వచ్చే వేసవిలోనైనా అన్ని మరమ్మతు, లైనింగ్ పనులను పూర్తిచేస్తే ఉపయుక్తంగా ఉంటుంది. గతేడాదితో పోలిస్తే సరిగ్గా ఇదే సమయానికి అరమీటరు మేరకు భూగర్భ జలమట్టం అడుగంటింది. కాకతీయ కాలువతోపాటు వరద కాలువ నుంచి చెరువులు, కుంటల్లోకి నీటిని తరలించే తూములు, కాలువల నిర్మాణాన్ని పూర్తిచేసి గొలుసుకట్టు చెరువుల్లోకి నీటిని తరలిస్తే జలమట్టం పెరిగి పంపుసెట్ల ద్వారానూ నీటిని పారించవచ్చు. మిషన్ కాకతీయ ద్వారా మిగిలిన చెరువుల పునరుద్ధరణను వేసవిలో పూర్తి చేయాలి. రోళ్లవాగు ప్రాజెక్టును రూ.135 కోట్లకుపైగా నిధులతో ఆధునికీకరిస్తున్నా దీన్ని ఎస్సారెస్పీ నీటితోనే నింపాల్సి ఉంటుంది. ఎస్సారెస్పీ నిండని సందర్భాల్లో 2.5 టీఎంసీల సామర్థ్యం కలిగిన రోళ్లవాగులోకి గోదావరి నీటిని ఎత్తిపోసేలా బీర్‌పూర్ మండలం రంగసాగర్ వద్ద ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాలి. గోదావరిలోనూ నీరు లేనందున పలు ఎత్తిపోతల పథకాలు నడిపించే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో గోదావరిలో అడ్డుకట్టలతో నీటిని నిలువచేసి ఎత్తిపోయాలి. జిల్లాలోని 32 గ్రామాలకు తలపెట్టిన ఎత్తిపోతల పథకాలను పూర్తిచే యాలి. అవసరమైన పథకాలకు మరమ్మతులు చేపట్టి ఎత్తిపోతలను పొడిగిస్తే ప్రయోజనం కలుగుతుంది. వాగులపై చెక్‌డ్యాంల నిర్మాణాన్ని పూర్తిచేయాలి.

# కొనసాగుతున్న విచారణలు

గోదావరిఖని : రామగుండం నగరపాలికలో అక్రమాలపై విచారణలు కొనసాగుతూనే ఉన్నాయి. 14వ ఆర్థిక సంఘం నిధులతో పారిశుద్ధ్య వాహనాల కొనుగోలులో అక్రమాలు జరిగాయని.. అసలు ధర కంటే ఎక్కువ రేటు కోట్ చేయడం, నాసిరకం వాహనాలు కొనుగోలు చేశారని, వాహనాలు రాకుండానే బిల్లులు చెల్లించారని సుమారు రెండేళ్ల క్రితం ఆరోపణలు వచ్చాయి. డబ్బు చేతులు మారాయన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు ఎనిమిది నెలల క్రితం నగరపాలికలో సంబంధిత దస్త్రాలను స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. ఈ విచారణ కొనసాగుతుండగానే పురపాలక నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో అంతర్గత విచారణకు ఆదేశించారు. డీజిల్ వినియోగంలోనూ అక్రమాలు నెలకొన్నాయని పలువురు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీంతో పురపాలక నిర్వహణ ప్రాంతీయ సంచాలకులు షాహీద్ మసూద్ సోమవారం నగరపాలక కార్యాలయంలో విచారణ చేపట్టారు. డీజిల్ వినియోగ బిల్లుల దస్త్రాలను పరిశీలించారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో కొనుగోలు, బిల్లుల చెల్లింపు జరగాల్సి ఉండగా కేవలం పారిశుద్ధ్య పర్యవేక్షకులకు అప్పగించడాన్ని ఆయన తప్పుబట్టారు. సిబ్బందిలో కొందరు గతంలో సొంత వాహనాలకు డీజిల్ పోయాలంటూ అధికారులపై ఒత్తిడి తెచ్చిన సంఘటనలున్నాయి. ఇటీవల ఇలాంటి ఒత్తిళ్లు మరింత పెరగడంతో డీజిల్ వినియోగం పెరిగినట్లుగా అధికారులు భావిస్తున్నారు. ఒక్కో పారిశుద్ధ్య వాహనానికి ఎంత డీజిల్ పోయించారు? ఎన్ని కిలోమీటర్లు తిరిగాయన్న విషయాలను విచారణ అధికారులు ఆరా తీస్తున్నారు.

**గతంలోనూ..**రామగుండం నగరపాలికలో గతంలో అనేక అక్రమాలపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకున్నారు.



అందులో కొందరు అధికారులు ఉద్యోగ విరమణ పొందినప్పటికీ వారికి రావాల్సిన ప్రయోజనాలను నిలిపివేశారు. కొళాయి కనెక్షన్లలో అక్రమాలు మొదలుకొని అభివృద్ధి పనులు చేపట్టకుండానే బిల్లులు చెల్లించడం వరకు అనేక ఘటనలపై విజిలెన్స్ విచారణలు చేపట్టారు. గౌతమినగర్‌లో చెత్త నిర్వహణ కేంద్రంలో రోడ్డు వేయకుండానే వేసినట్లుగా బిల్లులు చెల్లించిన సంఘటనలో పోలీసులకు ఫిర్యాదు అందడంతో చెక్కు జారీ చేసిన ఉన్నతాధికారితో పాటు ఆడిట్ అధికారిపై కేసు నమోదు కాగా విచారణ కొనసాగుతోంది. కరోనా సమయంలో పారిశుద్ధ్య విభాగంలో సున్నం, బ్లీచింగ్ పౌడర్‌తో పాటు వివిధ సామగ్రి కొనుగోళ్లలో అక్రమాలు నెలకొన్నాయనే ఆరోపణలున్నాయి. ఓ చోట చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఉన్నతాధికారుల అనుమతి లేకుండా మరో చోట చేపట్టిన సంఘటనల్లోనూ విచారణ చేపట్టారు. ఇలా రామగుండం కార్పొరేషన్‌లో అక్రమాల ఆరోపణలపై విచారణ కొనసాగుతూనే ఉంది.

## తాగునీటి ఇబ్బందులు షురూ!

వైరా : వేసవి ఆరంభంలోనే ఎండలు దంచికొడుతున్నాయి. 'మిషన్ భగీరథ' నీళ్లు పూర్తిస్థాయిలో అందకపోవటంతో అక్కడక్కడ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక బావులు, బోర్ల నుంచి తాగునీరందించే క్రమంలో ఉత్పన్నమయ్యే సమస్యలను పరిష్కరించేందుకు నిధుల కొరత వేధిస్తోంది. గ్రామ పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవటంతో కేంద్రం నుంచి నిధులు అందటం లేదు. రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులూ రావటం లేదు. 'జనరల్ ఫండ్'ను వినియోగించాలని ఉన్నతాధికారులు చెబుతున్నా అవీ అక్కరకు రావటం లేదు. ఉన్నతాధికారులు దృష్టి సారించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. చింతకాని మండలం వందనం గ్రామంలో ఎస్సీ, బీసీ కాలనీలకు మిషన్ భగీరథ జలాలు సక్రమంగా అందటం లేదు. స్థానిక బోర్లు, బావుల నీళ్లు సరిపోకపోవటంతో ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోంది. ఇదే మండలంలోని బొప్పారం గ్రామపంచా యతీకి ఆరు నెలలుగా మిషన్ భగీరథ నీరందటం లేదు. పంచాయతీలో నిధులు లేకున్నా అధికారులు సొంతంగా ఖర్చుపెట్టి తాగునీటి పంపిణీకి చర్యలు చేపట్టారు. రఘునాథపాలెం మండలం వెంకటాయపాలెంలో మోటార్లు కాలిపోవటంతో పంచాయతీ అధికారులు సొంతంగా రూ.వేలు వెచ్చించి మరమ్మతులు చేయించారు. అయినా తరచూ ఏదో ఒక సమస్య ఉత్పన్నమవుతోంది. తాజాగా పైపులైన్ పగిలిపోవటంతో అప్పోసొప్పో చేసి బాగు చేయించి నీరందిస్తున్నారు.

వైరా మండలంలో సుమారు 370 చేతిపంపులు ఉన్నాయి. వీటిలో దాదాపు 100 పనిచేయటం లేదు. చాలాచోట్ల ప్రత్యామ్నాయ వనరులు బలంగా లేవని, మోటార్లు, లైన్లకు మరమ్మతులు చేపట్టాలని, నిధులు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపించారు.

వేధిస్తున్న నిధుల కొరత

ప్రత్యేకాధికారుల పాలన సాగుతున్నప్పటికీ వారికి నిధులు, అధికారాలు లేకపోవటంతో గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కారానికి నోచుకోలేకపోతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆర్థిక సంఘం నిధులు మంజూరు కాకపోవటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎక్కడెక్కడ బోర్లను అద్దెకు తీసుకోవాలి.. ట్యాంకర్ల ద్వారా నీటిని పంపిణీ చేయాలనే అంశంపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. వేసవి ముందస్తు ప్రణాళికపై కసరత్తు జరిగినా నిధులు సమకూర్చితేనే అంతిమంగా ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సకాలంలో స్పందించకపోతే..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గిరిజనులు అధికంగా ఉన్నచోట్ల తాగునీటి కష్టాలు తప్పటం లేదు. అశ్వాపురం మండలం రథంగుట్ట, పాల్వంచ సమీపంలోని తోగ్గూడెం నుంచి 1,500 గ్రామాలకు రోజుకు 15కోట్ల లీటర్ల తాగునీరు సరఫరా అవుతోంది. అయితే చాలా గ్రామాలకు సామర్థ్యం మేరకు మిషన్ భగీరథ పైపులైన్లు వేయలేదు. కొన్నిచోట్ల లైన్లు వేసినప్పటికీ అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు, టేకులపల్లి, బూర్గంపాడు, దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లోని కొన్నిగ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడుతోంది. భద్రాచలం వంటి చోట్ల కొన్నేళ్ల క్రితం ఏర్పాటుచేసిన సురక్షిత మంచినీటి పథకాలను నిర్వహిస్తున్నా లీకేజీలు, మోటార్లు కాలిపోవడం, లైన్లు పగిలినప్పుడు సత్వరం పునరుద్ధరించకపోవటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఖమ్మం జిల్లాలోని 579 గ్రామ పంచాయతీలున్నాయి. నిధుల కొరతతో ప్రత్యేకాధికారులు నామమాత్రంగా తయారయ్యారు. చాలాచోట్ల తాగునీటి వనరుల కోసం రూ.వేలల్లో అప్పు చేయాల్సి వచ్చిందని పలువురు అధికారులు వాపోతున్నారు. సుమారు 300 గ్రామపంచాయతీలకు అవసరం మేరకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయలేకపోతున్నారు. గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత వేధిస్తోంది. పంచాయతీ కార్యదర్శులపై భారం పడుతున్నా తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం. వేసవి కార్యాచరణ ప్రణాళిక కింద చేపట్టాల్సిన పనులను గుర్తించి నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

రాంబాబు, డీఎల్‌పీఓ, ఖమ్మం

## పేరులోనే ఉంది అంతా

మంచిర్యాల : ధ్రువపత్రాల కోసం దరఖాస్తుల సమయంలో చాలా మంది తప్పులు చేస్తున్నారు. పేరు, ఇంటి పేరు, పుట్టిన తేదీని రాయడంలో చేస్తున్న పొరపాట్లు పెరుగుతున్నాయి. చాలా మంది తడబాటుకు గురవుతున్నారు. ధ్రువపత్రం వచ్చాక దోషాన్ని గుర్తించి ఆందోళన చెందుతున్నారు. పేర్లు, ఇతర వివరాలు సరిచూసుకోకుండా దరఖాస్తు చేస్తుండటంతో ఈ సమస్యలు తలెత్తుతున్నాయి. తమ పిల్లల విషయంలో తల్లిదండ్రుల నిర్లక్ష్యంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి.

వన్ నేషన్ వన్ స్టూడెంట్ ఐడీ కార్యక్రమం ద్వారా విద్యార్థుల పురోగతిని పరిశీలించవచ్చన్న ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం అపార్(ఆటోమేటెడ్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ)ను ప్రవేశపెట్టింది. ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు వెళ్లాలన్నా, ప్రవేశ పరీక్షలు రాయాలన్నా అపార్ నంబరు వినియోగించాల్సి ఉంటుంది. ఇంతటి కీలకమైన నమోదు ప్రక్రియ సాంకేతిక కారణాలతో ముందుకు సాగడం లేదు. పాఠశాల రికార్డులో ఉన్న విద్యార్థుల వివరాలు, ఆధార్ నంబరును అపార్‌లో నమోదు చేయాలి. పాఠశాల రికార్డుల్లో ఉన్న పేరు, ఆధార్‌లో ఉన్న పేరు ఒకే రకంగా ఉండాలి. తేడా ఉంటే నమోదు కావడం లేదు.

ప్రస్తుతం చాలా మంది విద్యార్థులకు సంబంధించి పాఠశాల రికార్డుల్లో పేర్లు, ఆధార్ కార్డుల్లో పేర్లతో అక్షరదోషాలుగా ఉండడంతో వివరాల మార్పులకు తమ పిల్లల్ని వెంటేసుకొని ఆయా కార్యాలయాలు తిరగాల్సిన పరిస్థితి వచ్చింది. ఆధార్‌కార్డుల్లో పేరు, అక్షర దోషాల సవరణకు తగిన ధ్రువపత్రాలు సమర్పించాలి. పుట్టిన తేదీకి మార్పులకు జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. చిన్నారులు పుట్టినప్పుడే పుట్టిన తేదీని నమోదు చేసుకోవాలి. బిడ్డ ఆసుపత్రిలో జన్మిస్తే సదరు ఆసుపత్రి వారు తల్లిదండ్రుల వివరాలు అడుగుతారు. మనం చెప్పిన వివరాలు సరిగ్గా నమోదు చేశారో లేదో ఒకటి రెండు సార్లు ఆరా తీయాలి. చిన్నారుల నామకరణం రోజు పెట్టే పేరును తల్లిదండ్రులు ముందుగానే నిర్ణయించుకుంటే మంచిది. జనన ధ్రువీకరణ పత్రం మీసేవలో దరఖాస్తు చేసుకుంటే ఆసుపత్రిలో మనం ఇచ్చిన వివరాలే సంబంధిత అధికారులు ఆమోదించి ధ్రువపత్రాన్ని జారీ చేస్తారు. చాలా మంది ఆసుపత్రుల్లో వివరాలు నమోదు తప్పుగా చేయించడంతో మరోసారి ఆసుపత్రుల ద్వారా సవరణకు దరఖాస్తు చేస్తున్నారు. పాఠశాల ప్రవేశాల్లో తమ చిన్నారులను బడికి పంపేందుకు ప్రవేశాల సమయంలో ఆధార్‌కార్డు, ఇంటిపేరు, తల్లిదండ్రుల పేర్లు పుట్టిన తేదీ వివరాలు కచ్చితంగా సరిచూసుకోవాలి. మనం ఇచ్చిన వివరాలు, పాఠశాల సిబ్బంది నమోదు చేసుకున్న వివరాలు ఒకేలా ఉన్నాయా లేదా సరిచూసుకోవాలి. పొరపాట్లు ఉంటే స్పందించి వెంటనే మార్పించుకోవాలి. ఆధార్...ప్రతి వ్యక్తికి ప్రస్తుతం ఆధార్ తప్పనిసరిగా మారింది. చిన్నారి ఆధార్ నమోదుకు వెళ్లినపుడు మనం ఇచ్చిన దరఖాస్తులో పొందుపర్చిన వివరాలు సరిగ్గానే ఉన్నా ఆధార్ కేంద్రం నిర్వాహకుడు వివరాలు నమోదులో తప్పులు చేసే అవకాశం ఉంది.

చురకలు



# పక్కాగా.. నీటి నిల్వ లెక్క

హైదరాబాద్: హెచ్ఎండీఏ పరిధిలోని చెరువులకు సంబంధించి పూర్తి నీటి నిల్వ సామర్థ్యం(ఎఫ్టీఎల్) లెక్క తేలనుంది. దీంతో ఎఫ్టీఎల్ ఆక్రమణదారుల గుట్టురట్టు కానుంది. ప్రస్తుతం హెచ్ఎండీఏలోని ఏడు జిల్లాల పరిధిలో 3,874 చెరువులను గుర్తించగా.. ఇప్పటికే 962 చెరువులకు ఎఫ్టీఎల్ తుది నోటిఫికేషన్ జారీ చేశారు. మరో 2,912 చెరువులకు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించిన తర్వాత వీటికీ ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. 12ఏళ్ల క్రితమే ఎఫ్టీఎల్ నిర్ధారణకు ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ.. నత్తను తలపిస్తోంది. ఎట్టకేలకు హైకోర్టు జోక్యంతో యంత్రాంగం ఉరుకులు పరుగులు పెడుతోంది. ఎప్పటికప్పుడు చెరువుల సమాచారాన్ని కోర్టుకు సమర్పించాల్సి రావడంతో అధికారులు త్వరితగతిన ఈ తతంగం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**ప్రయోజనాలు ఇవీ..**

2 దశాబ్దాల వరదను పరిగణలోకి తీసుకొని స్థానిక గ్రామ, రెవెన్యూ మ్యాపులను పరిశీలించి పకడ్బందీగా ఎఫ్టీఎల్ నిర్ధారించిన తర్వాత ఆయా జిల్లా కలెక్టర్లు నోటిఫై చేస్తారు. తర్వాత దానిని మార్చేందుకు



వీలుండదు. అవుటర్ రింగ్‌రోడ్డు లోపల చెరువులను హైడ్రా కిందకు చేర్చుతూ ప్రభుత్వం జీవో 129 జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ చెరువుల వరకు లేక్ ప్రొటెక్షన్ అంతా హైడ్రా కిందకు రానుంది. ఎఫ్టీఎల్ వరకు హెచ్ఎండీఏ నిర్ధారించినప్పటికీ పరిరక్షణ హైడ్రా చూడనుంది. ఈ ప్రాంతాల్లో చేపట్టే నిర్మాణాలు, లేఅవుట్లకు తొలుత హైడ్రా నుంచి క్లియరెన్సు వచ్చిన తర్వాతే హెచ్ఎండీఏ అనుమతులు ఇవ్వనుంది. నగరం చుట్టూ ఉన్న చెరువులకు భవిష్యత్తులో ఎలాంటి ఆక్రమణలకు గురి కాకుండా ఈ చర్యలు ఉపయోగపడనున్నాయి. ఒకవేళ ఆక్రమణలు జరిగినా.. ఎఫ్టీఎల్‌లో నిర్మాణాలున్నా.. హైడ్రా విచారించి చర్యలు తీసుకోనుంది. నగరానికి తాగునీటిని అందించే ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంటజలాశయాలు సైతం ఈ జాబితాలోనే ఉన్నాయి. ఎఫ్టీఎల్ నిర్ధారణ తర్వాత అప్పటికే ఉన్న ఆక్రమణలను కూల్చివేయాలి. కొత్తగా అక్కడ ఎలాంటి కట్టడాలకు అనుమతులు ఇవ్వరు. చెరువులు, పచ్చదనం రక్షణ కోసం హెచ్ఎండీఏ ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందిస్తోంది.

# 1న రేషన్ కార్డుల పంపిణీ

హైదరాబాద్: గ్రేటర్ పరిధిలో రేషన్‌కార్డులను మార్చి 1న పంపిణీ చేసేందుకు రంగం సిద్ధమైంది. ప్రజాపాలనలో 5.73 లక్షల మంది కొత్త కార్డులకు దరఖాస్తు చేసుకున్నారు. సమగ్ర పరిశీలన అనంతరం వీరిలో 83 వేల దరఖాస్తులను అర్హులుగా గుర్తించారు. మొదటి దశలో వీరికి కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేయనున్నారు. జీహెచ్ఎంసీ నుంచి కొత్త కార్డుల అర్హుల జాబితా పూర్తి స్థాయిలో అందిన తర్వాత రేషన్ పంపిణీ వంటి ఇతర అంశాలపై దృష్టి సారించనున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఇతర జిల్లాల్లో కొత్త కార్డుల పంపిణీ జనవరి 26న ప్రారంభమైనా నగరంలో వార్డు సభల నిర్వహణలో జరిగిన జాప్యంతో అర్హుల గుర్తింపు ఆలస్యమైందని, ప్రభుత్వం ఆదేశాల నేపథ్యంలో ప్రక్రియను వేగవంతం చేసి కార్డుల పంపిణీ ప్రక్రియను చేపడుతున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు




తెలిపారు. మరోవైపు ఇటీవల మీసేవా కేంద్రాల్లో కొత్త దరఖాస్తుల కోసం అవకాశం కల్పించగా 1.25 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. నిత్యం కొత్తవి వస్తూనే ఉన్నాయి. వీటి పరిశీలన ప్రక్రియను తదుపరి దశలో చేపట్టి అర్హులను గుర్తించనున్నారు.

**మార్పులు, చేర్పుల కార్డులు తర్వాత**

రేషన్‌కార్డుల్లో కొత్త సభ్యుల చేర్పులు, తొలగింపులు, తప్పుల సవరణ వంటి వాటికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. వీటి కోసం గ్రేటర్‌లో 1.20 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వార్డు సభల్లో చర్చించి అర్హత కలిగిన దరఖాస్తులను వడపోశారు. ప్రస్తుతం మార్పులు చేర్పులతో కూడిన కొత్త కార్డుల జారీ ఉండకపోవచ్చని వివరించారు.

# తపాలా శాఖలో కొలువుల పంట

భువనగిరి : పదో తరగతి ఉత్తీర్ణత అయితే చాలు పరీక్ష లేకుండానే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించుకునే అవకాశం వచ్చింది. తపాలాశాఖ ఆధ్వర్యంలో గ్రామీణ డాక్ సేవక్(జీడీఎస్-2025) ప్రకటన వెలువడింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో 39 ఖాళీలను భర్తీ చేయనున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో పదో తరగతి మార్కుల ఆధారంగా బీపీఎం, ఏబీపీఎం, డాక్ సేవక్‌లుగా ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి నెలకు రూ.15 వేల నుంచి రూ.20వేల వరకు వేతనంతోపాటు కేంద్రం అందిస్తున్న 53శాతం డీఏ కింద రూ.5వేల నుంచి రూ.6వేల వరకు అదనపు వేతనం వర్తించనుంది. సంబంధిత సమాచారం ఉమ్మడి జిల్లా తపాలాశాఖ సూపరిండెంటెంట్ రఘునాథస్వామి కు వెల్లడించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఇలా..పదో తరగతి ఉత్తీర్ణత మెమోతోపాటు ఆధార్‌కార్డు, ఫొటో, చరవాణి సంఖ్య ఆధారంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ముందుగా indianpost gds online.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ కావాల్సి ఉంటుంది. అక్కడ దరఖాస్తు పేజీ తెరుచుకుంటుంది. చరవాణి, ఈ-మెయిల్ ఐడీ ఆధారంగా రిజిస్టరు చేసుకోవాలి. అనంతరం చరవాణికి వచ్చే ఓటీపీ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లాలో ఉన్న ఖాళీల ప్రకారం ప్రాధాన్యత క్రమం ఇస్తే సరిపోతుంది. చివరగా రుసుం చెల్లిస్తే దరఖాస్తు పూర్తవుతుంది. దరఖాస్తులకు తుది గడువు మార్చి 3 వరకుంది. మహిళలు, దివ్యాంగులకు దరఖాస్తు ఉచితం. జనరల్ అభ్యర్థులు రూ.100 రుసుం చెల్లిస్తే సరిపోతుంది. అందుబాటులో ఉన్న మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశమూ ఉంది. అయితే అంతర్జాలంలో స్వీకరించిన దరఖాస్తుల్లో మెరిట్ ఆధారంతోపాటు వివిధ రకాల కేటగిరిల ప్రకారం ఉద్యోగాలను ఎంపిక చేస్తారనే విషయం గమనించాల్సి ఉంటుంది.

# దెబ్బతిన్నదారులు.. కొత్త నిర్మాణాలే మేలు



సిరిసిల్ల : జిల్లాలో ఆర్అండ్‌బీ రహదారులు అధ్వానంగా మారాయి. వర్షాలకు రోడ్డు కోతకు గురికాగా ఏటా తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారు. వీటికి శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో మూడేళ్లుగా పరిస్థితి అధ్వానంగా మారింది. ఇటీవల రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి రాష్ట్రస్థాయి సమీక్ష నిర్వహించారు. దెబ్బతిన్న రహదారులపై జిల్లాలవారీగా నివేదికలు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో హమ్ (హైబ్రిడ్జ్ అన్యూటి మోడల్)లో 300 కిలోమీటర్ల రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంచేసి ప్రభుత్వానికి పంపారు.

**మరమ్మతులు చేపట్టాల్సినవి...**

జిల్లాలో వేములవాడ నియోజకవర్గంలో 130 కిలోమీటర్లు, సిరిసిల్లలో 120 కిలోమీటర్లు, బోయినపల్లి, ఇల్లంతకుంట మండలాల్లో 50 కిలోమీటర్ల రహదారులు గుర్తించారు. దెబ్బతిన్న వాటికి వర్షాకాలం లోపు మరమ్మతులు పూర్తిచేసేలా ఆధునిక యంత్రాలను వాడాలని నిర్ణయించారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ నుంచి ముస్తాబాద్ మండలం గూడెం. ఇల్లంతకుంట మండలం ముస్కాన్‌పేట నుంచి సిద్దిపేట. కోరుట్ల - వేములవాడ, కొండగట్టు - వేములవాడ రహదారులతోపాటు కరీంనగర్-కామారెడ్డి, శాత్రాజులపల్లి నుంచి పెద్దమ్మకూడలి వరకు ప్రధాన రోడ్లు ఉన్నాయి.

కోనరావుపేట మండలం మామిడిపల్లి-నిజామాబాద్, నిమ్మపల్లి-వట్టిమల్ల, రహదారిలో మూలవాగుపై తాత్కాలిక వంతెనలు ఏటా కోతకు గురవుతున్నాయి. ఇప్పటికి మూడేళ్లుగా రూ.15 లక్షలు వెచ్చించి మట్టి, పైపులతో చదును చేశారు. సిరిసిల్ల-మరిమడ్ల ప్రధాన రహదారిలో లచ్చపేట వద్ద లోలెవల్ వంతెన రోడ్డు కోతకు గురికావడంతో రూ.లక్షతో తాత్కాలిక మరమ్మతులు చేశారు.

వేములవాడ మండలం హన్మాజీపేట-బావుసాయిపేట, వేములవాడ-సిరికొండ మార్గంలో కాజ్‌వేల వద్ద ఏటా వరదలతో నీరు ముంచెత్తుతోంది. వేములవాడ-కోరుట్ల రహదారిలో చందుర్తి మండలం సనుగుల వద్ద రెండు చోట్ల రహదారి కోతకు గురైంది.

వేములవాడ పట్టణ శివారులో బీరప్ప ఆలయం సమీపంలో మల్లారం రహదారిలో లోలెవల్ కాజ్‌వే శిథిలావస్థకు చేరింది.

మాచారెడ్డి-ముస్తాబాద్-సిద్దిపేట రహదారిలో కాజ్‌వే ప్రమాదకరంగా మారింది. పెద్దమ్మ స్టేజి-లింగన్నపేట రహదారిలో హైలెవల్ వంతెన నిర్మాణ ప్రాంతంలో తాత్కాలిక రహదారి మానేరు వరద ఉద్ధృతికి నామరూపాల్లేకుండా కొట్టుకుపోయింది. ఇల్లంతంకుట మండలం జవారిపేట-నర్సక్కపేట మధ్యలో వరదతాకిడికి కాజ్‌వే పైపులతోసహా కొట్టుకుపోయింది. అధికారులు ఈ మార్గంలో రాకపోకలను దారిమళ్లించారు.

# ఇసుక లభించక ఇబ్బందులు



బోయినపల్లి : బోయినపల్లి మండలంలో మాన్వాడ, మల్లాపూర్ గ్రామాల్లో మానేరు వాగు విస్తరించి ఉంది. మాన్వాడ గ్రామం నుంచి గతంలో ప్రభుత్వ పనులకు, ఇళ్ల నిర్మాణాలకు ఇసుక రవాణాకు అనుమతి ఇచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వ పనులకు( సీసీ రోడ్లు, మురుగు కాలువ నిర్మాణం ఇతర పనులు) మాత్రమే ఇసుక రవాణాకు అనుమతి ఇస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న వారికి అనుమతులు ఇవ్వడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇసుక లభించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. కొంత మంది నిర్మాణ పనులు నిలిపివేశారు. ఎలాంటి నిర్మాణ పనులు ప్రారంభించాలన్న ఇసుక తప్పని సరి. వేసవి కాలం సమీపిస్తుండటంతో గ్రామాలు, పట్టణాల్లో నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి. కాగా ఇసుక రవాణా చేసుకోవడానికి జిల్లాలో రెవెన్యూ అధికారులు ఆయా మండలాల పరిధిలో అనుమతులు మంజూరు చేస్తున్నారు. ప్రభుత్వ పనులు, ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కావాల్సిన వారు సంబంధిత అధికారుల ధ్రువీకరణ పత్రంతోపాటు ఒక్కో ట్రాక్టరు ట్రిప్పు ఇసుక కోసం రూ.480 డీడీతీసి తహసీల్దారు కార్యాలయంలో అందజేయాలి. అనంతరం అధికారులు సూచించిన రీచ్ నుంచి వారి పర్యవేక్షణలో నిబంధనల మేరకు నిర్ణీత సమయంలోగా ఇసుక రవాణా చేసుకోవాలి. ఒక్కో చోట వారంలో రెండు రోజులు ఇసుక రవాణాకు అనుమతి ఇస్తుండగా మరికొన్ని చోట్ల ఒక రోజు మాత్రమే అనుమతిస్తున్నారు. ప్రస్తుతం నీటి లభ్యత ఉండటం, వాతావరణం అనుకూలతతో ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఏప్రిల్, మే నెలాఖరకు భూగర్భ జలాలు అడుగంటిపోయే అవకాశం ఉండటంతో క్యూరింగ్ చేయడంలో ఇబ్బందులు ఎదురవుతాయని పలువురు పేర్కొంటున్నారు. ఇక వర్షాకాలం ప్రారంభమైందంటే నిర్మాణ పనులు ముందుకు సాగవని చెబుతున్నారు.

**జిల్లాలో ఇదీ పరిస్థితి**

కోనరావుపేట మండలంలో కనగర్తిలోని మూలవాగు నుంచి స్థానిక అవసరాలు, ప్రభుత్వ పనులకు ఇసుక రవాణాకు అనుమతి ఇస్తున్నారు. బావుసాయిపేట నుంచి కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులకు ఇసుక రవాణా జరుగుతుంది. ఇల్లంతకుంట మండలంలో బిక్కవాగు నుంచి ఇసుక తరలిస్తున్నారు.

వేములవాడ గ్రామీణ మండలం లింగంపల్లి, మల్లారం, వేములవాడ మండలం జయవరంలోని మూలవాగు నుంచి, రుద్రంగి మండలంలోని నందివాగు, ముస్తాబాద్ మండలంలో ఆవునూర్, ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ నుంచి ఇసుక రవాణాకు అనుమతులు జారీ చేస్తున్నారు

గంభీరావుపేట, చందుర్తి, వీర్నపల్లి మండలాల్లో ఇసుక రవాణాకు సమీప మండలాలపై ఆధారపడాల్సి వస్తుంది.


**లారీల్లో తెప్పించడంతో అదనపు భారం**

స్థానిక వాగుల నుంచి ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వక పోవడంతో లారీల్లో సుదూర ప్రాంతాల నుంచి ఇసుక తెప్పించా. దీనివల్ల అదనంగా రూ.10 వేలు ఆర్థికభారం పడుతుంది. ప్రభుత్వ పనులకు వే బిల్లులు జారీ చేస్తున్నందున ఇంటి నిర్మాణదారులకు అనుమతులు ఇవ్వడానికి జిల్లా అధికారులు చొరవ తీసుకోవాలినల్లగొండ అనిల్, బోయినపల్లి

**నిబంధనల మేరకు తరలింపు**

బోయినపల్లి మండలంలో చేపడుతున్న ప్రభుత్వ పనుల కోసం ఇసుక రవాణా చేసుకోవడానికి అనుమతులు జారీ చేస్తున్నాం. అధికారుల పర్యవేక్షణలో నిబంధనల మేరకు ఇసుక రవాణా జరుగుతుంది. నారాయణరెడ్డి, తహసీల్దారు, బోయినపల్లి

# తారు మెరిసింది.. ఊరు మురిసింది



పెద్దపల్లి: ఎలిగేడు మండలం లాలపల్లి గ్రామస్థుల చిరకాల కోరిక నెరవేరింది. ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న రహదారి కష్టాలు ఎట్టకేలకు తీరాయి. చొరవ, ఎమ్మెల్యే సహకారంతో తారు రోడ్డు నిర్మాణం పూర్తయింది. లాలపల్లి గ్రామం మండల కేంద్రానికి 1.5 కిలోమీటర్లు, జిల్లాకేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. చిన్నపాటి వర్షానికే రోడ్డంతా బురదగా మారుతుండటంతో ఆర్టీసీ అధికారులు గ్రామం మీదుగా వెళ్లే బస్సులను రద్దు చేసి, మరో మార్గంలో నడిపించేవారు. భారీ వర్షాలు కురిస్తే ట్రాక్టర్లు మినహా మరో వాహనం నడిచే పరిస్థితి లేదు. గ్రామస్థుల ఇబ్బందులను గుర్తించిన గతేడాది ఆగస్టు నుంచి వరుస కథనాలతో రహదారి దుస్థితిని పాలకుల దృష్టికి తీసుకొచ్చింది. స్పందించిన ఎమ్మెల్యే విజయరమణారావు నిధుల మంజూరుకు చొరవ చూపారు. ఎట్టకేలకు 1.4 కిలోమీటర్ల తారు నిర్మాణానికి సీఆర్ఆర్(గ్రామీణ రహదారుల నిర్మాణం) పథకం కింద రూ.1.6 కోట్లు మంజూరు చేయించారు. ఈ మేరకు గత నవంబరులో భూమిపూజ నిర్వహించారు. చీమలపేట క్రాస్‌రోడ్డు నుంచి గ్రామంలోని మల్లికార్జునస్వామి ఆలయం వరకు రహదారి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దీంతో గ్రామంలో ప్రధానమైన బురద కష్టాలు పూర్తిగా తొలగిపోయాయి. ఇక ఆలయం నుంచి ఎలిగేడు వైపు వెళ్లే రోడ్డు వరకు మరో 600 మీటర్ల పనులు చేయాల్సి ఉంది. ఆ పనులను మరో ప్యాకేజీ కింద చేపట్టనున్నారు. ఎలిగేడు నుంచి మల్లికార్జునస్వామి ఆలయం వరకు 2.2 కిలోమీటర్ల దూరానికి రూ.2.60 కోట్లు మంజూరు కాగా టెండర్లు పూర్తయ్యాయి.

**బస్సుల మళ్లింపుతో వెలుగులోకి..**కరీంనగర్ నుంచి జూలపల్లికి వెళ్లే ఆర్టీసీ బస్సు ఎలిగేడు, లాలపల్లి, చీమలపేట మీదుగా వెళ్తుంది. ఏటా వానాకాలం వచ్చిందంటే బురద రహదారిపై బస్సు టైర్లు జారుతుండటంతో గతేడాది ఆగస్టులో ఆర్టీసీ అధికారులు బస్సు మార్గాన్ని మళ్లించారు. ఎలిగేడు నుంచి ధూళికట్ట క్రాస్‌రోడ్డు నుంచి చీమలపేట మీదుగా నడిపించారు. దీంతో లాలపల్లి గ్రామస్థులు ఎలిగేడుకు కాలినడకన వెళ్లాల్సి వెళ్లాల్సి వచ్చింది. రాత్రిళ్లు అత్యవసర పరిస్థితుల్లో ఆటోలు కూడా నడవకపోవడంతో ట్రాక్టర్లను ఆశ్రయించారు. ముఖ్యంగా ఎస్సీ కాలనీ ప్రజల పరిస్థితి దయనీయంగా మారింది. గ్రామస్థుల కష్టాలపై వరుస కథనాలతో ఎమ్మెల్యే విజయరమణారావు సైతం ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయించారు. తమ చిరకాల సమస్య పరిష్కారం కావడంతో లాలపల్లి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# 'ఎప్పటికో.. కను'మురుగు

హైదరాబాద్: మహానగరం శివారుల్లో మురుగు సంక్షోభం తరుముకొస్తోంది. జలమండలి పరిధి ఓఆర్ఆర్ వరకు విస్తరించిన నేపథ్యంలో విలీన గ్రామాలు, ప్రాంతాల్లో సరైన మురుగునీటి వ్యవస్థ లేకపోవడంతో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. ఎస్టీపీలు లేకపోవడంతో పర్యావరణ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దాదాపు గ్రామాల్లోని ఇళ్లన్నీ సెప్టిక్‌ట్యాంక్‌లు కలిగి ఉన్నాయి. మురుగునీటి వ్యవస్థ అంతా ఓపెన్ డ్రైయిన్లకు అనుసంధానమయ్యాయి. ప్రస్తుతం ఓఆర్ఆర్ లోపల ఉన్న విలీన గ్రామాల్లో సరైన మురుగునీటి వ్యవస్థ 20 శాతానికే పరిమితమైంది. ఈ మురుగునీటి డ్రైన్లు కూడా ప్రధాన మురుగునీటి కాలువలకు అనుసంధానం కాలేదు. ప్రధాన ట్రంక్ సీవర్‌లు కేవలం 5 శాతం మాత్రమే ఉన్నాయి. జలమండలి పరిధి.. ఓఆర్ఆర్ వరకు మహానగరం వేగంగా విస్తరిస్తుండటంతో మురుగునీటి వ్యవస్థ అనుసంధానం జలమండలికి సమస్యాత్మకంగా మారింది.

**ప్రాథమిక వ్యవస్థతోపాటు..**

గ్రామాలలో వందశాతం అండర్‌గ్రౌండ్ మురుగునీటి వ్యవస్థ ఏర్పాటు చేసి అనుసంధానించాలి. ప్రధానమైన ట్రంక్ సీవర్ల ఏర్పాటు కావాలి. ఆయా ప్రాంతాల భవిష్యత్ విస్తరణకు అనుగుణంగా మురుగునీటి



వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రస్తుత కనెక్షన్లను అనుసంధానించాలి. ఎస్టీపీలు ఏర్పాటు చేయాలి. ఇదంతా భారీ వ్యయంతో కూడుకున్నది కావడంతో జలమండలి తర్జనభర్జన పడుతోంది. పర్యావరణపరంగా నగరం మెరుగ్గా ఉండాలంటే పటిష్ట మురుగునీటి శుద్ధి విధానం అవసరం.

**సమగ్ర సీవరేజీ విధానం అవసరం**

మూసీ పునరుజ్జీవ కార్యక్రమాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తున్న నేపథ్యంలో వందశాతం మురుగు శుద్ధి కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఓఆర్ఆర్ లోపల పటిష్ట మురుగునీటి వ్యవస్థ ఏర్పాటు కీలకమని సమగ్ర సీవరేజీ మాస్టర్ ప్లాన్‌లో పేర్కొన్నారు. కేంద్రం లేదా రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటుతో తప్ప ఈ అంశాన్ని ముందుకు తీసుకెళ్లే పరిస్థితి జలమండలికి లేదని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. అభివృద్ధి, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని శివారుల్లో పటిష్ట విధానాన్ని రూపొందించాల్సి ఉందని అభిప్రాయపడుతున్నారు.

# కాటిలో కలుస్తున్న క్వారీ బతుకులు

భువనగిరి : క్రషర్స్‌లో పనిచేసే కార్మికుల ప్రాణాలకు భద్రత లేకుండా పోయింది. యాజమాన్యాలు నిబంధనలు పాటించకపోవడంతో వాటిల్లో పనిచేసే కూలీల ప్రాణాలు గాలిలో దీపంలా మారాయి. ఆలేరు మండలం శ్రీనివాసపురంలోని క్రషర్ మిల్లులో టిప్పర్ బోల్తాపడి ఇద్దరు కూలీలు మృతిచెందిన ఘటన ఇందుకు ఉదాహరణ. అర్ధరాత్రి దాటాక ప్రమాదం జరిగినట్లు చెబుతున్నా.. ఉదయం వరకు పోలీసులకు సమాచారం ఇవ్వలేదు. భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాలను శవపరీక్షకు తరలించారు తప్ప సాయంత్రం వరకు యజమానులు పత్తాలేరు. ప్రమాదం తర్వాత క్రషర్‌కు తాళం వేసి వెళ్లారు. జిల్లాలో సుమారు 60 క్వారీలకు అనుమతులున్నాయి. 40కిపైగా క్రషర్స్ ఉన్నాయి. వాటిల్లో పనిచేసే కూలీలు, కార్మికులు చాలా వరకు ఇతర రాష్ట్రాలకు చెందిన వారే. బిహార్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది వలస కూలీలుగా పనిచేస్తున్నారు. వారి వివరాలు ఏమీ నమోదు చేయకుండా పనిచేయిస్తున్నారు. పీఎఫ్, ఈపీఎఫ్ లాంటి సౌకర్యాలు కల్పించడం లేదు. సౌకర్యాలు కల్పించకుండా గుట్టల్లో పనిచేయిస్తున్నారు. కాలం చెల్లిన వాహనాల్లో బండరాళ్లను తరలిస్తున్నారు. టిప్పర్లో బండ రాళ్ల లోడ్‌కు వెళ్తున్న క్రమంలో ఆ వాహనం అదుపుతప్పి బోల్తాపడటంలో ఈ ప్రమాదం జరిగినట్లుగా ప్రాథమికంగా గుర్తించామని ఆలేరు ఎస్ఐ తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతుల బంధువులు వస్తే కేసు నమోదు చేస్తామన్నారు.

మైనింగ్ కోసం గనుల శాఖ అనుమతులు ఇస్తారు. లీజ్ విస్తీర్ణం మేరకు రాయల్టీని వసూల్ చేస్తారు. కాగా క్రషర్స్ నిర్వహణకు మైన్స్ సేఫ్టీ విభాగం, కాలుష్య నియంత్రణ మండలి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, కార్మిక, తదితర శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. అలాంటివేమీ తీసుకోకుండా జిల్లాలో పలు క్రషర్స్ నడిపిస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి ప్రమాదం జరిగిన శ్రీనివాసపురంలోని కంపెనీకి రెండు మైన్స్ ఉన్నాయని గనుల శాఖ జిల్లా సహాయ సంచాలకుడు రాఘవరెడ్డి తెలిపారు. ఒక గని తవ్వకానికి సంబంధించి అనుమతి రెన్యూవల్ చేశామని, మరో గనికి అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. మాత్రమే తాము అనుమతులిస్తామని, క్రషర్స్‌తో సంబంధం లేదని ఆయన వివరణ ఇచ్చారు. భద్రతకు సంబంధించి హైదరాబాద్‌లోని మైన్స్ సేఫ్టీ విభాగం చూసుకుంటుందన్నారు.

# స్వీయ పరీక్ష రాసుకో.. తప్పులు సరిదిద్దుకో

మిర్యాలగూడ : వివిధ పరీక్షలు దగ్గర పడుతున్న ప్రస్తుత తరుణంలో విద్యార్థులు తీవ్ర ఆందోళన, ఒత్తిడికి గురవుతుంటారు. ముఖ్యంగా పరీక్షల కోసం ఎలా సన్నద్ధమవ్వాలి..ముందుగా ఏది చదవాలి.. ఎలా చదవాలి అనే సందేహాలు బుర్రలో గింగిరాలు తిరుగుతుండడంతో చదువుపై ఏకాగ్రత చూపలేకపోతుంటారు. అందులోనూ గణితం అంటే తరగతిలోని 50శాతం విద్యార్థులు ఎంతో ఆందోళనకు గురవుతుంటారు. అయితే పరీక్ష ఏదైనా గణితంలో అత్యధిక మార్కులు సాధిస్తేనే మంచి మార్కులు సాధించే అవకాశం ఉంటుంది. పదో తరగతి, ఇంటర్ పరీక్షలు సమీపిస్తుండడంతో గణితం ఎలా చదివి..మంచి మార్కులు సాధించాలో వివరిస్తూ కథనం..

ఈ విధంగా సన్నద్ధం కావాలి..

పరీక్షల కోసం చదివేందుకు తొలుత అధిక మార్కులు ఉండే పెద్ద, కఠిన సమస్యలను ఎంపిక చేసుకోవాలి.

అనంతరం చిన్న, సులభమైన సమస్యలను అధ్యయనం చేయాలి.

పలు పరీక్షల్లో వచ్చే ప్రశ్నలను బాగా అధ్యయనం చేయాలి.

ఫార్ములాలను నిత్యం రివైజ్ చేస్తూ ఉండాలి.

నిత్యం చదివిన వాటిపై స్వీయ పరీక్ష రాసుకోవాలి.

తప్పులు సరిచూసుకుని..ఏమైనా తేడాలుంటే మళ్లీ అధ్యయనం చేయాలి.

ప్రతి గంటన్నరకు పది నిమిషాల విరామం తీసుకోవాలి.

ఒకే సమస్యపై అధిక సమయాన్ని కేటాయించకుండా విషయాన్ని పూర్తిగా అవగతం చేసుకోవాలి.

గణితం చదివేటప్పుడు ఏకాగ్రత ఎంతో ముఖ్యం.

ఏదైనా సమస్య రాకపోతే ఆత్మవిశ్వాసాన్ని సడలనీయకండి.

ప్రాక్టిస్ పేపర్లపై నిత్యం కొంత సమయం కేటాయించండి.

చురకలు



# లక్షణమైన నంబరు

మెదక్ : వాహనాలకు ఫ్యాన్సీ నంబరు పొందేందుకు యజమానులు పోటీపడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రవాణాశాఖ నిర్వహించే ఆన్‌లైన్ వేలంలో రూ.లక్షలో పోసి నచ్చిన నంబర్లు దక్కించుకున్నారు. వాహనాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ప్రభుత్వం గతేడాది మార్చి 15వ తేదీన కొత్త కోడ్ అందుబాటులోకి తీసుకొచ్చింది. నాటి నుంచి రవాణాశాఖకు కాసుల వర్షం కురుస్తోంది. పది నెలల్లోనే జిల్లాలోని మెదక్ ఆర్టీఏ కార్యాలయానికి 829 ఫ్యాన్సీ నంబర్ల ద్వారా రూ.46,82,021 ఆదాయం సమకూరింది.



**వేలంలో నంబర్ దక్కించుకొని**

వాహనాలకు ఫ్యాన్సీ, లక్కీ, పుట్టిన రోజులు వచ్చేలా నంబర్లు తీసుకుంటున్నారు. దీనికోసం రూ.లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. ఇటీవల ఓ వ్యక్తి 6666 నంబరుకు రూ.1,55,678 వెచ్చించి వేలం పాటలో దక్కించుకున్నాడు. వేలంలో పాల్గొనే వ్యక్తుల సంఖ్య తెలియదు. దీంతో కేవలం నంబర్లను చూసి ఒకే వ్యక్తి ఎక్కువ బిడ్లు వేసి వాటిని దక్కించుకుంటున్నారు. మెదక్‌లో టీజీ ఫ్యాన్సీ నంబర్లతో 829 వాహనాలు రిజిస్ట్రేషన్ కాగా.. ఇందులో 6666 నంబర్‌ను రూ.1,55 ,678.. 5555 నంబర్‌ను రూ.1,53,500.. 9099 నంబర్‌ను రూ.71,555కు కొనుగోలు చేశారు.

**ఆన్‌లైన్‌లో బిడ్లు దాఖలు చేయాలి**

ఆన్‌లైన్‌లో బిడ్లు నమోదు చేసే అవకాశం ఉంటుంది. ఎక్కువ మొత్తం బిడ్ వేసిన వారికి సంబంధిత నంబరును రిజర్వు చేస్తారు. దాని ప్రకారం వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేసుకునే వీలుంటుంది. ఈ విధానంతో రవాణాశాఖకు భారీగా ఆదాయం సమకూరుతోంది. వెంకటస్వామి, జిల్లా రవాణా శాఖాధికారి

# కంది.. కొనరేంది?

చేర్యాల: పది రోజుల క్రితం కందుల కొనుగోలు కేంద్రాన్ని పోటీ పడి అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఇప్పటివరకు కందుల కొనుగోలు ప్రక్రియ ప్రారంభించలేదు. ఎవరూ పట్టించుకోవటం లేదు. చేర్యాలో కాంగ్రెస్, భారాస ప్రజాప్రతినిధులు, నాయకులు ఒకేరోజు రెండుసార్లు కందుల కొనుగోళ్లు ప్రాంభించారు. కందులను తీసుకొచ్చిన రైతులు వ్యవసాయ మార్కెట్, అటు పీఏసీఎస్ పాలకవర్గాల పనితీరుతో అసహనానికి గురవుతున్నారు. రోజూ వాటిని ఆరబోయడం, రాశి పోయడం చేస్తున్నారు. కొందరు రైతులు వాపసు తీసుకెళ్లి వ్యాపారులకు అమ్ముకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర దక్కకుండా పోతోంది. ఈ విషయాన్ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి దృష్టికి ఆకునూరు రైతులు ఇటీవల తీసుకెళ్లారు. వెంటనే పీఏసీఎస్ అధికారికి ఆయన ఫోన్ చేసి ఆరా తీశారు. తూకం వేసి కొనుగోలు అనుమతి ఇవ్వాలన్నారు. నిబంధనల మేరకు తేమ శాతం వచ్చిన కందులను సేకరిస్తామని సీఈవో రాములు తెలిపారు. ఆరబోసి, చెత్త లేకుండా నాణ్యత పాటించాలన్నారు.

నమోదు చేయలేదు: ఎల్లయ్య, ధర్మారం, మద్దూరు మండలం

మాది మద్దూరు మండలం ధర్మారం. సొంత భూమిలో 3 ఎకరాల్లో కంది సాగు చేశా. అధికారులు రికార్డుల్లో నమోదు చేయలేదు. నా పేరున రాసివ్వమని మద్దూరులో వ్యవసాయాధికారులను అడిగితే చేర్యాలకు వెళ్లమంటున్నారు. చేర్యాలకు వస్తే మద్దూరు మండల వ్యవసాయాధికారులే ఇవ్వాలంటున్నారు. ఏమి చేయాలో పాలుపోవడం లేదు.కాపలా ఉండలేం: తరిగొప్పుల సత్తవ్వ, ముస్త్యాల, చేర్యాల మండలంకందుల సేకరణ చేపట్టగానే మార్కెట్‌కు తేవాలని పది రోజులుగా ఎదురుచూస్తున్నాం. రెండు రోజుల క్రితం పంట తెచ్చాం. వాటికి కాపలా ఉండలేకపోతున్నాం. ఎప్పటికప్పుడు సేకరిస్తే, సమస్య ఉండదు. అందరివీ కొనుగోలు చేస్తామని నిర్వాహకులు అంటున్నారు.

# ఆగని అక్రమ దందా..!

ఖమ్మం : గ్రానైట్, కంకర క్వారీల నిర్వహణతో రూ.కోట్లు కొల్లగొడుతున్న యజమానులు.. రాయల్టీ చెల్లించకుండా వక్రమార్గాలు అనుసరిస్తున్నారని ప్రభుత్వం భావిస్తోంది. దొడ్డిదారిన క్వారీలు నిర్వహిస్తూ.. 'నాన్ వర్కింగ్' అని చూపుతూ రాయల్టీ చెల్లించకపోవటాన్ని తీవ్రంగా పరిగణిస్తోంది. ఉల్లంఘనులపై కొరడా ఝుళిపించేందుకు టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దించుతోంది.

**త్వరలోనే రంగంలోకి..**

రాష్ట్రవ్యాప్తంగా 261 క్వారీలు 'నాన్ వర్కింగ్' జాబితాలో ఉన్నట్లు గనులశాఖ గుర్తించింది. వీటిలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని క్వారీలు సుమారు 40 ఉన్నాయని తేల్చింది. కొన్నేళ్లుగా ఆయా క్వారీల్లో ఎలాంటి కార్యకలాపాలు జరపటం లేదని.. వాటి యజమానులు గనులశాఖకు స్పష్టం చేశారు. గనులశాఖ జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకుండానే 'నాన్ వర్కింగ్' జాబితాలో చేర్చారు. అప్పటి నుంచి ఆయా క్వారీల యజమానులు ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించటం లేదు. గనులశాఖ నుంచి ప్రభుత్వానికి వస్తున్న ఆదాయంపై కాంగ్రెస్ సర్కారు సమీక్షలు నిర్వహించింది. గతంలో గ్రానైట్, కంకర క్వారీల యజమానులు మైనింగ్ అధికారుల అండదండలతో యథేచ్ఛగా ఉల్లంఘనలకు పాల్పడ్డట్టు భూగర్భగనులశాఖ దృష్టికి వచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న క్వారీలు, ఉల్లంఘనలకు పాల్పడుతున్న యజమానులపై కొరడా ఝుళిపించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. జిల్లాల వారీగా టాస్క్‌ఫోర్స్ బృందాలను నియమించి క్వారీల్లో సాగుతున్న అక్రమాలు, ఉల్లంఘనల నిగ్గు తేల్చాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా రెవెన్యూ, పోలీసు, మైనింగ్, రవాణా, అటవీశాఖల అధికారుల తో టాస్క్‌ఫోర్స్ బృందాలను నియమించింది.

**అనేక చోట్ల ఉల్లంఘనలు**

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని అనేక క్వారీల్లో ఏళ్లుగా ఉల్లంఘనల తంతు కొనసాగుతోంది. నిషేధిత జాబితాలోని క్వారీల్లోనూ యథేచ్ఛగా తవ్వకాలు జరుగుతున్నాయి. కొంతమంది నిర్వాహకులు తమ క్వారీలు పని చేయటం లేదని చూపుతూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీని ఎగ్గొడుతున్నారు. అనుమతి తీసుకున్న విస్తీర్ణం కన్నా ఎక్కువ విస్తీర్ణంలో తవ్వకాలు జరుపుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అనుమతులు లేని క్వారీల విషయంలో లెక్కాపత్రమే లేకుండా పోయింది. లీజుల విషయంలోనూ నిబంధనలను ఉల్లంఘిస్తున్నా మైనింగ్‌శాఖ ఎక్కడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. క్వారీల్లో లోపలికి, బయటకు వెళ్లే మార్గాల్లో సీసీ కెమెరాలు అమర్చాలనే నిబంధన ఉన్నా విస్మరిస్తున్నారు. నిషేధిత జాబితాలోని క్వారీలు విద్యుత్తు సౌకర్యం పొందుతున్నాయి. మామూళ్లకు అలవాటు పడిన కొంతమంది అధికారులు ఏళ్లుగా అక్రమాలకు పరోక్షంగా అండగా నిలుస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం తాజాగా టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దించటంతో ఉల్లంఘనుల బండారం బయటపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రానైట్, కంకర క్వారీల ఉల్లంఘనలపై టాస్క్‌ఫోర్స్ బృందం ఏర్పడింది. జిల్లాలోని ఐదు ప్రధాన శాఖల అధికారులు బృందంలో ఉంటారు. ఉన్నతాధికారులు అందించిన జాబితా ప్రకారం బృంద సభ్యులు ఆయా క్వారీల్లో తనిఖీలు చేపట్టనున్నారు. పని చేయని జాబితాలో ఉన్నాయా, పనిచేస్తున్నా నిర్వాహకులు రాయల్టీ ఎగ్గొడుతున్నారా అనే అంశాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తారు. సాయినాథ్, మైనింగ్‌శాఖ ఏడీ, ఖమ్మం

# ఔషధ వ్యర్థాలతో అతలాకుతలం!



నల్గొండ : పరిశ్రమలో రోజంతా వచ్చిన వ్యర్థాలను ట్యాంకర్లలో నిల్వ చేసి అర్ధరాత్రి 12 గంటల నుంచి 3 గంటల మధ్యలో పారబోస్తున్నారు. చౌటుప్పల్ శివారులోని ఫార్మా వ్యర్థాల వల్ల అక్కడి చెరువు కలుషితమై జీవాలు నీళ్లు తాగలేని స్థితికి చేరుకున్నాయి. గతేడాది చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి శివారులోని అహల్య చెరువు, వెలిమినేడులోని పెద్దచెరువులో గుర్తుతెలియని వ్యక్తులు వ్యర్థాలు వదలడంతో కాలుష్యంతో రూ.లక్షల విలువ చేసే చేపలు మృతి చెంది మత్స్యకార్మికులకు అపార నష్టం వాటిల్లింది.

ఫిర్యాదు చేసినా కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) అధికారులు, పోలీసులు దీనిపై లోతైన విచారణ చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫార్మా పరిశ్రమల నుంచి వచ్చే వాసనతో పరిసర ప్రాంతాలతో పాటు, రహదారిపై ప్రయాణిస్తున్న వారు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి. రోడ్డు పక్కనే వ్యర్థాలను పారబోయడంతో హరితహారం కార్యక్రమంలో నాటిన చెట్లు సైతం చనిపోతున్నాయి. వీటిపై ఏం చర్యలు చేపట్టారనే విషయాలపై సదరు పీసీబీ అధికారులకు ఫోన్‌చేస్తే వారు స్పందించలేదు.

**కట్టడిలో అధికారులు విఫలం..**

గతంలో అర్ధరాత్రి వేళ వ్యర్థ రసాయనాలను పారబోయకుండా పీసీబీ టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసేది. కానీ సిబ్బంది కొరతతో టాస్క్‌ఫోర్స్ బృందాలు జిల్లాలో నామమాత్రంగా అక్కడక్కడా తిరుగుతున్నాయి. పీసీబీ అధికారులు స్పందించి ప్రజారోగ్యాలతో చెలగాటమాడుతున్న రసాయన పరిశ్రమ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**రవాణాకు అనుకూలంగా ఉండటంతోనే...**

చిట్యాల, చౌటుప్పల్ మండలాల్లోని పరిశ్రమలన్నీ జాతీయ రహదారి పక్కనే ఉన్నాయి. హైదరాబాద్ నగర శివార్లలోని రసాయన కంపెనీలను తొలగించేందుకు పదేళ్లక్రితం అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. పట్టణానికి 50 కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేసుకునే రసాయన పరిశ్రమలకు వివిధ రాయితీలు కల్పిస్తామని ప్రకటించింది. దీంతో హైదరాబాద్‌కు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న చౌటుప్పల్, వెలిమినేడు, పిట్టంపల్లి, గుండ్రాంపల్లి గ్రామాల శివార్లలో పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ప్రస్తుతం పరిశ్రమలు ఎలాంటి నిబంధనలు పాటించకపోవడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పరిశ్రమలను మూసివేయాలంటూ ఆందోళనలు, ధర్నాలు చేయాల్సిన పరిస్థితి వచ్చింది.

# అనాథలుగా కాటికి..!



నల్గొండ : ఆస్తులు ఉంటాయి.. అయినవాళ్లు ఉంటారు.. కారణం ఏమైనా కొందరు చివరి రోజుల్లో ఎవరూ లేని అనాథలుగా మారి జనరల్ ఆసుపత్రిలో దిక్కులేనివారిగా చనిపోతున్నారు. అందరూ ఉన్నా వారి వివరాలు చెప్పలేక, చెప్పడం ఇష్టం లేక అనాథలుగా మారి కాటికి వెళ్తున్నారు.. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల మరణ వార్త తెలిసినా కనీసం దహన సంస్కారాలు చేయడానికి కూడా ముందుకు రాని వారు జిల్లాలో పెద్ద సంఖ్యల్లో ఉంటున్నారు. ఏటా పదుల సంఖ్యల్లో మృతి చెందిన వారిని జనరల్ ఆసుపత్రి అధికారులు, సిబ్బంది సమాచారంతో అవుట్ పోస్టు పోలీసుల ఫిర్యాదుతో పురపాలిక వారు కాల్చేస్తున్నారు.

**ఈ ఏడాది 42 మంది..**

గత ఏడాది జనవరి మొదలుకొని నేటి వరకు జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన వారు 42 మంది ఉన్నట్లు పోలీస్ అవుట్ పోస్టు లెక్కలు చెబుతున్నాయి. పత్రికలు, పోలీస్ అధికారులు, ఆసుపత్రి వర్గాల ద్వారా సమాచారం తెలుసుకొని మృతదేహాలను తీసుకెళ్లిన వారు 28 మంది ఉన్నారు. మరో 14 మృతదేహాలను పురపాలిక సిబ్బంది ఖననం చేశారు.

**వదిలించుకుంటున్నారు..**

వృద్ధ వయసులో దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారిని జనరల్ ఆసుపత్రికి తీసుకొచ్చేవారిలో కొందరు ఎలాంటి వివరాలు నమోదు చేయకుండానే వార్డులో చేర్చి వెళ్లిపోతున్నారు. జనరల్ వార్డులో వృద్ధులను వదిలి వారికి సంబంధించిన ప్లేటు, దుస్తులు, ఇతర వస్తువులతో కూడిన సంచులను మంచానికి సమీపంలో పెట్టిపోతున్నారు. గమనించిన ఆసుపత్రి నర్సులు వారితో మాట్లాడి రోగానికి తగిన మందులు, సూదులు ఇస్తున్నారు.

కానీ వారికి సపర్యలు చేసేవారు లేక మలమూత్ర విసర్జనలు మంచంలోనే చేస్తుండడంతో ఇతర రోగులకు ఇబ్బంది తలెత్తుతుంది. అయినా వార్డుల్లో పనిచేసే నర్సులు సపర్యలు చేయాల్సి వస్తోంది. ప్రతి నెలలో ఇలాంటి వారే ముగ్గురి నుంచి నలుగురు మృతి చెందుతున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు. వృద్ధులను ఆసుపత్రిలో చేర్చేవారిలో మరికొందరు పేర్లు, చరవాణి సంఖ్య రాస్తున్నారు. మృతి చెందిన తరువాత తనిఖీ చేస్తే అందులో నిజాలు ఉండడం లేదు.

**సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే..**

జనరల్ ఆసుపత్రిలోని ప్రతి వార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే ఫలితం ఉంటుందని వైద్యాధికారులు చెబుతున్నారు. గుర్తు తెలియని వ్యక్తులను వదిలివెళ్తున్న జనరల్, మెడికల్ వార్డులతో పాటు ఓపీ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. పోలీస్‌అవుట్ పోస్టు సిబ్బంది ఇలాంటి వారిపై నిఘా పెంచితే గుర్తు తెలియని మృతదేహాల సంఖ్య తగ్గే అవకాశం ఉంటుంది.

# పరిశోధన.. రైతులకు బాసట



ములుగు : పంటల సాగులో రైతుల పంథా మారుతోంది. అధిక దిగుబడులను ఇచ్చే వంగడాలను ఎంపిక చేసుకుంటున్నారు. పలువురు మార్కెట్‌లో డిమాండ్ ఉండే వాణిజ్య పంటల వైపు దృష్టిసారిస్తున్నారు. ప్రభుత్వం సైతం ప్రోత్సహిస్తోంది. శాస్త్రవేత్తలతో పరిశోధనలు చేయించి వాటి సత్ఫలితాలను రైతులకు అందించే సంకల్పంతో ముందుకు సాగుతోంది. ఇందుకు వేదికగా మారింది ములుగులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఫ్రూట్స్ కేంద్రం.

ములుగులో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఫ్రూట్స్ (సీవోఈ) కేంద్రాన్ని 2016లో అప్పటి ప్రభుత్వం నెలకొల్పింది. కేంద్రంలో మామిడి, జామ, నిమ్మ, బత్తాయి, దానిమ్మ వంటి పలు రకాల పండ్ల మొక్కలు నాటి సంరక్షించారు. ఇక్కడి శాస్త్రవేత్తలు అంటుకట్టుడు పద్ధతిలో కొత్త మొక్కలు పెంచారు. ఇలా పెంచిన మొక్కలను నర్సరీలకు సరఫరా చేసి సంరక్షించేలా చర్యలు తీసుకున్నారు. ఆ తర్వాత వాటిని రైతులకు అందజేస్తున్నారు.

**30 లక్షల నారు మొక్కలు**

సీవోఈలో ఈ ఏడాది 30 లక్షల కూరగాయల నారు మొక్కలు పెంచుతున్నారు. టమాటా, మిరప, వంగ, క్యాబేజీ, కాలిఫ్లవర్, బ్రకోలి వంటి కూరగాయల నారు మొక్కలను ప్లగ్ ట్రైప్ నర్సరీలో పెంచుతున్నారు. అధునాతన నర్సరీలో పెంచిన కూరగాయల మొక్కలను సిద్దిపేట, మెదక్, వరంగల్, మహబూబాబాద్, యాదాద్రి-భువనగిరి, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, జనగాం జిల్లాల రైతులకు పంపిణీ చేస్తున్నారు. ఇవి కావాల్సిన రైతులు ఆయా జిల్లాల ఉద్యాన అధికారుల నుంచి ధ్రువీకరణపత్రాలు తీసుకొస్తే ఉచితంగా అందిస్తారు. ప్రస్తుతం టమాట, మిరప, వంగ, క్యాబేజీ రకాలు సిద్ధంగా ఉన్నాయి.

**మరిన్ని ఇలా..**

కేంద్రంలో 50 వేల శ్రీగంధంతో పాటు 45 వేల వెదురు మొక్కలు పెంచుతున్నారు.

ఎల్లప్పుడు డిమాండ్ ఉండే జామ, నిమ్మ తోటల సాగును సైతం చేపట్టారు. నర్సరీలో జామ 10 వేలు, నిమ్మ 6 మొక్కలను పెంచుతున్నారు. జామలో అలహాబాద్ సఫెరా, లక్నో 49 రకం మొక్కలను సంరక్షిస్తున్నారు. బొప్పాయి, అలంకార పూలను పెంచుతున్నారు.

ప్రణాళికలు సిద్ధం: శ్రీధర్, సీవోఈ ఏడీహెచ్

ప్రభుత్వ ఆదేశాలతో రైతులకు వివిధ మొక్కలు అందించడంపై ప్రణాళికలు రూపొందించాం. వెదురు, అలంకార పూలనూ పెంచుతున్నాం. మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ, బత్తాయి మొక్కలు, కూరగాయలనారు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి.

20 రకాల మామిడి

రాష్ట్రంలో మామిడి తోటల పెంపకానికి రాయితీలు అందిస్తూ ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందుకు అనుగుణంగా ములుగు సీవోఈలో 20 రకాలను పెంచుతున్నారు. ఆయా రాష్ట్రాల్లో డిమాండ్ ఎక్కువ ఉండే వాటిని తీసుకొచ్చి నాటారు. ఏటా 40 వేల మామిడి మొక్కలను నర్సరీలో పెంచి సిద్ధం చేస్తున్నారు. వివిధ రకాలు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలోని ఏ ప్రాంతం వారైనా ఇక్కడికి వచ్చి నేరుగా తీసుకెళ్లే అవకాశం కల్పించారు.

# వయోజనులకు దక్కని ప్రయోజనం

పెద్దశంకరంపేట : చదువురాని వయోజనులకు అక్షరాస్యత అందించడానికి ప్రభుత్వ ప్రోత్సాహం కరవైంది. గతంలో వయోజన విద్య, సాక్షర భారత్ కార్యక్రమాలను అమలు చేసిన ప్రభుత్వం.. పదేళ్లుగా ఈ విద్య గురించి పట్టించుకోవడం లేదు. దీంతో వయోజనులకు అక్షరాస్యత అందకుండా పోతోంది. 'నవభారత సాక్షరత' పేరుతో వయోజన విద్య అమలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఇందుకు సంబంధించిన విధివిధానాలు, కార్యాచరణ రూపకల్పన లేకపోవడంతో అడుగు పడటం లేదు.

**జీవన నైపుణ్యాలపై..**

మెదక్ జిల్లాలో 2011 గణాంకాల ప్రకారం 56.12 అక్షరాస్యత ఉంది. 2022-27 మధ్య ఈ కార్యక్రమాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం ఆమోదం తెలపడంతో ఈ ఏడాది నుంచే అమల్లోకి రానుంది. ప్రజలకు అవసరమైన జీవన నైపుణ్యాలను నేర్పించనున్నారు.



15 ఏళ్లు పైబడిన నిరక్షరాస్యులకు ఈ పథకాన్ని వర్తింపజేయాలని నిర్ణయించారు. చరవాణి వినియోగం, ఆన్‌లైన్ లావాదేవీలు పెరగడంతో డిజిటల్ అక్షరాస్యతతో పాటు ఆర్థిక, వ్యాపార నైపుణ్యాలు, ఆరోగ్య అవగాహన, పిల్లల సంరక్షణ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేలా వృత్తి విద్య శిక్షణ కూడా కల్పించాలని నిర్ణయించారు. ఇందులో కోసం అన్ని రకాల పరికరాలు, వనరులను సమకూర్చనున్నారు. ఈ పథకానికి కేంద్రం 70శాతం, రాష్ట్రం 30శాతం నిధులు కేటాయిస్తుంది.

**వెలువడని విధివిధానాలు ....**

పథకం అమలుకు ప్రతి గ్రామంలో పాఠశాలను యూనిట్‌గా తీసుకొని గ్రామంలో ఎంత మంది నిరక్షరాస్యులు ఉన్నారో ఉపాధ్యాయుల నుంచి సమాచారం తీసుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి తదుపరి మార్గదర్శకాలు వెలువడకపోవడంతో అడుగు ముందుకుపడటం లేదు. నిధుల కేటాయింపు, విధి విధానాలను వెల్లడించకపోవడంతో నీలినీడలు కమ్ముకున్నాయి.

**మార్గదర్శకాలు వస్తేనే**

నవభారత సాక్షరత కార్యక్రమానికి సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు ఇంకా రాలేదు. నిధుల కేటాయింపు, విధి విధానాలకు సంబంధించిన ఉత్తర్వులు వస్తే కార్యక్రమం అమలుచేయడం జరుగుతుంది. రామేశ్వర్ వయోజన విద్య సమన్వయకర్త

# ఈ పనులు మాకొద్దు!

సంగారెడ్డి : ప్రజల అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం రహదారులు, భవనాలు, తదితర రకాల పనులు పూర్తి చేసేందుకు రూ.కోట్లలో నిధులు మంజూరు చేస్తోంది. ఆయా పనులకు టెండర్లు పిలిచినా గుత్తేదారులు మాత్రం ఆసక్తి చూపడం లేదు. దీంతో అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతోంది. కొన్ని చోట్ల బిల్లులు రాకపోవడంతో నెమ్మదిగా సాగుతున్నాయి. దీంతో ప్రజలకు రవాణా పరంగా కష్టాలు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఆర్ అండ్ బీ శాఖలో కీలక పనుల ప్రగతి తీరు తెన్నులపై పరిశీలన కథనం.

**జిల్లాలో ఎక్కడెక్కడంటే..:** నారాయణఖేడ్ నుంచి కల్హేర్ మండలం సుల్తానాబాద్ వరకు 11 కి.మీ. రహదారి బలోపేతానికి రూ.2.13 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆర్ అండ్‌బీ అధికారులు ఇప్పటివరకు 14 సార్లు టెండర్లు పిలిచినా స్పందన లేదు.

కల్హేర్ మండలం బాచేపల్లి నుంచి అలిఖాన్‌పల్లి వరకు. 8 కి.మీ. రోడ్డును బాగు చేసేందుకు రూ.1.30 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఎనిమిది సార్లు టెండర్లు పిలిచినా గుత్తేదారుల నుంచి స్పందన లేదు. కల్హేర్ మీదుగా కామారెడ్డి జిల్లా పిట్లం సరిహద్దు వరకు 2 కి.మీ. ఉంది. ఈ దారి మరమ్మతులకు రూ.76 లక్షలు కేటాయించారు. పనులు చేసేందుకు ఏడు సార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదు. అత్యధికంగా ఖేడ్ నియోజకవర్గంలో చాలా వరకు అర్ధాంతరంగా నిలిచిపోవడం గమనార్హం.

సదాశివపేట మండలం పెద్దాపూర్ నుంచి కొండాపూర్ మండలం అనంతసాగర్‌కు 10 కి.మీ. దారికి రూ.3.67 కోట్లు కేటాయించినా



ముందుకు సాగడం లేదు.

సదాశివపేట మండలం తంగెడుపల్లి నుంచి మల్లారెడ్డిపేట వరకు 9 కి.మీ. రహదారిని రెండు వరుసలుగా విస్తరించేందుకు రూ.15 కోట్లు విడుదలయ్యాయి. ఈ మేరకు గతేడాది నవంబరు 9న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదే రోజు కొండాపూర్ మండలం మల్లేపల్లి నుంచి కొండాపూర్ వయా తేర్పోల్, హరిదాస్‌పూర్ వరకు రెండు వరుసలుగా చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 7 కి.మీ. మేర రహదారి విస్తరణకు రూ.15 కోట్లు మంజూరు చేసింది. ఈ రెండు రోడ్లకు పలుమార్లు ఆర్ అండ్ బీ అధికారులు టెండర్లు పిలిచినా గుత్తేదారులు ఎవరూ ఆసక్తి చూపలేదు.

**త్వరలో పూర్తి చేసేలా చర్యలు: రాంబాబు, ఆర్ అండ్ బీ ఈఈ**

త్వరలోనే పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం. ప్రధానరగా రహదారుల పనులు చేసేందుకు గుత్తేదారులు ఆసక్తి చూపడం లేదు. 2021 నుంచి ఇదే పరిస్థితి ఎదురవుతోంది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం. బిల్లుల సమస్య లేదు.

చురకలు



# 'రేస్'లో నిలబెట్టింది..

విశాఖపట్నం : ఆటోమొబైల్ రంగంలో వస్తున్న ఆధునికతను అందిపుచ్చుకొని ఇంజినీరింగ్ విద్యార్థులు తయారు చేసిన రేసింగ్ వాహనం వారికి పలు అవార్డులు తెచ్చిపెడుతోంది. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విద్యార్థులు ఓ బృందంగా ఏర్పడి దీనిని తయారు చేశారు. దీని సామర్థ్యం మరింత పెంచేందుకు విద్యార్థులు కృషిచేస్తున్నారు.

**గో-కార్టు అంటే.... :** గో-కార్టు అంటే చిన్న చక్రాలు కలిగిన వాహనం. ఇది రేసింగ్‌ల కోసం ఉపయోగిస్తారు. టీవీఎస్ అపాచీ 160 సీసీ 2వీ ఇంజిన్ ఉపయోగించి దీనిని విద్యార్థులు రూపొందించారు. పెట్రోలు సాయంతో నడుస్తుంది. మోటారు స్పోర్ట్స్‌లో సత్తా చాటాలనే ఉద్దేశంతో దీనిని తయారు చేశారు. అనుకున్నట్లే రేసింగ్‌లో సత్తా చాటుతోంది.

**టీం రుద్ర..:** గోకార్టును తయారు చేయడానికి 35 మంది విద్యార్థులు ఒక బృందంగా ఏర్పడ్డారు. టీం-రుద్ర పేరుతో ఈ బృందం పనిచేసింది. 2022 డిసెంబరులో దీని తయారీని మొదలుపెట్టారు. ఆటోమొబైల్ రంగంలో వస్తున్న మార్పులను ఒడిసిపట్టి దీనిని తయారు చేశారు. తొలిసారిగా టీవీఎస్ అపాచీ 160 సీసీ 2వీ ఇంజిన్ దీనికి ఉపయోగించారు.

**సవాళ్లు కూడా ఎదురయ్యాయి**



ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో జరిగిన బుద్ధ ఇంటర్నేషనల్ సర్క్యూట్ సీజన్‌లో గోకార్టు వాహనంతో విద్యార్థులు పాల్గొన్నారు. అయితే ఈ వాహనం పరిమాణంలో పెద్దదిగా ఉందని విమర్శలు వచ్చాయి. ఆశించిన స్థాయిలో వేగం అందుకోలేకపోయింది. అవార్డు సాధించినా వాహనం ఆధునికత అవసరమని గుర్తించారు. దీంతో యమహా ఆర్15 వీ3 ఇంజిన్‌ను మార్చారు. దీనివల్ల వాహనం బరువు తగ్గి వేగం పెరిగింది.

**సాధించిన అవార్డులు ఇవీ...**

2023 అక్టోబరులో ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో జరిగిన ఇండియన్ కార్టింగ్ రేసులో వివిధ విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన 50 బృందాలతో పోటీపడి ఫ్యూచర్ అవార్డు దక్కించుకుంది.

2024 అక్టోబర్‌లో మళ్లీ నోయిడాలో జరిగిన ఐఎస్ఐఈ ఐకేఆర్ సీజన్-9 బుద్ధ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో ప్రతిభ కనబరచి ఫ్యూచర్ అవార్డుతో పాటు పీపుల్స్ ఛాయిస్ అవార్డు కైవసం చేసుకున్నారు.

2025 జనవరిలో భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో జరిగిన జాతీయ స్థాయి గో-కార్ట్ ఛాంపియన్‌షిప్ పోటీలో ఉత్తమ డిజైన్ అవార్డు దక్కించుకున్నారు. అలాగే యాక్సిలరేషన్ టెస్ట్‌లో రన్నరప్‌గా, బెస్ట్ బిజినెస్ ప్లాన్‌లో రన్నరప్‌గా నిలిచారు.

# హామీ పత్రం.. ఊరట ఏ మాత్రం..?

తుని: కుటుంబ, వ్యవసాయ, విద్యా అవసరాల కోసం బ్యాంకులో కుదువ పెట్టిన సొత్తు గల్లంతయ్యిందని తెలిసి ఖాతాదారులు ఆ బ్యాంకు వద్ద పడిగాపులు కాస్తున్నారు. బ్యాంకు అధికారులు మాత్రం తాఫీగా 'నెల రోజుల వ్యవధితో తమ బంగారాన్ని ఇస్తామని లేదా విలువ కట్టి ఆ ప్రకారం నగదును చెల్లిస్తామంటూ' రాతపూర్వక హామీపత్రం అందజేస్తున్నారు. వారు ఇచ్చే పత్రంపై బ్యాంకు ముద్ర తప్ప ఏ అధికారి సంతకం లేకపోవడం కేవలం బ్యాంకు మేనేజర్ ఫోన్ నంబరు రాసి ఇవ్వడంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సుమారు వంద మందికిపైగా ఖాతాదారులు తాము కుదువ పెట్టిన సొత్తుపై ఆరా తీసేందుకు బ్యాంకుకు వచ్చారు. వారికి నంబరు చీటీలు ఇచ్చి వేచిఉండాలని సూచించి లోపలకి అనుమతించకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంపై బ్యాంకు ఇన్‌చార్జి మేనేజర్‌ను వివరణ కోరగా.. బ్యాంకులో సుమారు 3,500ల కు పైగా బంగారం తాకట్టు ఖాతాలు ఉన్నాయని వాటిలో సుమారు 150 మందికి సంబంధించిన తాకట్టుపెట్టిన సొత్తు తారుమారు అయినట్లు గుర్తించామన్నారు. గతంలో బ్యాంకు సిబ్బంది ఖాతాదారులకు సంబంధించిన బంగారంలో కొన్ని వస్తువులను తీసేసి ఇదే బ్యాంకులో కొంత, రాజమహేంద్రవరం రూరల్‌లోని ఒక ప్రైవేటు బ్యాంకులో కొంత మొత్తం కుదువ పెట్టినట్లు గుర్తించామన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ కొనసాగుతుందని చెప్పడం గమనార్హం.

# తెలుసుకుందాం..అంతరిక్ష విజ్ఞానం

పార్వతీపురం : మీరు తొమ్మిదో తరగతి చదువుతున్నారా.. అంతరిక్ష పరిజ్ఞానం గురించి తెలుసుకోవాలని.. ఉపగ్రహాల ప్రయోగాలు చూడాలని.. శాస్త్రవేత్తలతో మాట్లాడాలని మీలో ఉత్సుకత ఉందా. మీలాంటి వారి కోసమే ఇస్రో ఏటా యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా) నిర్వహిస్తోంది. ఇంకెందుకు ఆలస్యం.. వెంటనే దరఖాస్తు చేసి ఇస్రో స్పేస్ సెంటర్లతో పాటు మరిన్ని కార్యాలయాలు సందర్శించి, విజ్ఞానాన్ని పెంపొందించుకోండి.

**విద్యార్థులను భాగం చేసేందుకు..**

అంతరిక్ష పరిశోధనల్లో దేశం కొత్తపుంతలు తొక్కుతూ అగ్రరాజ్యాల సరసన నిలబడింది. ఈ విజ్ఞానాన్ని విద్యార్థుల్లోకి తీసుకువెళ్లి స్ఫూర్తి నింపాలన్నదే యువికా లక్ష్యం. ఏటా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో విజ్ఞాన ప్రదర్శనలు నిర్వహిస్తారు. వీటిలో చాలా మంది విద్యార్థులు ప్రతిభ చూపుతున్నారు. ఇలాంటి ప్రతిభావంతులను యువికాలో భాగం చేస్తే మరిన్ని ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుందని ఇస్రో భావన. ఈ నేపథ్యంలో కార్యక్రమం ప్రారంభించింది.

**వీటిని చూడొచ్చు..** ఎంపికైన వారిని మేలో 14 రోజుల పాటు ఇస్రోకు చెందిన స్పేస్ సెంటర్లకు తీసుకెళ్తారు. అక్కడ వివిధ అంశాలపై శిక్షణ ఇస్తారు. శాస్త్రవేత్తలతో విద్యార్థులు ముఖాముఖి మాట్లాడొచ్చు. అంతరిక్షంలో సాధిస్తున్న ప్రగతి సవాళ్లు, శాస్త్రవేత్తలు కావాలంటే ఏం చేయాలి, ప్రయోగశాలల సందర్శన, నిపుణులతో చర్చాగోష్ఠి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.

**మార్చి 23 వరకు అవకాశం..**

%www.isro.gov.in% లో ఈనెల 24 నుంచి వచ్చే నెల 23 మధ్య పూర్తి వివరాలతో దరఖాస్తు చేయాలి. దీనిపై ఇప్పటికే అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సమాచారం అందజేశామని డీఈవో ఎన్.తిరుపతినాయుడు తెలియజేశారు. **అర్హులు.. ప్రాధాన్యం..** యువికాలో ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేయొచ్చు. ఎనిమిదో తరగతిలో సాధించిన మార్కులను ఆధారంగా తీసుకొని 50 శాతం వెయిటేజీ ఇస్తారు. స్పేస్, సైన్సు క్లబ్‌లో ఉంటే 5 శాతం, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వ్యాస రచన, వక్తృత్వ పోటీలో ప్రతిభ చూపితే 10 శాతం, క్రీడల్లో సత్తా చాటితే 10 శాతం, ఎన్‌సీసీ, స్కౌట్ అండ్ గైడ్స్ విభాగాల్లో ఉంటే 5 శాతం, పల్లె ప్రాంతాలకు చెందిన వారికి 20 శాతం ప్రాధాన్యం ఇస్తారు.

# మిరప రాసులు వెలవెల



కర్నూలు : ఎండు మిరప ఏడిపిస్తోంది.. ధరలు 'నేల'వాలాయి.. నష్టాల ఘాటుకు అన్నదాతలు 'వెల'విలలాడుతున్నారు. మిరప రైతుల కష్టాలను 'కూటమి' ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది.. స్పందించిన కేంద్రం ఎంపిక చేసిన మార్కెట్ యార్డుల్లో మిరప అమ్ముకునే రైతులకు 'మార్కెట్ జోక్య పథకం' కింద వ్యత్యాస ధర చెల్లిస్తామని ప్రకటించింది. క్వింటా ధర రూ.11,781.25 చొప్పున నిర్ణయించింది. ఆ ధర కంటే 25 శాతం తక్కువకు అమ్ముకున్న రైతులకే ఈ పథకం వర్తించనుంది. రైతు విపణిలో రూ.10 వేలకు అమ్ముకుంటే అదనంగా రూ.1,781 చెల్లిస్తారు. సాగులో రాష్ట్రంలో రెండు, మూడో స్థానాల్లో ఉన్న కర్నూలును పథకం కింద ఎంపిక చేయాలని అన్నదాతలు విన్నవిస్తున్నారు.

**లెక్కలు సేకరిస్తున్న ఉద్యానశాఖ**

కర్నూలు జిల్లాలో 2024 ఖరీఫ్‌లో 38,190 హెక్టార్లలో మిర్చి సాగైంది. ఎకరాకు 10 క్వింటాళ్ల చొప్పున హెక్టారుకు 2.50 టన్నుల లెక్కన 97,503.372 టన్నుల దిగుబడి వచ్చింది. నంద్యాల జిల్లాలో 8,710 హెక్టార్లలో మిర్చి సాగవగా.. 22,210 టన్నుల దిగుబడులు వచ్చినట్లు ఉద్యాన శాఖ అధికారులు అంచనా వేశారు. కానీ ఎకరాకు ఆరేడు క్వింటాళ్ల దిగుబడులు కూడా రాలేదని.. హెక్టారుకు 1.50 టన్నుల దిగుబడి మాత్రమే వచ్చిందని అన్నదాతలు అంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో 1.19 లక్షల టన్నుల దిగుబడులు వచ్చినట్లు అధికారులు చెబుతుండగా.. వాస్తవానికి 70-80 వేల టన్నుల మేర వచ్చింది. క్వింటా ధర రూ.10 వేలు దాటడం లేదు.

**మధ్యస్థ ధర అంతంతే**

గతేడాది డిసెంబరులో మిర్చి క్వింటా గరిష్ఠ ధర రూ.16,300 ఉండగా ఈ ఏడాది జనవరికి రూ.13,380కు పడిపోయింది.. ఫిబ్రవరిలో రూ.13 వేల నుంచి రూ.14 వేల మధ్య ధర ఉంది. గతేడాది డిసెంబరు నుంచి ఇప్పటివరకు క్వింటా మధ్యస్థ ధర రూ.9-10 వేల లోపే ఉంది.

కర్నూలు మార్కెట్‌కు 580 క్వింటాళ్ల ఎండుమిర్చి దిగుబడులు వచ్చాయి. బ్యాడిగ రకం గరిష్ఠ ధర క్వింటా రూ.14,209, తేజ రకం రూ.12,820, సూపర్-10 రకం 11,341 పలికింది. తేజ రకం మధ్యస్థ ధర రూ.12,600, బ్యాడిగ రకాలు రూ.11,231 మినహా మిగిలిన అన్ని రకాలు క్వింటా రూ.6,511 నుంచి రూ.8,231 పలికింది.

రూ.50 వేలకు పైగా అప్పు మిగిలింది గోవిందు, కడిమెట్ల, ఎమ్మిగనూరు ఎకరన్నర పొలంలో రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టి మిర్చి సాగు చేశా. నెల రోజుల కిందట క్వింటా రూ.11,800 చొప్పున ఏడు క్వింటాళ్లను ఇదే మార్కెట్‌లో అమ్మా. ప్రస్తుతం ఏడు బస్తాల ఎండు మిర్చిని అమ్మకానికి తెచ్చా. వ్యాపారులు క్వింటా రూ.9,600కు రాశారు. తెగుళ్ల కారణంగా దిగుబడులు పూర్తిగా పడిపోయాయి. ప్రస్తుతం రూ.50 వేలకు పైగా అప్పే మిగిలింది. ప్రభుత్వం స్పందించి మిర్చి రైతులను ఆదుకోవాలి.

# చెత్త లేదని.. చేతులెత్తేశారు



ఆదోని : ఆదోని పట్టణ శివారులో ఏర్పాటు చేసిన బయోగ్యాస్ ప్లాంట్ ఉత్పత్తి ఏడాదిన్నరగా నిలిచిపోయింది. 2014-19 మధ్య తెదేపా హయాంలో మహీంద్ర వేస్ట్ ఎనర్జీ సొల్యూషన్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శివారులోని జాతీయ రహదారి-167 పక్కన పదెకరాల స్థలంలో రూ.10 కోట్లతో ప్లాంట్ నిర్మించారు. 2018లో నిర్మాణం ప్రారంభించగా, 2020లో సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం బ్లూ ప్లానెట్ ఇంటిగ్రేటెడ్ వేస్ట్ సొల్యూషన్స్ లిమిటెడ్ నిర్వహిస్తోంది. పురపాలిక నుంచి పూర్తి స్థాయిలో తడి చెత్త సరఫరా కాకపోవడంతో ఏడాది కాలంగా ప్లాంట్‌లో గ్యాస్ ఉత్పత్తి సేవలు నిలిచిపోయాయి.

**రూ.కోట్ల విలువైన యంత్రాలకు తుప్పు**

గ్యాస్ ఉత్పత్తి నిలిచిపోవడంతో ఏర్పాటు చేసిన యంత్రాలు తుప్పు పడుతున్నాయి. యంత్రాల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. ప్రస్తుతం సేకరిస్తున్న తడి చెత్తను ఆరబెట్టి యంత్రంలో వేసి ఎరువు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారు. దీనివల్ల రూ.కోట్లు విలువ చేసే సామగ్రి పాడైపోయే ప్రమాదముంది. ఆరంభం నుంచి తడి చెత్త సేకరణలో ఇబ్బందులు తప్పడం లేదు. ఎమ్మిగనూరు పురపాలక నుంచి తడి చెత్తను ప్లాంట్‌కు చేర్చే దిశగా కూడా యోచించారు. ప్రస్తుతం అది కూడా అమలుకు నోచుకోవడం లేదు.

**స్పందించని పుర అధికారులు**

పరిశ్రమ నిర్వహణకు రోజువారీగా 20 టన్నుల తడి చెత్త అవసరం కాగా.. 5-6 టన్నులకుమించి సేకరణ కావడం లేదు. పట్టణంలో రోజువారీగా 70-80 టన్నుల చెత్త పోగవుతోంది. ఇళ్ల నుంచే తడి, పొడి చెత్త సేకరణకు ఉచితంగా బుట్టలు అందించారు. లక్ష్యం నెరవేరడం లేదు.


చెత్త సేకరణ విభాగంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ప్లాంట్‌కు పూర్తి స్థాయిలో తడి చెత్త రాకపోవడంతో గ్యాస్ ఉత్పత్తి ఆగిపోయింది. నిత్యం 20 టన్నుల తడి చెత్త అందిస్తామని ప్రారంభంలో పురపాలక అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీనిపై ప్లాంటు నిర్వాహకులు పలుమార్లు లిఖితపూర్వకంగా లేఖలు రాసినా ఎలాంటి స్పందన లేదని వారు చెబుతున్నారు.

**లక్ష్యం కుళ్లిపోయింది**

ఆదోని పట్టణంలో పోగయ్యే కుళ్లిన పండ్లు, పూలు, కూరగాయలు, మాంసం వ్యర్థాలు, హోటళ్లు, రెస్టారెంట్ల నుంచి ఆహార వ్యర్థాలు, పశువుల పేడ, జంతు కళేబరాలు.. ఇలాంటివి తడి చెత్త కిందకు వస్తాయి.

20 టన్నుల చెత్త పోగైతే అందులో నుంచి 600-700 కిలోల వంట గ్యాస్ ఉత్పత్తి అవుతుంది. దీన్ని వాణిజ్య అవసరాలకు అందిస్తారు. సేంద్రియ ఎరువు తయారు చేసి మార్కెట్లో కిలో రూ.7 చొప్పున విక్రయిస్తారు. ఒక్క టన్ను తడి చెత్త నుంచి సుమారు 30 కిలోల గ్యాస్ ఉత్పత్తి అవుతుంది. ఇప్పటి వరకు పది వేల కిలోలకుపైగా గ్యాస్‌ను ఉత్పత్తి చేశారు.

# ఆగిన నీరు.. ఆరిన తడి



ఆళ్లగడ్డ : కర్నూలు-కడప (కేసీ) కాల్వ ఒట్టిపోయింది.. నీరు అందక చి'వరి' ఆయకట్టుకు కటకట నెలకొంది. పచ్చని భూములు బీళ్లుగా మారుతున్నాయి. సుంకేసుల జలాశయం నుంచి ప్రారంభమయ్యే కేసీ కాల్వ వైఎస్సార్ జిల్లా కృష్ణాపురం వరకు 304 కి.మీ. పొడవునా ప్రవహిస్తుంది. తుంగభద్ర, కృష్ణా జలాలను కలిపి 31.90 టీఎంసీలు కాల్వకు విడుదల చేయాల్సి ఉంటుంది. ఆ నీటితో 2,65,628 ఎకరాల ఆయకట్టుకు నీరందించాలి. చివరి ఆయకట్టు ప్రాంతమైన ఆళ్లగడ్డ నియోజకవర్గానికి నీరు సరిగా అందడం లేదు. " ఆరెకరాల్లో కంది వేశా.. ప్రస్తుతం ఒక తడి ఇవ్వాల్సి ఉంది. బోరు లేదు.. కేసీ నీరే ఆధారం.. కాల్వలో నీటి ప్రవాహం తగ్గింది ఏం చేయాలో అర్థం కావడం లేదని" ఆర్.పాంపల్లెకు చెందిన డి.బాషా ఆవేదన వ్యక్తం చేశారు.

**ఎండుతున్న పంటలు** వరి, కంది, మినుము, జొన్న, మొక్కజొన్న పంటలు చేతికందే దశలో ఉన్నాయి. చివరి దశలో చేనుకు నీరు ఇవ్వకుంటే దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దొర్నిపాడు మండలంలో 213 హెక్టార్లలో వరి సాగు చేశారు. కాల్వలో నీటి ప్రవాహం తగ్గడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. కనీసం మార్చి నెలాఖరు వరకైనా తడులు అందించాలని అన్నదాతలు విన్నవిస్తున్నారు. " మార్చి చివరి ఆఖరు వరకు కేసీ కాల్వలో నీరు వస్తేనే వరి చేతికొస్తుంది.. లేదంటే వేల రూపాయాలు నష్టపోవాల్సిందే.. అధికారులు స్పందించి రైతులను ఆదుకోవాలని" దొర్నిపాడుకు చెందిన శ్రీను విన్నవించారు. **తగ్గిన ప్రవాహం**

ఆళ్లగడ్డ పరిధిలోని చివరి ఆయకట్టుకు (27వ లాక్) కేసీ నీరు చేరాలంటే 16వ లాక్ వద్ద కనీసం 5.5 అడుగుల మేర నీటి ప్రవాహం ఉండాలి. కోటపాడు వద్ద 16వ లాక్ వద్ద 4.5 అడుగుల మేర నీటి ప్రవాహం ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సోమవారం రాత్రి కేసీ అధికారులు ప్రకటించారు. కానీ ఎగువ నుంచి నీటి ప్రవాహం నిర్దేశించిన స్థాయిలో రావడం లేదు. 23వ లాక్ నుంచి దిగువకు నీటి ప్రవాహం ఆశించినంత రాలేదని రైతులు పేర్కొన్నారు. 25వ లాక్ నుంచి 27వ లాక్ వరకు ప్రవాహం పూర్తిగా నిలిచింది. " ఫిబ్రవరి నెలాఖరు వరకు కేసీకి నీరు విడుదల చేస్తాం. ఈ విషయం కేసీ కాల్వ కింద సాగు చేసిన రైతులు గమనించాలని" డీఈ రవీంద్ర పేర్కొన్నారు.

# ఘాట్ల వీక్షణ..

# పుష్కరాలకు కార్యాచరణ

రాజమహేంద్రవరం : రానున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకొని యంత్రాంగం ట్రయల్ రన్ నిర్వహించనుంది. బుధవారం (ఈ నెల 26న) శివరాత్రికి వచ్చే భక్తులు, ఘాట్ల వద్ద రద్దీ, మార్గాలను నిశితంగా అధ్యయనం చేయనున్నారు. ఇందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పరిస్థితులను అంచనా వేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

శివరాత్రికి రాజమహేంద్రవరంలోని ఘాట్లలో స్నానాలు చేసేందుకు 5 లక్షల మంది వరకు వస్తారని.. తెల్లవారుజామున 3 నుంచి ఉదయం 7 గంటల వరకూ రద్దీ ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఘాట్లకు భక్తులు వచ్చే మార్గాలను డ్రోన్లతో వీడియో చిత్రీకరించనున్నారు. రద్దీని అంచనా వేసేందుకు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్‌తోపాటు అదనంగా పుష్కరఘాట్, కోటిలింగాల ఘాట్ వద్ద



రెండు కమాండ్ కంట్రోల్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. శివరాత్రి స్నానాల కోసం గోదావరి తీరాన్ని ఆనుకొని 11 ఘాట్లను కేటాయించారు. వీటిలో ముఖ్యంగా ఏడింటిని యంత్రాంగం ఆధీనంలోకి తీసుకొంది. ఇక్కడకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చేందుకు ఆస్కారం ఉందని గుర్తించారు. కొన్ని ఘాట్ల వద్ద గత పుష్కరాలకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కూడా అందుబాటులో ఉండడంతో వాటిని వాడుకలోకి తీసుకున్నారు. గత పుష్కరాలకు నగరంలో 170 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా, వాటిలో కొన్ని పాడైపోయాయి. ప్రస్తుతం నగరపాలక సంస్థ ఆధీనంలో 140 సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయి. ప్రధాన ప్రాంతాలు, రహదారులు, కూడళ్లలో ఇవి పనిచేస్తున్నాయి. అవన్నీ మున్సిపల్ కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానంగా ఉన్నాయి. వాటి ద్వారా చాలావరకు ఎక్కడెక్కడ సమస్యలు ఏర్పడుతున్నాయనేది తెలిసే అవకాశం ఉంది.

# సంచార పశువైద్యం ప్రశ్నార్థకం!

బొబ్బిలి : గ్రామీణ ప్రాంతాల్లో అనారోగ్యానికి గురైన పాడి పశువుల చెంతకే వెళ్లి వైద్యం అందించేందుకు గత ప్రభుత్వంలో తీసుకొచ్చిన సంచార పశు వైద్యం అంబులెన్సు వాహనాలు ఆగాయి. వీటి నిర్వహణను అప్పట్లో ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించింది. ఈనెల 15వ తేదీతో వాటి కాలవ్యవధి పూర్తయింది. దీంతో పశుసంవర్ధకశాఖ ఏడీ కార్యాలయాల వద్ద వాహనాలను ఉంచేశారు. అవి నేడు ఎండకు ఎండుతూ వృథాగా పడి ఉన్నాయి. సేవల్ని పునరుద్ధరించాలని పశుపోషకులు కోరుతున్నారు. విజయనగరం జిల్లాకు 2021-22 ఆర్థిక సంవత్సరంలో తొలి విడతలో విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి, గజపతినగరం, రాజాం, ఎస్.కోట, నెల్లిమర్ల నియోజకవర్గాలకు ఏడు అంబులెన్సులు అందజేశారు. ఇందులో వైద్యులు, టెక్నీషియన్, ఫార్మసిస్టులు ఉండేవారు. ఒక వాహనంలో డ్రైవర్‌తో సహా నలుగురు పనిచేసేవారు. వీటి నిర్వహణ జీవీకే ఫౌండేషన్‌కు అప్పగించారు. పది రోజుల క్రితం కాలవ్యవధి పూర్తికావడంతో నియోజకవర్గ కేంద్రాల్లోని ఏడీ కార్యాలయాల్లో నిలిపేశారు. టోల్ ఫ్రీ నంబరు 1962కు ఫోన్ చేయగానే వాహనం చేరేది. రైతులు అలవాటు పడుతున్న సమయంలో సేవలకు అంతరాయం ఏర్పడింది. ఇవికాకుండా రెండో విడతలో మరో ఆరు అంబులెన్సులు ఇచ్చారు. ఎస్.కోట మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాలకు ఇవి అందాయి.



వీటి సేవలు ప్రస్తుతం కొనసాగుతున్నాయి కానీ.. వస్తున్న ఫోన్ కాల్స్‌కు సరిపోవడం లేదు. దీంతో మారుమూల ప్రాంతాల్లోని పాడి రైతులు అవస్థలు పడుతున్నారు.

**డీడీ లేక అవస్థలు**

పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని మండలాలతోపాటు విజయనగరం జిల్లా బొబ్బిలి డివిజన్‌లో పశు వైద్య సేవల తీరును బొబ్బిలిలోని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ పర్యవేక్షించాలి. అంబులెన్సుల నిర్వహణ, మందుల సర్దుబాటును డీడీ పర్యవేక్షించాలి. కానీ డీడీ పోస్టు రెండు నెలలుగా ఖాళీగా ఉంది. గతంలో ఇక్కడ పనిచేసిన నీలయ్య పదోన్నతిపై విశాఖ వెళ్లిపోయారు. ఆపై శ్రీకాకుళం డీడీకి బాధ్యతలు అప్పగించారు. ఆయన కూడా జేడీగా పదోన్నతిపై వెళ్లిపోయారు. అధికారి లేకపోవడంతో సేవలు మందగిస్తున్నాయి.

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం**

పశు అంబులెన్సులు నిలిచిపోయిన విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. కొత్త ఏజెన్సీ రావాల్సి ఉంది. ఏడు వాహనాలు ఆగాయి. టోల్ ఫ్రీకి ఫోన్లు వస్తే సర్దుబాటు చేస్తున్నాం. బొబ్బిలి డీడీ బాధ్యతలు తాత్కాలికంగా ఏడీకి అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.- రమణ, పశుసంవర్ధకశాఖ జేడీ

# రూ.1.57 కోట్లతో వేసవి కార్యాచరణ

భీమవరం : వేసవి ఎండలు ముదరక ముందే జిల్లాలో పలు ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు మొదలయ్యాయి. నడి వేసవిలో అయితే శివార్లతో పాటు ప్రధాన ప్రాంతాల్లోనూ తాగునీటి ఇక్కట్లు తప్పవు. వాటిని అధిగమించేలా ఈ ఏడాది ముందస్తుగా రూ. 1.57 కోట్లతో ప్రత్యేక కార్యాచరణను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాలతో యంత్రాంగం అప్రమత్తమైంది. భీమవరం పట్టణంలో దాదాపు 15 ప్రాంతాలకు ట్యాంకరు నీరే ఆధారం. కొన్ని కాలనీలకు రెండుమూడు రోజులకోసారి ట్యాంకరు వెళ్తుంది. దీంతో చాలా ప్రాంతాల్లో రహదారులకు పక్కనే డబ్బాలు ఉంచుతారు. ట్యాంకరు రాగానే వాటిలో నీటిని నింపుకొని పొదుపుగా వాడుకుంటారు. ఇలాంటి పరిస్థితులు జిల్లాలో దాదాపు 40 ప్రాంతాల్లో ఉన్నాయి. ఏర్పాట్లు ఇలా పట్టణాల్లో వేసవి వేళ 40 నుంచి 60 రోజుల పాటు తాగునీటి సరఫరాకు ప్రణాళిక రూపొందించారు. నరసాపురం ప్రధాన కాలువలో అడ్డుకట్ట వేసి కొంత మేర నీటిని నిల్వ చేసి పాలకొల్లు ప్రజలకు సరఫరా చేస్తారు. భీమవరంలో గోస్తనీ-వేల్పూరు కాలువ, తాడేపల్లిగూడెంలో ఏలూరు ప్రధాన కాలువపై అడ్డుకట్టలు వేస్తారు.

# కందులు విక్రయించినా.. తప్పని జాగరణ

పెనుకొండ : వ్యయప్రయాసలకోర్చి పండించిన పంటను విక్రయించేందుకూ అన్నదాతకు అవస్థలు తప్పడం లేదు. జిల్లాలోనే రొద్దం మండలంలో అత్యధికంగా కందిపంట సాగు చేశారు. ఈ పంటకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.7,550 మద్దతు ధర ప్రకటించింది. దిగుబడి సైతం అధికంగా రావడంతో ఈనెల 2వ తేదీ నుంచి రొద్దం మండలంలోని ఆర్.మరువపల్లిలోని ఓ రైస్ మిల్లులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. మంగళవారం వరకు 18 వేల క్వింటాళ్ల కందులు కొనుగోలు చేశారు. ఈ కేంద్రంలో రైతులు అధిక మొత్తంలో కందులు విక్రయించడానికి రావడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. దీంతో రొద్దం మండలంలోని రెడ్డిపల్లి, తురకలాపట్నం రైతు సేవాకేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఇక్కడ కొనుగోలు చేసిన కందులను లారీల్లో మార్క్‌ఫెడ్ గిడ్డంగికి తరలించిన 15 రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేస్తారు. ఇప్పటివరకు 10 వేల క్వింటాళ్ల కందులు మార్క్‌ఫెడ్ గిడ్డంగికి తరలించారు. 5 వేల క్వింటాళ్లకు సంబంధించి మార్క్‌ఫెడ్ ద్వారా



రైతుల బ్యాంకు ఖాతాలకు బిల్లులు చెల్లించారు. మరో 8 వేల క్వింటాళు రెడ్డిపల్లి, తురకలాపట్నం, కొనుగోలు కేంద్రాల్లోనే నిలిచిపోయాయి.

**అన్నదాతల అవస్థలు**

వారం రోజులుగా లారీలు కారపోవడంతో కందులు రైతు సేవాకేంద్రాల్లోనే నిల్వ ఉన్నాయి. లారీల్లో తరలిస్తేనే రైతులకు బిల్లు నమోదవుతుంది. రైతు సేవా కేంద్రాల వద్ద లారీల కోసం రాత్రి, పగలు రైతులు పడిగాపులు కాస్తున్నారు. వాతావరణ మార్పుల కారణంగా వర్షాలు కురిస్తే ఆరుబయట నిల్వచేసిన కందులు తడిసిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతువేళల్లో కంది బస్తాలపైనే నిద్రపోతున్నారు.

**3 లారీలు వస్తున్నాయి**

అనంతపురంలోని గిడ్డంగులు నిండిపోయాయి. గిడ్డంగి అందుబాటులో లేకపోవడంతో కందుల తరలింపు ఆలస్యమైంది. ప్రస్తుతం ప్రొద్దుటూరులోని గిడ్డంగిలో నిల్వ చేయడానికి అనుమతులొచ్చాయి. సాయంత్రానికి 3 లారీలు పంపుతున్నాం. ఇప్పటి నుంచి వరుసగా లారీలు అందుబాటులోకి తీసుకొచ్చి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతాం.– గీతా, మార్క్‌ఫెడ్, డీఎం

# ఆదర్శ పాఠశాలల ఆహ్వానం

విశాఖపట్నం : ఆదర్శ విద్యాలయాల్లో ప్రవేశం పొందితే ఆంగ్ల మాధ్యమంలో ఉచితంగా చదువుకోవచ్చు. పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని బాలబాలికలకు నాణ్యమైన విద్య అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 2011లో అక్షరాస్యతాపరంగా వెనకబడిన ప్రాంతాల్లో ఈ పాఠశాలలను ఏర్పాటు చేసింది. జిల్లాలో ఐదు ఆదర్శ పాఠశాలలు ఉండగా.. 2025–26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశాలు కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. రాత పరీక్ష నిర్వహించి సాధించిన మార్కుల ప్రాతిపదికన సీట్లు భర్తీ చేస్తారు.

జిల్లాలోని చీడికాడ మండలం మంచాల, రావికమతం మండలం మరుపాక, నర్సీపట్నం మండలం వేములపూడి), కశింకోట మండలం తేగాడ, మునగపాక మండలం పాటిపల్లిలో ఈ పాఠశాలలు ఉన్నాయి. ఆరో తరగతిలో ప్రవేశాలకు ఒక్కో పాఠశాలలో వంద చొప్పున మొత్తం 500 సీట్లు అందుబాటులో ఉన్నాయి. సీటు సాధిస్తే ఇంటర్మీడియట్ వరకు ఉచితంగా చదువుకోవచ్చు.

**అర్హతలు ఇవీ..**ఓసీ, బీసీ విద్యార్థులు 01.09.2013 నుంచి 31.08.2015 మధ్య, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 01.09.2011 నుంచి 31.08.2015 మధ్య జన్మించి ఉండాలి.

ప్రభుత్వ/ ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఒకేచోట 2022–23, 2023–24 విద్యా సంవత్సరాల్లో చదివి ఉండాలి. ప్రస్తుత సంవత్సరంలో 5వ తరగతి చదువుతూ ఆరో తరగతికి ప్రమోట్ అయి ఉండాలి. రాత పరీక్షలో సాధించిన మార్కులు, రోస్టర్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు.

**దరఖాస్తు ఇలా** ఆసక్తి, అర్హత ఉన్న బాలబాలికలు ముందుగా %www.apms.apcfss.in, www.csc.ap.gov.in% వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 పరీక్ష రుసుం ఆన్‌లైన్‌లో చెల్లించాలి. అభ్యర్థులు ఫీజు చెల్లించగానే ఓ ప్రత్యేక నంబరు కేటాయిస్తారు. ఆ నంబరు ఆధారంగా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.

**ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష..** ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో ఏప్రిల్ 20వ తేదీ ఉదయం 10 గంటల మధ్యాహ్నం 12 గంటలకు వరకు పరీక్ష ఉంటుంది. ఎంపిక చేసుకున్న కేంద్రంలోనే పరీక్ష రాయాలి. ఐదో తరగతి సిలబస్ నుంచి తెలుగు, ఆంగ్లంలో ప్రశ్నపత్రం ఉంటుంది. గణితంలో 20, తెలుగులో 20, సాంఘిక శాస్త్రంలో 20, ఆంగ్లంలో 20, సైన్సులో 20 మార్కుల చొప్పున మొత్తం వంద మార్కులకు పేపర్ ఇస్తారు. ఏప్రిల్ 27న మెరిట్ జాబితా విడుదల చేస్తారు. 30న ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తారు. వెంకటలక్ష్మి, ప్రిన్సిపల్, ఆదర్శ పాఠశాల, చీడికాడ

# అరగంటలో ఆక్రమణ!!

విశాఖపట్నం :నగరంలో జీవీఎంసీకి చెందిన ఖాళీ ప్రదేశాలు, రహదారికి ఇరువైపులా ఉన్న కాలిబాట(ఫుట్‌పాత్)లపై ఆక్రమణలు కొనసాగుతూనే ఉన్నాయి. వైకాపా పాలనలో స్థానిక నాయకులు ఎం.వి.పి.కాలనీలో ప్రధాన కూడళ్లతోపాటు కాలిబాటలు సైతం ఆక్రమించి బడ్డీలను ఏర్పాటు చేశారు. ఫలితంగా నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఆక్రమణలకు అడ్డుకట్ట పడలేదు. ఎం.వి.పి.కాలనీలోని ఆళ్వార్‌దాస్ మైదానానికి ఆనుకుని ఐ.ఐ.ఎ.ఎం. కళాశాలకు ఎదురుగా ఉన్న కాలిబాటను ఇప్పటికే పలువురు ఆక్రమించి బడ్డీలను ఏర్పాటు చేశారు. తాజాగా 10గంటలకు కొందరు వాహనంలో విడిభాగాలను ఇక్కడికి తెచ్చారు. కేవలం అరగంట వ్యవధిలోనే వాటిని బిగించి బడ్డీని సిద్ధం చేశారు. రాత్రి సమయంలో ఇలా ఇష్టానుసారంగా బడ్డీలు ఏర్పాటుచేస్తున్నా జీవీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# పురం డంపింగ్ యార్డులో కాసుల వేట



అనంతపురం : హిందూపురంలో డంపింగ్ యార్డు పేరుతో మున్సిపల్ అధికారులు కాసుల వేట మొదలుపెట్టారు. గత వైకాపా ప్రభుత్వంలో టెండరు దక్కించుకొని పనులు చేపట్టని సంస్థకే మళ్లీ ఏరికోరి కాంట్రాక్టు అప్పగించారు. రాష్ట్రంలోని ముఖ్య మున్సిపాలిటీల్లోని డంపింగ్ యార్డులను శుభ్రం చేయాలనే ఉద్దేశంతో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో 2022లో పనులు మొదలుపెట్టారు. హిందూపురం పాత డంపింగ్ యార్డులోని చెత్తను రీసైక్లింగ్ చేసే కాంట్రాక్టును గుంటూరుకు చెందిన ఘనేశ్వర ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి కట్టబెట్టారు. 2022 డిసెంబరులో అగ్రిమెంటు కూడా చేసుకున్నారు. మూడు నెలల్లో చెత్తను బయోమైనింగ్ చేసి డంపింగ్ యార్డును పూర్తిగా శుభ్రం చేసి మున్సిపాలిటీకి అప్పగించాలి. కానీ, సదరు కంపెనీ కొద్దిరోజులు పనిచేసి ఆ తర్వాత పట్టించుకోలేదు. పలుమార్లు నోటీసులు ఇచ్చినా స్పందించలేదు. నిబంధనల మేరకు ఏడాదిలోపు పనులు పూర్తిచేయకపోతే కాంట్రాక్టు రద్దవుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మళ్లీ టెండర్లు పిలిచి పనులు అప్పగిస్తారని అంతా భావించారు. కానీ, మున్సిపల్ అధికారులు నిబంధనలను తుంగలో తొక్కి మళ్లీ ఘనేశ్వర ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కే పనులు అప్పగించడం గమనార్హం.

తొలుత 2022 డిసెంబరు 3న ఘనేశ్వర కంపెనీతో ఒప్పందం చేసుకున్నారు. కానీ, సదరు కంపెనీ బ్యాంకు గ్యారెంటీలు సైతం సమర్పించలేదు. ఈ సంస్థతోనే గతేడాది ఆగస్టులో కొత్తగా అగ్రిమెంట్ చేసుకున్నారు. తొలుత చేసుకున్న అగ్రిమెంటులో అప్పటి మున్సిపల్ కమిషనర్ సంతకాలు చేయలేదనే కారణం చూపుతూ మళ్లీ అదే కంపెనీతో ఒప్పందం చేసుకున్నారు. 2022 డిసెంబరు 3న జరిగిన అగ్రిమెంట్‌తో పాటు అగ్రిమెంట్ రిజిస్టర్‌లోనూ అప్పటి కమిషనర్ సంతకాలు స్పష్టంగా ఉన్నాయి.

**25 వేల టన్నులను అధికంగా చూపి..**

పాత డంపింగ్ యార్డులోని 61,499 టన్నుల చెత్తను టన్నుకు రూ.754 చొప్పున బయోమైనింగ్ చేయాలని ఘనేశ్వర కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే గతేడాది ఆగస్టులో మాత్రం డంపింగ్ యార్డులో 86 వేల టన్నుల చెత్త ఉందంటూ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు లేఖలు రాయడం గమనార్హం. ఒప్పందం కుదుర్చుకున్నప్పటి నుంచి ఆ డంపింగ్ యార్డులో చెత్త వేయడం లేదు. అలాంటప్పుడు పరిమాణం ఎలా పెరుగుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. 25 వేల టన్నులను అధికంగా చూపి బిల్లులు కాజేయాలనే కుట్రతోనే అధికారులు ఈ విధమైన ఎత్తుగడ వేశారనే ఆరోపణలున్నాయి.

**చేయని పనులకు బిల్లులు**

డంపింగ్ యార్డులోని చెత్త నుంచి ప్లాస్టిక్, గాజు పదార్థాలు, మట్టిని వేరు చేయాలి. ప్లాస్టిక్‌ను సమీపంలోని సిమెంటు ఫ్యాక్టరీలకు తరలించారు. ఇలా మూడు నెలల్లో డంపింగ్ యార్డులోని చెత్త మొత్తాన్ని ఖాళీ చేయాలనేది ఒప్పందం. అయితే ఘనేశ్వర కంపెనీ గతేడాది అక్టోబరులో పనులు మొదలుపెట్టి డిసెంబరు వరకు మాత్రమే చేపట్టి జనవరిలో నిలిపివేసినట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. చెత్తను బయోమైనింగ్ చేయకుండా ట్రక్కుల ద్వారా తరలించి బహిరంగ ప్రదేశాల్లో పారబోశారనే ఆరోపణలున్నాయి. వీటిని ఏమాత్రం పట్టించుకోని మున్సిపల్ అధికారులు 30 వేల టన్నులు ఖాళీ చేసినట్లు బిల్లులు పెట్టేందుకు సిద్ధమైనట్లు సమాచారం. రూ.2.2 కోట్ల మేర బిల్లులు కొట్టేసేందుకు అధికారులు సహకరిస్తున్నారనే విమర్శలున్నాయి.

నీ ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులును వివరణ కోరగా గతంలో ఏం జరిగిందో తనకు తెలియదని, గతేడాది ఆగస్టులో అప్పటి కమిషనర్ ఘనేశ్వర కంపెనీతో ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. ఇప్పుడు దాన్నే కొనసాగిస్తున్నాం. పనులు చేసిన మేరకు బిల్లులు చెల్లిస్తామని వివరించారు.

# శివార్లు దాటి.. సవాళ్లు విసిరి



తిరుపతి : చేపల మార్కెట్ సమీపంలో ఓ యువకుడు గంజాయికి బానిసై ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. తాత్కాలిక డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. సంపాదన మొత్తం గంజాయికి వెచ్చిస్తూ ఉపాధిని సైతం కోల్పోవాల్సి వచ్చింది. తిరుపతిలో గంజాయి విరివిగా దొరికే రోజుల్లో రూ.250లకు లభించే గంజాయి కోసం ఇప్పుడు రూ.400 వెచ్చించాల్సి వస్తోందని చెబుతున్నాడు. బైరాగిపట్టెడకు చెందిన ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ ఉద్యోగాన్వేషణను పూర్తిగా విస్మరించి ఏదో వెతుక్కుంటూ తిరిగేవాడు. తల్లిదండ్రులు ఆరాతీస్తే అవిలాల చెరువు వద్ద కొందరు ఆకతాయి ఆటో డ్రైవర్లతో స్నేహం చేస్తున్నట్లు, వారిద్వారా గంజాయి కొనుగోలు చేసి వినియోగిస్తున్నట్లు తెలుసుకున్నారు. మానసిక వైద్యుని వద్దకు తీసుకెళ్లారు. రెండళ్ల నుంచి గంజాయి అలవాటు ఉందని, గతంలో సహచర విద్యార్థుల నుంచి సులువుగా కొనుగోలు చేసేవాడని, ప్రస్తుతం లభించకపోవడంతో దానిని వెతికేందుకే ఎక్కువ సమయం వెచ్చిస్తున్నాడని వైద్యుని ద్వారా తెలుసుకుని తల్లిదండ్రులు నిర్ఘాంతపోయారు.

తిరుపతిలో గంజాయి వినియోగం కలవరపెడుతోంది. లభ్యత తగ్గిందనడంలో వాస్తవమెంతో వినియోగం పెరిగిందనడంలో అంతే నిజముంది. నిన్నమొన్నటి వరకు కిలోల పరిమాణంలో లభించే గంజాయి ప్రస్తుతం గ్రాముల ప్యాకెట్లలోకి మారి ధరలు సైతం పెరగడం విశేషం. గంజాయి అమ్మకాలతో సులువుగా డబ్బు సంపాదించడం కోసం అలవాటుపడిన వారు తమ స్థావరాలను శివారు ప్రాంతాలకు మార్చి వినియోగదారుల్ని అక్కడికి మళ్లించుకుంటున్నారు.

**వినియోగదారుల నిలయం తిరుపతే**

గంజాయి విక్రయాలు తిరుపతిలో గత ఐదేళ్లలో కొంతకాలం రహస్యంగా తర్వాత బహిరంగంగా సాగాయి. కొందరు స్థానిక నేతలు మీడియా సమక్షంలో దాడులు, మారువేషాల నాటకాలతో రక్తి కట్టించి తరువాత తెరమరుగు కాగా వందల సంఖ్యలో వ్యాపారులు పుట్టుకొచ్చారు. వైజాగ్ నుంచి వందల కిలోల గంజాయి సేకరించి వేలాది మందిని బానిసలుగా చేశారు. మందుబాబులతో సమానంగా గంజాయి బానిసలు తయారయ్యారు.


**అధికారి మారినప్పుడల్లా విరామం**

తిరుపతిలో గంజాయి వ్యాపారం గురించి పూర్తి అవగాహన పోలీసుశాఖకు ఉంది. నగరంలో తిష్ఠవేసిన కానిస్టేబుళ్లు, ఆపై స్థాయి సిబ్బందికి గంజాయి వ్యాపారం వలాలూ తెలుసు. ఐదేళ్లపాటు వ్యాపారానికి సహకరించిన పోలీసులు నగరంలో ఒక స్టేషన్ నుంచి మరో స్టేషన్‌కు మారుతున్నా గంజాయి వ్యాపారానికి సహకరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విస్తృత దాడులు, సోదాలు నిర్వహించి కట్టడి చేయగలిగారు. ఎస్పీ స్థాయి అధికారులు మారినప్పుడల్లా సిబ్బంది సైతం చేతులెత్తేసి దాడులు, సోదాలకు విరామం ఇస్తుండటం ప్రతిబంధకంగా మారుతోంది. గంజాయి రవాణా, విక్రయాల కట్టడికి ప్రత్యేకంగా బృందాలను వినియోగిస్తేనే ఫలితం ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ప్రాశస్త్యమూ.. పర్యాటకమూ

శ్రీకాళహస్తి : దక్షిణ కైలాసంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తి దివ్య క్షేత్రంలో ఎన్నో.. ఎన్నెన్నో అద్భుతాలున్నాయి. వాటిల్లో ప్రాశస్త్యంతో పాటు.. పర్యాటక ధామంగా ఖ్యాతి గడించింది వేయిలింగాలకోన. శ్రీకాళహస్తి పట్టణానికి ఏడు కిలోమీటర్ల దూరంలో కైలాసగిరుల్లో కొలువుదీరిన ఇక్కడి ప్రకృతి అందాలు.. బండరాళ్ల మధ్య నుంచి జాలువారే సన్నని నీటి జలధారలు.. కనుచూపు మేర కన్పించే పచ్చదనం చూసి ప్రతి ఒక్కరూ ఆనందాల్లో తేలియాడటం తథ్యం.

**దేవతా సహస్రంగా.. ప్రాశస్త్యం** కైలాసగిరుల్లో అత్యంత పవిత్రమైన ప్రాంతంగా అభివర్ణిస్తారు. ఇదే విషయాన్ని ధూర్జటి రాసిన శ్రీకాళహస్తీశ్వర శతకంలోనూ విశిదపరచడంతో మరింత విశేషతను సంతరించుకుంటోంది. దేవతలందరూ వారి శక్తుల కారణంగా విజయలక్ష్మిని పొందగల్గినట్లుగా భావించి అహంకారంతో వారిలో వారు కలహించుకోవడంతో కోపోద్రిక్తుడైన సదాశివుడు వారికి జ్ఞానబోధ కల్పించాలని భావించడం, కైలాసగిరుల్లోని ఓ యక్షగుహలో యక్షుని రూపం దాల్చి దేవతల శక్తిని పరీక్షించేందుకు ఓ గడ్డి పరకను దహించమని దేవతలను కోరడం, వాళ్ల శక్తులు చాలకపోవడంతో పరమేశ్వరుని తత్వాన్ని పార్వతీదేవి ద్వారా తెలుసుకున్న భక్తులు ఆయన్ను క్షమించమని ప్రార్థించిన దివ్య ప్రదేశమే ఈ సహస్రలింగ తీర్థంగా చెప్తారు. దేవతందరి చేత పూజలందుకోవడం కారణంగా అక్కడ వెలసిన శివలింగంపై చుట్టుకు వంద వంతున వెయ్యి గీతలుండటం ఇక్కడి శివలింగాకృతి ప్రత్యేకం. ఆకృతి శివలింగంతో సహస్రలింగేశ్వరునిగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో దర్శనీయడం విశేషం. దేవతలందరూ జ్ఞానసిద్ధిని



పొందిన దివ్య ప్రాంతం కావడంతో వేయిలింగాల తీర్థం ప్రాచుర్యం పొందింది.?

**పర్యాటక ధామంగా:** ప్రకృతి రమణీయతను పంచే పచ్చని పొదరిళ్లతో ఇక్కడి వేయిలింగాల కోన ఆకట్టుకుంటోంది. ఇక్కడ కొలువుదీరిన సహస్రలింగేశ్వరుని దర్శించుకునేందుకు వెళ్లే భక్తులు ముందుగా ఇక్కడి జలపాతాన్ని సందర్శిస్తారు. సహస్రలింగేశ్వరుని ఆలయానికి సమీపంలో అష్టదిక్పాలకులు శివానుగ్రహం కోసం ప్రార్థించిన దివ్య శివాలయం, అక్కడకు సమీపంలో కొండల్లోంచి జాలువారే జలపాతాలు నయనానందాన్ని కల్గిస్తాయి.

**ఆకట్టుకునే శిల్పసంపద** పురాతనమైన శిలాజాలు, శిలలపై చెక్కిన శిల్పాలు చూపరుల మనస్సును ఆకట్టుకుంటాయి. కొండల్లోంచి వచ్చే జలధారలకు సమీపంలో రాతి బండలపై నందీశ్వరునిపై శివపార్వతుల వైభవం, భక్తకన్నప్ప, వనదేవతలు, మహర్షుల ప్రతిమలు సందర్శకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఆధ్యాత్మికంగాను, పర్యాటకంగాను ఈ ప్రాంతం ప్రత్యేక గుర్తింపును పొందింది.

# ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం

తాడిపత్రి : అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, కొంతమంది రాజకీయ నాయకుల తోడ్పాటు అందించడంతో మున్సిపాలిటీల పరిధిలో ప్రజల ఉపయోగార్థం కేటాయించిన రిజర్వుడు స్థలాల్లో కొన్ని అన్యాక్రాంతమయ్యాయి. ఈ స్థలాల్లో కొందరు ఇళ్లను నిర్మించుకుని నివాసముంటుండగా మరికొందరు ఇతరులకు అద్దెకిచ్చి బాడుగలు తీసుకుంటున్నారు. గుంతకల్లులో డీఎస్పీ కార్యాలయం, రెండో పట్టణ పోలీసుస్టేషన్ తదితర ప్రభుత్వ భవనాలు కూడా రిజర్వుడు స్థలాల్లో నిర్మించడం గమనార్హం. ప్రారంభంలోనే స్థలాల రక్షణకు కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. గుంతకల్లు పట్టణంలో 11 కాలనీల్లో దాదాపు రూ.79 కోట్ల విలువచేసే రిజర్వుడు స్థలాల్లో 53,240 చదరపు గజాల స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. మున్సిపాలిటీలో మొత్తం 111 రిజర్వుడు స్థలాలుండగా 11 అన్యాక్రాంతమయ్యాయి. అధికారులు ఇందులో 71 స్థలాలకు కంచె, గోడలు ఏర్పాటు చేశారు. అన్యాక్రాంతమైన స్థలాలతో పాటు మిగిలిన 29 స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో సమీపంలో ఇళ్లను నిర్మించుకున్న వారు కొందరు రిజర్వుడు స్థలాల్లో కొంత స్థలాన్ని ఆక్రమించి అనుభవిస్తున్నారు. రిజర్వుడు స్థలాల్లో ఇళ్లను నిర్మించుకున్నవారిలో 90 శాతం మందికి వేరేచోట స్థలాలు కేటాయించారు. కానీ, వారు ఇళ్లు నిర్మించుకోకుండా రిజర్వుడు స్థలాల్లోనే నివాసముంటున్నారు. వారిని ఖాళీ చేయించడానికి రాజకీయ నాయకులు సుముఖత వ్యక్తం చేయడం లేదు.

తాడిపత్రి మున్సిపాలిటీలో దాదాపు 90 రిజర్వుడు స్థలాలుండగా ఇందులో 20 దాకా ఆక్రమణలకు గురయ్యాయి. స్థలాల్లో కొందరు పక్కా భవనాలు నిర్మించుకుని అనుభవిస్తున్నారు. స్థలాల పరిరక్షణకు



అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. గుత్తి మున్సిపాలిటీలో ఏడు రిజర్వుడు స్థలాలుంటే ఇందులో మూడు ఆక్రమణలకు గురయ్యాయి. ఆక్రమణలను తొలగించే విషయంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఆక్రమణల కారణంగా ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే భవనాలు, పార్కులను ఏర్పాటు చేయలేకపోతోంది.

**రూ. 1.97 కోట్లతో రక్షణ చర్యలు**

– శ్రీనివాసులు, సహాయ సిటీ ప్లానర్

గుంతకల్లు మున్సిపాలిటీలోని రిజర్వుడు స్థలాలను కాపాడటానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగం 28 స్థలాలకు రూ.1.97 కోట్లతో ఇనుప కంచెలు ఏర్పాటు చేస్తున్నాం. ఇందుకు టెండర్లు నిర్వహించి పనులు గుత్తేదారులకు అప్పగించాం. రిజర్వుడు స్థలాల్లో నివాసముంటున్నవారికి స్థలాలు కేటాయించినందున అక్కడి ఇళ్లను తొలగిస్తాం.

# రీసర్వే రగడ

విశాఖపట్నం : ఆనందపురం మండలం గొట్టిపల్లి రెవెన్యూ పరిధి చందక గ్రామంలో తొమ్మిదెకరాల స్థలానికి గతంలో నలుగురు వ్యక్తుల పేర్లతో రిజిస్ట్రేషన్లు జరిగాయి. వాస్తవానికి ఆ స్థలం మీద అనుభవదారులుగా ఎనిమిది మంది రైతులున్నారు. దీంతో రీసర్వే వివాదానికి దారి తీసింది. గొట్టిపల్లిలో ఓ కుటుంబానికి చెందిన నాలుగెకరాల స్థలంలో హద్దుల సమస్య తలెత్తింది. అది తేలాకే రీసర్వేకు ముందుకెళ్లాలని తేల్చిచెప్పడంతో ఆపేశారు.

భీమిలి మండలం దాకమర్రిలో కుటుంబ సభ్యుల మధ్య పంపకాల్లో స్పష్టత లేక సర్వే చేయడం కుదరలేదు. ఆ కుటుంబానికి చెందినవారంతా ఒక మాటమీదకొచ్చాక చేస్తామని అధికారులు వెనుదిరిగారు.

ప్రస్తుతం రీసర్వే జరుగుతున్న దాకమర్రి, గొట్టిపల్లి, గంధవరం గ్రామాల్లో చిత్రవిచిత్ర పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఎక్కడ రీసర్వే చేపడుతున్నారో ముందుగానే సంబంధిత రైతులకు సమాచారం అందిస్తున్నా క్షేత్రస్థాయిలోకి వెళ్లేసరికి అధికారులకు భిన్న పరిస్థితులు ఎదురవుతున్నాయి. గత ప్రభుత్వంలో అంతా ఇష్టానుసారంగా సాగింది. చాలా చోట్ల రికార్డుల్లోని కొలతలను తగ్గించేసి వైకాపా అనుకూల వ్యక్తుల పేరున రాయించేశారు. ఇప్పుడు కొంత ఆలస్యమవుతున్నా వివాదరహితంగా చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయినప్పటికీ కొందరు అధికారుల నిర్లక్ష్యం వల్ల అక్కడక్కడ ఇబ్బందులు తప్పడం లేదు. **ఇదీ పరిస్థితి:** అన్నదమ్ముల మధ్య వాటాల విషయంలో వివాదాలు తలెత్తుతున్నాయి. గతంలో ఒకరి పేరునే పాసుపుస్తకాలు ఉండేవి. ఇప్పుడు వాటి పంపకాల్లో విభేదాలు వస్తున్నాయి.

భూమి అనుభవదారులను, రికార్డుల్లో ఉన్న వారిని అధికారులు పిలుస్తున్నారు. ఈ సమయంలో కొత్త వివాదాలొస్తున్నాయి. ఎవరికివారు పత్రాలు చూపిస్తుండటంతో ఎవరిదని తేల్చే విషయంలో జాప్యం జరుగుతోంది.

ఇక్కడ కమతాలు చిన్నవి. రైతులకు వేరువేరుగా స్థలాలున్న ప్రతి దగ్గర వాటికి వేరువేరుగా చల్తా నంబరు కేటాయిస్తున్నారు. గతంలో అంతటికీ కలిపి ఒకటే ఇచ్చేవారు. దీంతో ఈ నంబర్ల కేటాయింపునకు శ్రమించాల్సి వస్తోంది. వివాదాస్పద భూముల్లో రీసర్వే చేస్తున్నప్పుడు సరిహద్దులు గుర్తించి వదిలేస్తున్నారు. రైతుల మధ్య సఖ్యత లేక సర్వే చేయడం లేదు.

కొన్ని చోట్ల సర్వేను సచివాలయ, ఇతర కింది స్థాయి సిబ్బందిపై వదిలేస్తున్నారు. వివాదం రేగినప్పుడు కనీసం పరిష్కరించడానికైనా కొన్ని చోట్ల జోక్యం చేసుకోవడంలేదు. తరచూ కలెక్టర్, జేసీ పర్యవేక్షిస్తున్నా వారొచ్చినప్పుడు కనిపించి మిగిలిన సమయాల్లో శ్రద్ధ పెట్టడం లేదు.

తేల్చుకోమన్నారు: 'మా కుటుంబానికి చెందిన భూమి పంపకాల విషయంలో విభేదాలు ఉండడంతో రీసర్వే మొదలుపెట్టలేదు. అంతా ఏకాభిప్రాయానికి వచ్చాక చేస్తామని అధికారులన్నారు. అందర్నీ కూర్చోపెట్టి సందేహాలు నివృత్తి చేసి హద్దులు నిర్ణయిస్తే అభ్యంతరం లేదు. తర్వాత చిక్కులు రాకుండా చేస్తే చాలు' అని ఓ రైతు పేర్కొన్నారు.

**ఆలస్యమైనా:** 'కాస్త ఆలస్యమైనా అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా రీసర్వే చేయిస్తున్నాం. ఎక్కడా రైతుల మధ్య విభేదాలు, గొడవలు తలెత్తకూడదనే ఉద్దేశంతో ముందుకు వెళుతున్నాం. పంపకాల విషయంలో రైతులను ముందుగా తేల్చుకొని రమ్మంటున్నాం. అన్ని పూర్తయ్యాక తుది నివేదికను గ్రామాల్లో ప్రదర్శిస్తాం. అప్పటికీ అభ్యంతరాలుంటే తెలపొచ్చు' అని జేసీ మయూర్ అశోక్ పేర్కొన్నారు.

# 'ఏలేరు'.. ఆగనుంది నీరు..!

విశాఖ : విశాఖ ప్రజలకు, పరిశ్రమల అవసరాలకు నీటిని అందిస్తున్న ఏలేరు కాలువ నిర్వహణ పనుల నిమిత్తం ఫిబ్రవరి 15 నుంచి 40 రోజుల పాటు కాలువను మూసివేయనున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయాలపై నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారులు దృష్టి సారించారు.

**నిధుల మంజూరు..**

నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో రూ.90 కోట్ల వ్యయంతో కాలువ నిర్వహణ పనులు చేపడుతుండగా, జీవీఎంసీ ఆధ్వర్యంలో లీకులు అరికట్టేందుకు రూ.7 కోట్లతో టెండర్లు ఆహ్వానించింది.

**భారీ మొత్తంలో నిల్వలు**

ఎన్టీపీసీ, విశాఖ స్టీల్‌ప్లాంట్, ఏపీఐఐసీకి నీటి సరఫరా నిలిచిపోతుండటంతో నీటి నిల్వపై పరిశ్రమల యజమానులు దృష్టి సారించారు. ఎన్టీపీసీకి 30 రోజులకు సరిపోయే నీరు నిల్వ చేసుకునే సామర్థ్యం ఉండగా, మరో పది రోజులకు అవసరమయ్యే నిల్వల కోసం ఎక్కువ మొత్తంలో నీటిని సరఫరా చేయనున్నారు.



స్టీల్‌ప్లాంట్‌లో నీటి నిల్వ సామర్థ్యం అధికంగా ఉండటంతో ఎలాంటి ఇబ్బంది లేదు. మిగిలిన పరిశ్రమల అవసరాలు తీర్చేలా జీవీఎంసీ ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రస్తుతం ఏలేరు నుంచి 42 ఎంజీడీ (మిలియన్ గ్యాలన్ పర్ డే) నీటిని సేకరిస్తున్నారు.

**గతంలో ఇలా..**

ఏలేరు కాలువ నిర్వహణ పనులు 2016లో చేపట్టారు. 2022లో మళ్లీ చేపట్టాలని ప్రయత్నించినా, నిధుల లేమితో ప్రతిపాదనలు పక్కన పెట్టారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం నిధుల మంజూరుకు అనుమతి ఇవ్వడంతో ఫిబ్రవరిలో పనులు చేపట్టనున్నారు.

**గాజువాకపై అధిక ప్రభావం**


ఏలేరు రిజర్వాయర్ నీటిపై ఆధారపడి ఉన్న గాజువాక, పరిసర ప్రాంతాలకు నీటి ఎద్దడి సమస్య తలెత్తనుంది. ఈ మేరకు ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టనున్నారు.

కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా 6 నుంచి 8 ఎంజీడీ (మిలియన్ గ్యాలన్ పర్ డే) నీటిని తీసుకోవడానికి నిర్ణయించారు. నగర అవసరాలకు తగ్గట్టుగా మేహాద్రిగెడ్డకు 22 ఎంజీడీల నీటిని తరలించనున్నారు. కాలువ నిర్వహణ పనులు పూర్తయిన తర్వాత వచ్చే నీటితో కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, మేహాద్రిగెడ్డను పూర్తిగా నింపేలా ప్రణాళికలు రూపొందించారు. రైవాడ, తాటిపూడి, గోస్తని, ముడసర్లోవ నుంచి యథావిధిగా నీటి సరఫరా కొనసాగనుంది.

# యంత్రుడి వ్యవ'సాయం'

ఒంగోలు : సాంకేతికత నానాటికీ కొత్త పుంతలు తొక్కుతోంది. వ్యవసాయంలోకీ ఆధునిక పోకడలు వచ్చి చేరుతున్నాయి. ఇందులో భాగంగా ఇప్పుడు సరికొత్తగా డ్రోన్లు ప్రవేశించనున్నాయి. ప్రస్తుతం ఎరువులు, పురుగుమందులు పిచికారీ చేయడంలో రైతులు అవలంభిస్తున్న విధానంలో వ్యయప్రయాసలు అధికం. ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసేవారు కూలీలకు అధికంగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. క్రిమిసంహారక మందుల పిచికారీ సమయంలో కొందరు అనారోగ్యం బారిన కూడా పడుతున్నారు. డ్రోన్ వినియోగంతో ఈ సమస్యలు ఇకపై దూరం కానున్నాయి.

**మండలానికి ఒకటి చొప్పున:** ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో 875 గ్రామాలను ఎంపిక చేసి ఒక్కోటి చొప్పున మంజూరు చేయాలని నిర్ణయించింది. ఇందుకుగాను రూ.70 కోట్లు రాయితీగా ఇవ్వనుంది.



జిల్లాకు సంబంధించి నలభై గ్రామాలకు 40 డ్రోన్లు ఇవ్వాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. మొత్తం 38 మండలాలు ఉండగా.. మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేస్తారు. మిగిలిన రెండు అధిక విస్తీర్ణం సాగులో ఉన్న మండలానికి కేటాయిస్తారు.

**కనిగిరి, ఒంగోలులో పూర్తి**

డ్రోన్ నిర్వహించే బృందం సభ్యులు ఇతర రైతులకు అద్దెకు ఇవ్వొచ్చు. ఎకరాకు రూ.400 వసూలు చేసుకోవచ్చని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. దీనిపై జేడీఏ ఎస్.శ్రీనివాసరావును 'న్యూస్‌టుడే' సమాచారం కోరింది. ఆయన మాట్లాడుతూ.. రైతుల ఎంపిక ప్రస్తుతం కనిగిరి, ఒంగోలు నియోజకవర్గాల్లో పూర్తయిందని, మిగిలిన వాటి నుంచి కూడా వచ్చాక ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. ఫిబ్రవరిలో శిక్షణ ఉంటుందని, మార్చి నాటికి అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

చేసే పనులు: ఎరువులు, పురుగు మందుల పిచికారీ

ఒక్కో డ్రోన్ సామర్థ్యం: పది లీటర్లు (ఎకరా పంటపై అయిదు నిమిషాల్లో పిచికారీ పూర్తి చేస్తుంది)

జిల్లాకు మంజూరు: మొత్తం 40

అందించనున్న గ్రామాల సంఖ్య: 40

ఎంపిక విధానం: ఆసక్తిగల రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ.

ప్రతి డ్రోన్‌కు అయిదుగురితో కమిటీ ఏర్పాటు.

ఒకరు డ్రోన్ పైలెట్. అతనే కన్వీనర్. మరొకరు కో కన్వీనర్. ఇతరులు సభ్యులు. (పైలెట్‌కు విద్యార్హత ఇంటర్మీడియట్ తప్పనిసరి.)

నిర్వహణపై ప్రభుత్వ ఖర్చుతో 12 రోజుల శిక్షణ ఉంటుంది.

ఒక్కో డ్రోన్ వ్యయం: సుమారు రూ.10 లక్షలు.

రైతుల వాటా: రూ.2 లక్షలు (80 శాతం రాయితీ. యంత్రం ధర ఎంతైనా గరిష్ఠంగా రూ.8 లక్షలు చెల్లింపు)

రైతులు ముందుగా రూ.5 లక్షలు డిపాజిట్ చేస్తే నేరుగా సరఫరా చేస్తారు. అంతమొత్తం ముందుగా చెల్లించలేకుంటే బ్యాంకు రుణంగా పొందే అవకాశం కల్పిస్తారు. రైతుకు యూనిట్ సరఫరా అనంతరం రాయితీ మొత్తం ప్రభుత్వం చెల్లిస్తుంది.(యూనిట్ ఖరీదు రూ.10 లక్షలైతే రైతు రూ.2 లక్షలు సొంతంగా చెల్లించాల్సి ఉంటుంది. అదే దోర్నాల, పుల్లలచెరువు, యర్రగొండపాలెం, కురిచేడు తదితర ప్రాంతాల్లో ఆర్‌వోఎఫ్‌ఆర్ భూములను సాగు చేస్తున్న గిరిజనులకు రూ.90 శాతం రాయితీతో అందజేస్తారు.)ఎకరాకు అద్దెగా రూ.400 వసూలు చేసుకోవచ్చని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

# అసైన్డ్ భూముల్లో అక్రమ తవ్వకాలు



అనంతపురం : ఉచిత ఇసుక అమలులో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటును స్థానిక నాయకులు దుర్వినియోగం చేస్తున్నారు. ప్రైవేట్, డికేటీ భూముల్లో అనుమతి తీసుకుని ఇసుక తవ్వకాలు జరపవచ్చని ప్రభుత్వం ఇచ్చిన అనుమతుల్ని కొందరు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా పెన్నా నది వెంబడి అసైన్డ్ భూముల్లో ఇసుక తవ్వకాలు జరుపుతూ వ్యాపారం చేస్తున్నారు. పగటిపూట ట్రాక్టర్ల ద్వారా తరలించి రహస్య ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. రాత్రివేళల్లో టిప్పర్ల ద్వారా అనంతపురం నగరానికి తరలిస్తున్నారు. ముఖ్యంగా శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల పరిధిలో ప్రజాప్రతినిధుల పేరు చెప్పి అనుచరులు రెచ్చిపోతున్నారు. అడ్డుకోవడానికి వెళ్లిన రెవెన్యూ అధికారులపై దౌర్జన్యం చేస్తున్నారు. మైనింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. మామూళ్లకు అలవాటుపడిన కొందరు పోలీసులు అక్రమార్కులకు పరోక్షంగా సహకారం అందిస్తున్నారనే విమర్శలున్నాయి.

**ప్రభుత్వ పనులకే వినియోగించాలన్నా..**

ఇసుక కొరత తీర్చాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్, డికేటీ భూముల్లో ఇసుక తవ్వకాలకు అనుమతి ఇచ్చింది. నది బయట ఉన్న భూముల్లో జిల్లా ఇసుక కమిటీ అనుమతుల మేరకు తవ్వకాలు జరుపుతారు. ఇందుకోసం పట్టాదారు ముందుగా దరఖాస్తు చేసుకుంటే కమిటీ ఆదేశాలతో తహసీల్దార్, మైనింగ్, వ్యవసాయ, జలవనరులశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తారు. తర్వాత తవ్వకాల కోసం పర్యావరణ, కాలుష్య నియంత్రణ బోర్డు అనుమతులను అధికారులే తీసుకుంటారు. అన్ని అనుమతులు వచ్చాక పట్టాదారుతో జిల్లా ఇసుక కమిటీ ఒప్పందం చేసుకుంటుంది. తర్వాత కమిటీ ద్వారానే విక్రయించాల్సి ఉంటుంది. టన్నుకు రూ.60 చొప్పున పట్టాదారుకు చెల్లిస్తారు. అయితే ఈ ఇసుకను కేవలం ప్రభుత్వ పనులకే వినియోగించాలనే నిబంధన విధించారు.

**పొలాల్లో పెద్ద గోతులు**

పెన్నా నది వెంబడి ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో విచ్చలవిడిగా తవ్వకాలు జరుపుతున్నారు. ఎక్కడా జిల్లా ఇసుక కమిటీ అనుమతులు తీసుకోలేదు. ముఖ్యంగా అసైన్డ్ రైతులకు నెలకు కొంతమొత్తం ముట్టజెప్పి తోటల్లో తవ్వి తరలిస్తున్నారు. ఫలితంగా నది స్వరూపం మారిపోతోంది. పొలాల్లో పెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. వరదలు వచ్చి గోతులు నిండితే ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శింగనమల నియోజకవర్గంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేరు చెప్పి కొందరు స్థానిక నాయకులు రెచ్చిపోతున్నారు. ఏకంగా రైతుల నుంచి అసైన్డ్ భూముల్ని కొనుగోలు చేసి మరీ తవ్వకాలు జరుపుతున్నారు. తాడిపత్రిలో సజ్జలదిన్నె, చుక్కలూరు, నందలపాడు, ఇగుడూరు గ్రామాల పరిధిలో నదికి ఆనుకుని ఉన్న తోటల్లో స్థానిక తెదేపా నాయకులు ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. అడ్డుకోవడానికి వచ్చిన అధికారులను భయపెట్టి వెనక్కి పంపిస్తున్నారు.

**అనుమతులు లేకుండా తవ్వితే చర్యలు**వినోద్‌కుమార్, కలెక్టర్, అనంతపురం అక్రమ తవ్వకాలను అడ్డుకోవడానికి వెళ్లిన సిబ్బందిపై కొందరు దౌర్జన్య ం చేసినట్లు నా దృష్టికి వచ్చింది. జేసీ ద్వారా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

# బోగస్ సంఘాల ఏరివేతలో.. నత్తతో పోటీ!




అనంతపురం : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా చేపట్టిన స్వయం సహాయక పొదుపు సంఘాల నవీకరణ నత్తలతో పోటీ పడుతోంది. మహిళా సంఘాల నవీకరణ జరిగితే బోగస్ పేర్లతో రుణాలు పొందిన వివరాలు వెలుగు చూసే అవకాశం ఉంది. మెప్మా రీసోర్స్‌పర్సన్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు క్షేత్రస్థాయికి వెళ్లి జల్లెడ పట్టాల్సి ఉన్నా జాప్యం చేస్తున్నారు. వాస్తవానికి నవంబరు ఆఖరుకు పూర్తి చేయాల్సి ఉన్నా ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఇప్పటికే మూడుసార్లు గడువు పెంచగా ఈనెలాఖరులోగా పక్కాగా ప్రొఫైలింగ్‌ను యాప్‌లో నవీకరణ చేయాలని ఆదేశాలు ఇచ్చినా పూర్తయ్యే పరిస్థితులు కనిపించడం లేదు.

**అన్ని వివరాలు ఆన్‌లైన్**

మహిళా సంఘాలు రుణం తీసుకుంటే సంఘంలో ఓ విధంగా, నగర, పురపాలికల్లోని మెప్మా వద్ద మరోవిధంగా, బ్యాంకుల్లో ఉన్న వివరాలకు పొంతన కుదరడం లేదు. సంఘంలోని సభ్యుల వివరాలన్నీ నవీకరించి ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. గతంలో బ్యాంకులో రుణం పొందినా, చెల్లించినా మెప్మాకు వివరాలు అందకపోవడంతో ఎంత సొమ్ము తీసుకున్నారు, ఎంత కట్టారు అనే వివరాలు బ్యాంకుకు వెళితేనే తెలిసేది. తాజాగా అన్ని వివరాలను నవీకరణ చేస్తుండటంతో బోగస్‌కు అడ్డుకట్ట వేసే అవకాశం ఉన్నా ప్రక్రియ వేగంగా సాగలేదు. ఈనెలఖరుతో గడువు ముగుస్తున్నా స్వయం సహాయక సంఘాల గ్రూపులు ఇప్పటి దాకా కొన్నింటిని గుర్తించలేదు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి అనంతపురం, ధర్మవరంలోనే ఎక్కువగా వివరాలు గుర్తించని సంఘాలు ఉన్నాయి.

**నెలాఖరులోగా లెక్క తేలుస్తాం**

**విశ్వజ్యోతి, మెప్మా పీడీ**

పలు సంఘాల్లోని సభ్యులు వలస వెళ్లారు. కొందరు ఎక్కడ ఉన్నారో గుర్తించడానికి అందుబాటులోకి రాలేదు. ఇలాంటి వివరాలన్నీ నెలాఖరులోగా లెక్క తీస్తాం. గతంలో ఎప్పుడో రుణాలు పొంది ఉంటారు.. అందువల్లే గుర్తించడం లేదు. బోగస్ సంఘాలు లేవు. చిరునామాలు, ఇతర వివరాలు సక్రమంగా లేనివి మాత్రమే ఉన్నాయి.

# కార్మికుల పాలిట సంజీవని



అచ్యుతాపురం : కార్మికులు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న అచ్యుతాపురం ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అక్టోబర్ 29న వర్చువల్ విధానంలో భూమి పూజ చేయగా నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. సెజ్ బ్రాండిక్స్ ప్రధాన గేటుకు ఎదురుగా రెండు ఎకరాల్లో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. దీనికి రూ. 62 కోట్లు కేటాయించారు. ఇప్పటికే రక్షణ గోడ పూర్తి చేశారు. ప్రధాన భవనంతో పాటు సిబ్బంది నివాస సముదాయాల పనులు చేపట్టారు. ఇది పూర్తయితే అచ్యుతాపురం సెజ్‌లోని 210 పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులతో పాటు పరవాడ ఫార్మా సిటీలోని వేలాది మంది కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఉపయోగం కలగనుంది. ఆధునిక సౌకర్యాలతో బర్నింగ్ వార్డును ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు సూచనకు అనుగుణంగా ఈ ఆసుపత్రిలో సౌకర్యాలను కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఎటువంటి వైద్యసేవలు పొందాలన్నా అచ్యుతాపురంలో ఉన్న డిస్పెన్సరీ లేదా మల్కాపురంలో ఉన్న ఆసుపత్రికి కార్మికులు పరుగులు తీస్తున్నారు. దీని నిర్మాణం పూర్తయితే కార్మికుల పని ప్రదేశంలోనే వైద్యసేవలు పొందేందుకు అవకాశం ఉంటుంది. సెజ్‌లో ఎసెన్సియా ఫార్మాలో జరిగిన ప్రమాదంలో 17 మంది మృతి చెందడానికి సకాలంలో వైద్యసేవలు అందకపోవడం కారణంగా భావిస్తున్నారు. ఈప్రమాదాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు సెజ్‌లో ఈఎస్ఐ ఆసుపత్రి ఆవశ్యకతను గుర్తించడంతో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

**మాకెంతో మేలు**

అచ్యుతాపురం సెజ్‌లో ఈఎస్ఐ ఆసుపత్రి లేకపోవడంతో విశాఖలోని మల్కాపురం ఆసుపత్రికి వెళ్తున్నాం. అనారోగ్యానికి గురైన సందర్భాల్లో ఆటోలపై తనిఖీల కోసం మల్కాపురం వెళ్తే సెలవు మంజూరు చేసేవారు. ఆసుపత్రి దగ్గరల్లో లేకపోవడం వల్ల అనకాపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రిలో సొంత డబ్బులతో శస్త్రచికిత్స చేయించుకున్నాను. అచ్యుతాపురంలో ఈఎస్ఐ సేవలు అందుబాటులోకి వస్తే కార్మికులకు ఎంతో మేలు జరుగుతోంది.రేబాక లక్ష్మి, మహిళా కార్మికురాలు, తిమ్మరాజుపేట

**విన్నపాలు గతంలో పట్టించుకోలేదు**

ఈఎస్ఐ ఆసుపత్రి పనులు ప్రారంభం కావడం ఆనందంగా ఉంది. దీని వల్ల కార్మికులు, ఉద్యోగులకు ఎంతో మేలు కలుగుతుంది. ఈఎస్ఐ సేవలు పొందడానికి విశాఖ వెళ్తున్నాం. నిర్మాణ పనులు ప్రారంభించాలని గతంలో ఎన్ని విజ్ఞాపనలు చేసిన పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పనులు ప్రారంభం ఆనందంగా ఉంది.

సతీష్, సెజ్ కార్మికుడు, అచ్యుతాపురం

# చెరువు పనులు చేయలేం!

పాడేరు : వైకాపా హయాంలో చెరువుల అభివృద్ధి పనులను ఇలా మొదలుపెట్టి అలా వదిలేశారు. ప్రపంచ బ్యాంకు, జైకా వంటి ఇతర దేశాల సంస్థలు సాగునీటి రంగానికి సాయం అందించడానికి ముందుకొచ్చినా నాటి పాలకులు రాష్ట్ర వాటా ధనం విడుదల చేయలేదు. ఫలితంగా ఏళ్లతరబడి ఆ పనులు అసంపూర్తిగానే నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వంలో పనులు చేద్దామన్నా అప్పటి ఎస్ఎస్ఆర్ రేట్లతో సాధ్యం కాదని గుత్తేదారులు వెనుకంజ వేస్తున్నారు. పాత అంచనా విలువలు సవరించి, కొత్త రేట్లతో పనులు చేయడానికి అవకాశం ఇవ్వాలంటున్నారు. లేకుంటే తమ పని ఒప్పందాలను రద్దు చేసి, కొత్తగా టెండర్లు పిలవాలని కోరుతున్నారు.

ప్రపంచ బ్యాంకు నిధులతో అయిదేళ్ల క్రితమే ఆంధ్రప్రదేశ్ సమీకృత సేద్య, వ్యవసాయ పరివర్తన ప్రాజెక్టు (ఏపీఐఐఏటీపీ) ద్వారా 64 గొలుసుకట్టు చెరువుల పనులు మంజూరు చేశారు. వాటితో 14,123 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని అంచనావేశారు. రూ.47.39 కోట్లతో 37 ప్యాకేజీలకు టెండర్లు పిలవగా 21 పనులకే గుత్తేదారులు ముందుకొచ్చారు. వారు కొంత మేర పనులు చేసినా వైకాపా ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేసింది. 'మరి ఈ పనులు చేయలేం బాబోయ్!' అంటూ గత రెండేళ్ల నుంచి చేతులెత్తేశారు. రూ.కోట్ల పనులు మంజూరు దశ నుంచి ముందడుగు



వేయలేకపోయాయి. రైతుల సాగునీటి ఇబ్బందులను తీర్చలేకపోతున్నాయి. తాజాగా కూటమి ప్రభుత్వానికి తమ సమస్యలను వివరించి టెండరు ఒప్పందాలను రద్దు చేయాలని అభ్యర్థన పెట్టుకున్నారు.

**జైకా పనుల తీరు అంతే..**

జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ సంస్థ (జైకా) కూడా సాగునీటి వనరుల అభివృద్ధికి ఆర్థిక సాయం చేయడానికి ముందుకొచ్చింది. ఆ సంస్థ భరోసాతోనే రైవాడ జలాశయం కుడి, ఎడమ కాలువలను రూ.33 కోట్లతో ఆధునీకరణ పనులను ఓ గుత్తేదారు సంస్థకు ఇచ్చారు. వాళ్లు సుమారు రూ.4 కోట్ల విలువైన పనులు చేసినా బిల్లులు ఇవ్వలేదు. దీంతో ఆ ఏడాదిలోనే పనులు నిలిపేశారు. ఇటీవల జలవనరుల శాఖ అధికారులు పనులు పునరుద్ధరించాలని ఆ గుత్తేదారు సంస్థను కోరారు. అప్పటి రేట్లతో చేయడం కష్టమని, అంచనా విలువ పెంచితే చేస్తానన్నట్లు తెలిసింది. ఈ విషయమై జలవనరుల శాఖ ఈఈ త్రినాథం వద్ద ప్రస్తావించగా గతంలో మంజూరై 25 శాతం పనులు పూర్తికాకుండా ఉన్నవాటిని రద్దు చేయమన్నారు. ఏపీఐఐఏటీపీ, ఏపిలిప్ వంటి ఈఏపీ పనుల రద్దు గురించి గానీ, అంచనా విలువలు పెంచే విషయమై ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత రాలేదన్నారు.

# ఇథనాల్‌తో లాభాల పంటే

అనకాపల్లి : ఇథనాల్ ఉత్పత్తి, వినియోగం పెంచడానికి కేంద్రం ముమ్మరంగా కృషి చేస్తోంది. వాహన కాలుష్యాన్ని తగ్గించే చర్యలలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. 2022 నాటికి 10 శాతం 2030 నాటికి 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్‌ను విక్రయించాలని కేంద్రం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా పరిశోధనలు చేపట్టడానికి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు నిర్ణయించారు. చెరకు నుంచి నేరుగా ఇథనాల్ తయారీ చేయొచ్చు. ఇప్పటికే చెరకు పంట తగ్గిపోయినందున ఇథనాల్ తయారీకి అనువైన తీపి జొన్న, చక్కెర దుంపలపై పరిశోధనలు చేపట్టారు. వీటికి సంబంధించిన వివరాలను ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు, చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.ఆదిలక్ష్మి వివరించారు. వారి మాటల్లోనే.. తీపి జొన్న మూడు నుంచి నాలుగు నెలల్లో కోతకు వస్తుంది. దీన్ని ఇథనాల్ తయారీకి ఎక్కువగా వాడుతారు. ఎకరాకు 1.2 నుంచి 1.4 టన్నులు దిగుబడి వస్తుంది. కర్ర, గింజలు గానుగాడవచ్చు. రికవరీ 50 నుంచి 60 శాతం ఉంటుంది. దీనిని చెరకులో అంతర పంటగా సాగు చేయొచ్చు. రెండు వరసలు చెరకు.. రెండు వరసలు తీపి జొన్న వేశ్యా. చెరకులో 19 శాతం ఉంటే తీపి జొన్నలో 21 శాతం ఉంటుంది.

**చక్కెర దుంప**

చక్కెర దుంప ఇథనాల్ తయారీకి ఎక్కువగా వాడతారు. ఇది 120 నుంచి 150 రోజుల్లో కోతకు వస్తుంది. ఎకరాకు 25 నుంచి 30 టన్నుల దిగుబడి వస్తుంది. పంచదార శాతం 15 నుంచి 17 ఉంటుంది. టన్ను నుంచి 100 నుంచి 120 లీటర్లు ఇథనాల్ ఉత్పత్తి అవుతుంది. అదే చెరకు నుంచి 80 నుంచి 100 లీటర్లు వస్తుంది.

**చెరకు నుంచి ఇథనాల్**

వంద టన్నుల చెరకు నుంచి పది టన్నులు పంచదార ఉత్పత్తి అవుతుంది. పిప్పి 30 నుంచి 35 టన్నులు వస్తుంది. మూడు టన్నుల మొలాసిస్ నుంచి 72–74 శాతం ఆల్కహాల్, 20–25 శాతం ఇథనాల్ ఉత్పత్తి అవుతాయి. చెరకు నుంచి నేరుగా ఇథనాల్ తయారీ చేయడానికి అవకాశం ఉంటుంది.

# ఉపాధి కూలీల సాంకేతిక స్నేహితుడు

అర్ధవీడు : గ్రామీణ ప్రాంతాల్లో వలసలకు అడ్డుకట్ట వేసేందుకు అమలు చేస్తున్నది జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం. కొన్నిచోట్ల అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. ప్రజాధనం దుర్వినియోగం అవుతోంది. పనుల కల్పనలో పారదర్శకతకు పాతరేసి కొందరు జేబులు నింపుకొంటున్నారు. ఈ నేపథ్యంలో పనుల్లో పారదర్శకత, సిబ్బందిలో జవాబుదారీతనం మరింతగా పెంచేందుకు.. అవకతవకలకు చెక్ పెట్టేందుకు జన్‌మన్‌రేగ అనే యాప్‌ను కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆవిష్కరించింది.

**కార్యాలయాలకు వెళ్లక్కర్లేదు:** జన్‌మన్‌రేగ యాప్ సాయంతో కూలీల వివరాలు, నగదు చెల్లింపులు, రోజువారీ హాజరు, పని మస్టర్ల వివరాలు చూసుకోవచ్చు. కూలీ నగదు ఖాతాల్లో జమైందా లేదా అనే సమగ్ర వివరాలను కూడా తనిఖీ చేసుకోవచ్చు. సిబ్బంది అవకతవకలకు పాల్పడితే గోప్యంగా యాప్ నుంచే ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. చాలా మంది కూలీలు పనులు చేసినప్పటికి కూలి డబ్బులు ఖాతాల్లో పడ్డాయా.. లేదా అనే విషయం తెలుసుకునేందుకు బ్యాంకులు, తపాలా శాఖ, నగదు లావాదేవీల దుకాణాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతుంటారు. యాప్‌పై అవగాహన పెంచుకుంటే కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా కూలీల అరచేతిలో ఇదో అస్త్రంగా మారనుంది. **యాప్‌లో సమగ్ర సమాచారం:** జన్‌మన్‌రేగ అనే యాప్‌ను చరవాణి ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్‌ను తెరిచిన తర్వాత రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామం వివరాలను ఎంపిక చేసుకోవాలి. అనంతరం జాబ్‌కార్డు నంబర్ కానీ, కుటుంబ సభ్యుల ఐడీని నమోదు చేస్తే కూలీలకు సంబంధించిన వివరాలు అందులో ప్రత్యక్షమవుతాయి. పని రోజులు, హాజరు, బ్యాంకు ఖాతాలో ఎంత నగదు జమైంది.. ఇంకెంత రావాలన్న సమగ్ర సమాచారం కనిపిస్తుంది. ఒకవేళ నగదు జమకాకుంటే ఏ కారణంతో రాలేదన్న వివరాలూ అందులో చూపుతాయి. పల్లెల్లో చేపట్టే పనుల వివరాలు, ఖర్చులు, ఎంతమంది కూలీలు పనులు చేస్తున్నారు. ఏఏ పనులకు ఎంత మంది కూలీలు వస్తున్నారన్న వివరాలు కూడా ఉంటాయి. కేంద్ర ప్రభుత్వం ఈ యాప్‌ను రూపొందించినప్పటికీ వినియోగంపై ప్రజలకు అవగాహన కరవైంది.

# స్మార్ట్‌సిటీ పనులకు.. నిధుల వేట

తిరుపతి : తిరుపతి స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రాజెక్టుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. 2017 నుంచి 2019 వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటా నిధుల్ని సక్రమంగా విడుదల చేయగా.. ఆపై అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం సొంత ప్రచార కార్యక్రమాలు, వ్యక్తిగత, రాజకీయ ప్రాబల్యం పెంపొందించుకునే కార్యక్రమాలకే పరిమితమైంది. రాష్ట్ర వాటా పైసా విదల్చకుండా అధోగతిపాలు చేసింది. వైకాపా పుణ్యమా అని మూలనపడ్డ స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుల్ని ప్రస్తుతం పట్టాలెక్కించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. నగరపాలక సంస్థ పరిధిలో ప్రస్తుతం 19 కీలక అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వీటిని పూర్తి చేయడానికి రూ.406 కోట్లు అవసరం. జూన్ 2025 నాటికి అన్ని స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులు పూర్తిచేయాలని కేంద్ర ప్రభుత్వం గడువు విధించిన నేపథ్యంలో అధికారులు నిధుల వేట ప్రారంభించారు. ముఖ్యంగా రూ.180 కోట్ల విలువైన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, రూ.95 కోట్లతో చేపట్టిన తిరుపతి సిటీ ఆపరేషన్ సెంటర్, రూ.53 కోట్ల విలువైన మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ ప్రాజెక్టులకు నిధులు సమకూర్చడం



అధికారులకు తలకుమించిన భారంగా మారింది. తితిదే నుంచి రావాల్సిన రూ.54 కోట్లతోపాటు కేంద్ర ప్రభుత్వ వాటా రూ.100 కోట్ల విడుదలకు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.280 కోట్ల సొమ్ము విడుదలతో ముడిపెట్టడంతో జాప్యం నెలకొంది. ఈ నిధులు విడుదలైతే తప్ప ప్రాజెక్టులకు మోక్షం లభించదు.

మొత్తం ప్రాజెక్టులు: 97 విలువ: రూ.1,586 కోట్లు
పూర్తయినవి: 78, విలువ: రూ.1139 కోట్లు
అసంపూర్తి ప్రాజెక్టులు: 19
వ్యయం చేయాల్సిన స్మార్ట్‌సిటీ నిధులు: రూ.447 కోట్లు


# శరవేగమా.. జాప్యమా!!

విశాఖపట్నం: విశాఖ కేంద్రంగా ఏర్పడిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ఎప్పటి నుంచి మొదలవుతాయనేది సంశయంగా మారింది. ఈ నెల 8వ తేదీన ప్రధాని మోదీ చేతుల మీదుగా జోన్ ప్రధాన కార్యాలయ భవనాలకు శంకుస్థాపన జరిగింది. జోనల్ మేనేజర్‌గా నియమించే వ్యక్తిని ఓఎస్డీగా ఇప్పటివరకు నియమించకపోవడం, మూడు వారాల కిందట వాల్తేరు డివిజన్‌కు నియమించిన డీఆర్ఎం నేటికీ బాధ్యతలు చేపట్టకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఎంపీలు ఒత్తిడి తెచ్చి త్వరలో ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్‌లో దక్షిణ కోస్తా జోన్‌కు నిధులు కేటాయించేలా చేస్తే కార్యాచరణకు కొంత ముందడుగుపడినట్లే.

**కసరత్తు ఏది?:** భువనేశ్వర్ కేంద్రంగా తూర్పుకోస్తా జోన్‌ను ప్రకటించినప్పుడు దాదాపు పదేళ్ల పాటు తాత్కాలిక భవనంలోనే సాగింది. అదే తరహాలో వాల్తేరు డివిజన్ భవనాలను జోన్ కార్యాలయ అవసరాలకు ఉపయోగించుకోవచ్చని పలువురు సూచిస్తున్నారు. దక్షిణ కోస్తా జోన్ కార్యకలాపాలు ప్రారంభించాలంటే ముందుగా జోన్‌లో భాగమైన గుంతకల్లు, విజయవాడ, గుంటూరు డివిజన్ల నుంచి అలాగే దక్షిణ మధ్య రైల్వే జోన్ సికింద్రాబాద్ జోనల్ కార్యాలయం నుంచి తాత్కాలికంగా పనిచేసేందుకు రైల్వే సిబ్బంది రావాల్సి ఉంటుంది. ప్రస్తుతం దానికి సంబంధించిన కసరత్తు జరుగుతున్నట్లు కనిపించడం లేదని విశ్రాంత ఉద్యోగులు పేర్కొంటున్నారు.

ఉద్యోగుల్లో జోనల్, డివిజినల్ సీనియార్టీలు నిర్ణయించాలి. ఇప్పటివరకు సికింద్రాబాద్ జోన్ కిందున్న డివిజన్లను దక్షిణ కోస్తాలో కలుపుతున్నందున అక్కడ జోన్, డివిజన్ ఉద్యోగులను విడదీయాలి. గుంతకల్లు, గుంటూరు, విజయవాడ డివిజన్లలో కొందర్ని జోన్‌లో కలపాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ప్రారంభంకావాల్సి ఉంది.

**అదే కీలకం:** వాల్తేరు డివిజన్‌తో కూడిన దక్షిణ కోస్తా జోన్‌కు ప్రాథమికంగా ఆమోదం ఉన్నా దాని సరిహద్దులపై ఇప్పటివరకు స్పష్టత లేకపోవడంపై సందేహాలు నెలకొన్నాయి. ఒకవైపు తూర్పుకోస్తా జోన్‌లో కొత్తగా ఆవిర్భవించిన రాయగడ డివిజన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కొత్త డీఆర్ఎం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటికే



వాల్తేరు డివిజన్ నుంచి మెకానికల్, సిగ్నల్ అండ్ టెలికం, సిగ్నలింగ్, ఎలక్ట్రానిక్స్ విభాగాల నుంచి 220 మందిని తూర్పుకోస్తా జోన్‌లోని సంబల్‌పూర్, ఖుర్దా డివిజన్లకు బదిలీ చేశారు. రాయగడ కొత్త డివిజన్ కార్యకలాపాలు త్వరలో ప్రారంభించనున్న నేపథ్యంలో పలు విభాగాల పోస్టులను వాల్తేరు నుంచి కొత్త డివిజన్‌కు తరలించేందుకు అంతర్గతంగా కసరత్తు చేసినట్లు తెలిసింది.

1) రాష్ట్ర పరిధిలోని ప్రాంతాలనే వాల్తేరు డివిజన్‌లో కొనసాగిస్తామంటున్నారు. దీంతో ఈ డివిజన్ పరిధి చాలా వరకు తగ్గిపోనుంది. అందుకే ఈ డివిజన్‌లోకి ప్రస్తుతమున్న విశాఖ-పలాస, విశాఖ-కూనేరు, విశాఖ-అరకు మార్గాలతో పాటు దువ్వాడ వరకు ఉన్న పరిధికి అదనంగా కాకినాడ, సామర్లకోట కూడలి వరకు కలిపితే బాగుంటుందని దక్షిణ కోస్తా రైల్వే ఓబీసీ ఉద్యోగ సంఘం డిమాండు చేస్తుంది.

2) కాకినాడ వరకు వాల్తేరు డివిజన్‌లోకి తెస్తే ఇటు విశాఖ పోర్టు, అటు కాకినాడ పోర్టు, స్టీలుప్లాంట్లు, ఎన్‌టీపీసీ, ఇతర పారిశ్రామిక ప్రాంతాలు, వ్యాగన్ వర్క్‌షాపులు, డీజిల్, ఎలక్ట్రానిక్ లోకోషెడ్లతో డివిజన్ కొంత బలోపేతం అవుతుందనే అభిప్రాయ ఉంది.

# పురంలో భూదందా



హిందూపురం : హిందూపురంలో మళ్లీ భూ దందా వేళ్లూనుకొంటోంది. ఈ ప్రాంతంలో భూముల విలువ రోజురోజుకు పెరుగుతుండటంతో ఖాళీ స్థలాలపై నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి వాటిని ఆక్రమించుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. గడిచిన వైకాపా పాలనలో ఇలాంటి సంఘటనలు అనేకం చోటుచేసుకోవటం వివాదాలకు దారితీసింది. ఎన్నికల ముందు ఆగిన ఈ దందా మళ్లీ ఊపిరి పోసుకొంటోంది. హిందూపురం ఎప్పుడైనా జిల్లా కేంద్రంగా మారే అవకాశం ఉందని జోరుగా ప్రచారం జరుగుతుండటంతో ప్రధానంగా పట్టణం చుట్టూ ప్రాంతంలో ఉన్న ఖాళీ స్థలాలకు భద్రత లేకుండాపోయింది. ఈ భూములకు సంబంధించిన అసలైన పట్టాదారులు ఎక్కడో ఉంటారు. అయితే ఈ భూమి తమదని పొక్లెయిన్‌లతో శుభ్రం చేసి తమ ఆధీనంలోకి తెచ్చుకొంటున్నారు కొందరు. ఎవరైనా ప్రశ్నిస్తే తమ వద్ద ఉన్న నకిలీ డాక్యుమెంట్ చూపిస్తున్నారు. ఇటీవల పట్టణంలోని డీబీకాలనీలో ఓ సైటుకు సంబంధించి డైక్లాట్ పట్టా ఉన్నప్పటికీ ఈ సైట్‌ను తాము కొన్నామని చదును చేశారు. ప్రస్తుతం ఇరువురి మధ్య వివాదం కొనసాగుతోంది. తాజాగా దండురోడ్డులో మరో వివాదం తెరపైకి వచ్చింది. ఇలా రోజురోజుకు హిందూపురంలో భూ వివాదాలు పెరిగిపోతుండటంతో పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**స్థానికేతరుల హస్తం**

బాలకృష్ణ శాసనసభ్యుడిగా ప్రాతినిథ్యం వహిస్తున్న హిందూపురంలో ఇలాంటి వాటికి పాల్పడేవారు గతంలో భయపడి నియోజకవర్గంలోకి అడుగు పెట్టేవారుకాదు. అయితే వైకాపా పాలనలో ధర్మవరం, పులివెందులకు చెందిన కొంతమంది ఇక్కడికి వచ్చి భూముల విషయంలో తమ హవా కొనసాగించారు. ప్రస్తుతం ఇలాంటి సంఘటనలపై పోలీసులు కఠినంగా వ్యవహరించకపోతే స్థానికేతరులు తిరిగి ఇలాంటి సంఘటనలకు పాల్పడే అవకాశాలు లేకపోలేదు. పోలీసులు ఇలాంటి సంఘటనలపై నిఘా ఉంచి నిందితులపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**భూవివాదంపై బాలయ్య ఆగ్రహం**

హిందూపురం పట్టణం దండురోడ్డులో విలువైన భూమి విషయంలో జరిగిన వివాదంపై ఎమ్మెల్యే బాలకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముద్దిరెడ్డిపల్లికి చెందిన బాధితులు ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి ఫోన్‌లో తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తమ వ్యక్తిగత సహాయకుల ద్వారా రికార్డుల మేరకు ఎవరికి చెందిన భూమినో పరిశీలించి నిజమైన వారికి న్యాయం జరిగేలా అధికారుల చర్యలు తీసుకొనే విధంగా చూడాలని ఆదేశించారు. నియోజకవర్గంలో ఎక్కడా ఇలాంటి భూ వివాదాలు జరిగేందుకు వీలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

**ఫిర్యాదు చేసిన వెంటనే చర్యలు** భూములు, ఇతర విషయాల్లో తమకు అన్యాయం జరిగిందని బాధితులు ఫిర్యాదు చేసిన వెంటనే విచారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొంటాం. అందువల్ల సంఘటన జరిగిన వెంటనే బాధితులు విషయాన్ని మాదృష్టికి తీసుకువస్తే బాధితులకు న్యాయం జరిగేలా చూస్తాం. మహేశ్, డీఎస్పీ, హిందూపురం

# టెక్స్‌టైల్ పార్కుకు మహర్దశ వచ్చేనా..



పామిడి: పామిడి పట్టణానికి వస్త్ర వ్యాపారంలో రెండో ముంబయిగా పేరుంది. పట్టణం 44వ జాతీయరహదారికి ఆనుకుని మండల ప్రజా పరిషత్తు కార్యాలయం పక్కన నిర్మించిన టెక్స్‌టైల్ పార్కు కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. కొన్ని దశాబ్దాల నుంచి వస్త్ర వ్యాపారంపై ఆధారపడి వందల మంది పేదలు జీవనం సాగిస్తున్నారు. ప్రతి నెలా రూ.40-50 కోట్ల వరకు వస్త్ర వ్యాపారం జరుగుతుంది. పట్టణంలో ఎక్కడ చూసినా పేద మహిళలు దుస్తుల తయారీలో నిమగ్నమై కనిపిస్తుంటారు. గత వైకాపా ప్రభుత్వంలో టెక్స్‌టైల్స్ రంగంపై ఎలాంటి ప్రోత్సాహం అందక ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వమైనా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు దిశగా ఆలోచించాల్సిన అవసరం ఉంది.

**మూతబడిన కుట్టు శిక్షణ కేంద్రం**

2004వ సంవత్సరంలో చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో టెక్స్‌టైల్ పార్కు నిర్మాణం ప్రారంభించారు. సుమారు రూ.1.76 కోట్లు వెచ్చించి 2.77 ఎకరాల్లో నిర్మాణం చేపట్టారు. దాదాపు ఐదేళ్ల పాటు నిర్మాణం పూర్తి చేసి అన్ని సౌకర్యాలు కల్పించారు. పేద మహిళలకు కుట్టు శిక్షణ ప్రారంభించిన కొన్ని నెలలకే ప్రభుత్వం నుంచి నిధులు లేకపోవడంతో ఆపేశారు. వివిధ కారణాలతో టెక్స్‌టైల్ పార్కు కొన్ని నెలలకే మూతబడింది. దీన్ని నిర్మించిన స్థలంపై కొంత వివాదం కారణంగా కొన్నేళ్లపాటు పనులు ఆగడంతో కేంద్రంలోని కుట్టు శిక్షణ పరికరాలు శిథిలమైపోయాయి. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక గుంతకల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సహకారంతో పూర్వ వైభవం వస్తుందన్న ఆశతో పట్టణవాసులు ఎదురు చూస్తున్నారు.

**పేదల ఉపాధికి ఊతం**

పామిడిలో ఎక్కువ శాతం కుట్టు పరిశ్రమ మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. టెక్స్‌టైల్స్ పార్క్ ప్రారంభమైతే వస్త్ర రంగంలో పేదల ఉపాధికి ఊతం లభిస్తుంది. వస్త్ర వ్యాపారంలో మరింత పురోగతిని సాధించవచ్చు. కుటుంబ వలసలు నివారించేందుకు అవకాశం ఉంది. ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. శ్రీనివాసరావు, వస్త్ర వ్యాపారి, పామిడి

# కసాపురం ఆలయ రాబడిపై నీలినీడలు

గుంతకల్లు : కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయ రాబడిని పెంచే దిశగా పెద్దగా ప్రయత్నాలు జరగడం లేదని భక్తులు విమర్శిస్తున్నారు. ఏటా రాబడి విషయంలో నీలినీడలు అలుముకున్నాయి. ఈనేపథ్యంలో ఈనెల 30 తేదీన నిర్వహించనున్న టెండర్ల ప్రక్రియపై సర్వత్ర ఆసక్తి నెలకొంది. కసాపురం ఆలయంలో నిర్వహించే టెండర్లలో వచ్చే ఆదాయంతో ఆలయ అభివృద్ధికి దోహదపడుతుందని భక్తులు విశ్వసిస్తున్నారు.




**జీతభత్యాలకే సరిపెడుతూ..** ఆలయంలో 150 మందికి ఉద్యోగులు విధులు నిర్వహిస్తుండగా భక్తులు సమర్పించిన నగదు, టెండర్లతో వచ్చే ఆదాయంతో ఆలయ నిర్వహణతో పాటు ఉద్యోగుల వేతనాలు చెల్లిస్తున్నారు. టెండర్లలో తలనీలాలు ప్రాధాన్యాంశంగా నిలుస్తోంది. గతేడాది నిర్వహించిన వేలంలో రూ.1.23 కోట్లకు హక్కులు పాడుకోగా ఈ ఏడాది 33 శాతం పెంచి హక్కులు దక్కించుకోవాల్సి ఉందని అధికారి వర్గాలు చెబుతున్నాయి.

**అన్నీ సక్రమంగా జరిగితే?**

సక్రమంగా టెండర్లను నిర్వహిస్తే దాదాపుగా రూ.1.50 కోట్ల ఆదాయం ఒక్క తలనీలాలలో వస్తుందని అంచనా. తలనీలాలతో పాటుగా కొబ్బరిచిప్పలు, వాహనాల పార్కింగ్, ప్రసాదం తయారికి అవసరమైన ముడి సరకుల సరఫరా వంటి 39 అంశాలకు టెండర్లను నిర్వహించనున్నారు.

**కోవెల ప్రగతి అంతంతే..** ఆలయంలో భక్తులు, దాతల సహకారంతో నిర్మించిన పీఏసీలో వసతులు అధ్వానంగా ఉన్నాయి. ఏసీ గదుల్లో కిటీకీల అద్దాలు పగిలిపోయి ఉన్నాయని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గదుల్లో ఏసీలు పని చేయని కారణంగా రూ.1500 ఏసీలు గదులను రూ.1000 ఇస్తున్నారు. దీంతో నిర్వాహణ లేని కారణంగా ఆలయ ఆదాయానికి గండి పడుతోంది. రూ.500 ఇచ్చే కేసరి సదనంలో 30 గదులు ఉండగా రెండు బ్యాంకు నిర్వహణకు, మరో రెండు మరమ్మతుల్లో ఉన్నాయి. కేవలం 26 గదులు మాత్రమే భక్తులు అందుబాటులో ఉన్నాయి. కసాపురం ఆలయంలో ఆదాయం పెంచి అభివృద్ధి చేసి భక్తులు సౌకర్యంగా ఉండేలా చూడాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతేడాది కంటే నిబంధనల ప్రకారం ఈసారి 33 శాతం పెంచి టెండర్లు నిర్వహిస్తామన్నారు. తద్వారా ఆలయ ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందన్నారు.

# పేదల సొంతింటి కల నెరవేరేలా..!

తిరుపతి : ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే కూటమి సర్కార్ పేదల ఇంటి పట్టాలపై కీలక నిర్ణయం తీసుకుంది. పల్లెల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం కేటాయిస్తూ సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. అనంతరం గృహ నిర్మాణ శాఖ ఇల్లు మంజూరు చేయనుంది. దీంతో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారు కొంత విశాలంగా గృహం నిర్మించుకునే సౌలభ్యం కల్పించింది.

**గత ప్రభుత్వంలో అవస్థలిలా..**

వైకాపా హయాంలో పట్టణాల్లో ఒక సెంటు, గ్రామాల్లో సెంటున్నర స్థలం కేటాయించి తమది పేదల పక్షపాత ప్రభుత్వమని ఆ పార్టీ నాయకులు గొప్పలు చెప్పుకొన్నారు. అర్హులందరికీ పట్టాలిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చలేదు. కొందరికి అనుభవపత్రం ఇచ్చినా స్థలం చూపకుండా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయించారు. ఇలా పేదలతో అడుగడుగునా చెలగాటమాడారు.

**కొండలు, గుట్టల్లో చూపించి**

జగన్ పాలనలో ప్రధానంగా కొండలు, గుట్టల్లో పేదలకు స్థలాలు చూపారు. వాటిని అంతంతమాత్రంగానే చదును చేశారు. అక్కడ ఇల్లు నిర్మించుకోకుంటే పట్టా రద్దు చేస్తామని బెదిరింపులకు దిగారు. చిత్తూరు నగరం మొదలుకుని గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని కార్వేటినగరం, వెదురుకుప్పం, ఎస్ఆర్‌పురం, పుంగనూరు, బైరెడ్డిపల్లె మండలాల్లో కేటాయించిన ప్రదేశాలు గృహ నిర్మాణాలకు ఏమాత్రం



అనువుగా లేవు. దీనికితోడు రూ.1.80 లక్షల సాయం సరిపోలేదు.

**తిరుపతిలో 5,345 చిత్తూరులో 6,200**

నిజమైన లబ్ధిదారులకు 90 రోజుల్లో ఇంటి స్థలం చూపిస్తానని జగన్ హయాంలో చెప్పినా అది మాటలకే పరిమితమైంది. వైకాపా అధికారం కోల్పోయే నాటికి తిరుపతి జిల్లాలో 5,345 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. చిత్తూరు జిల్లాలో దాదాపు 6,200 మంది తమకు ఎప్పుడెప్పుడు ఇంటి పట్టా ఇస్తారా? అని ఆశగా ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచీ ఇంటి స్థలాల కోసం చిత్తూరు జిల్లాలో 885 మంది అర్జీలు ఇచ్చారు. అత్యధికంగా కుప్పం మండలంలో 232 మంది, బైరెడ్డిపల్లెలో 81 మంది విన్నవించారు.

**భూసేకరణ వ్యయం అధికంగానే**

చిత్తూరు నగరం, తిరుపతి నగరం, కుప్పంలోనే ఎక్కువగా ఇంటి పట్టాలకు డిమాండ్ ఉంది. వైకాపా హయాంలో దాదాపు ప్రభుత్వ భూముల్లో పట్టాలు ఇచ్చినందున ఇప్పుడు అసైన్డ్ భూములు కొనుగోలు చేయాలని అధికారులు భావిస్తున్నారు. చిత్తూరు జిల్లాతో పోలిస్తే తిరుపతి జిల్లాలో భూసేకరణ వ్యయం ఎక్కువే అవుతుంది.

# గ్రహణం వీడి.. నైపుణ్యం జతకూడి

తిరుపతి : ఆధునిక సాంకేతిక కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సులభంగా పొందాలంటే కళాశాల స్థాయిలోనే నైపుణ్యాభివృద్ధి తప్పనిసరని ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు గుర్తించారు. అందుకే ప్రతి విశ్వవిద్యాల యంలో నైపుణ్య శిక్షణ అందించేందుకు 2016లో ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఏర్పాటు చేశారు. లక్షలాది మందికి శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించారు. వైకాపా హయాంలో ఈ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. కూటమి ప్రభుత్వం మళ్లీ పట్టాలెక్కిస్తోంది. వైకాపా హయాంలో శిక్షణ ఆపేయడంతో విద్యార్థుల్లో నైపుణ్య కొరతే ఉపాధికి అవరోధమని గుర్తించిన కూటమి ప్రభుత్వం ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఉద్యోగ, ఉపాధి నైపుణ్యాలపై వివిధ కోర్సుల్లో



శిక్షణ ఇస్తూ జాబ్‌మేళాల ద్వారా ఉద్యోగాల కల్పనకు మళ్లీ ప్రాణం పోసింది. వర్సిటీలో పీజీ, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ, ఇంజినీరింగ్, నర్సింగ్ వంటి వివిధ కోర్సుల్లో దాదాపు 5,700 మంది విద్యార్థినులున్నారు. గత తెదేపా హయాంలో వర్సిటీలో ఏపీఎస్ఎస్‌డీసీ చురుగ్గా పని చేసింది. సమ్మర్, వింటర్ కాలాల్లో రెండు రకాలుగా శిక్షణ నిర్వహించి తద్వారా రెండువేల మందికిపైగా విద్యార్థినులకు ఉపాధి కోర్సులపై శిక్షణ ఇచ్చారు. వీరిలో దాదాపు 60% మంది విద్యార్థినులు వివిధ సంస్థల్లో ఉద్యోగాలు సాధించారు.

**60 అంశాల్లో శిక్షణ ఇలా..**

వర్సిటీలో బీటెక్, ఎంటెక్, ఎంసీఏ విద్యార్థినులకు ఇప్పటి వరకు వెబ్, గూగుల్ ఆండ్రాయిడ్ ఆప్, యూఐ డెవలప్‌మెంట్, పైతాన్, ఆటోక్యాడ్, ఐవోటీ, పీఎల్‌సీ, పెడగోగీ, లైబ్రరీ ఆటోమేషన్, వంటి దాదాపు 60 అంశాలపై శిక్షణ ఇచ్చారు.

**రూ.300కే నేర్పించారు**

మాకు కోర్ సబ్జెక్టు, బేసిక్స్ కూడా తెలియని ఆటోక్యాడ్‌లో వారం రోజుల శిక్షణ ఇచ్చారు. దీంతో బేసిక్స్ నేర్చుకోవడంతోపాటు చదవడం సులభమైంది. ఇదే కోర్సు బయట నేర్చుకోవాలంటే రూ.2వేలు ఖర్చు అవుతుంది. ఏపీఎస్ఎస్‌డీసీ రూ.300కే నేర్పించారు. పి.హర్షిత, బీటెక్ విద్యార్థిని

**నైపుణ్యాలు పెంపొందించుకోవాలి**

బీటెక్ చదివి బయటకెళ్తే ఉద్యోగాలు దొరకడం కష్టం. ఉద్యోగాలు పొందాలంటే నూతన నైపుణ్యాలు పెంపొందించుకోవాలి. మహిళా వర్సిటీలో ఇచ్చిన శిక్షణ ఉపాధికి ఎంతో అనువైంది. ఎస్.రమ్యశ్రీ, మెకానికల్ విద్యార్థిని

చురకలు



## చీర కట్టులో ఇస్మార్ట్ బ్యూటీ సూపర్

నన్ను దోచుకుందువటే సినిమాతో 2018లో తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్‌గా పరిచయం అయిన ముద్దుగుమ్మ నభా నటేష్. మొదటి సినిమాతోనే అందంతో పాటు నటనతోనూ మెప్పించిన ఈ అమ్మడు టాలీవుడ్‌లో ఆ వెంట వెంటనే సినిమాల్లో ఆఫర్లు దక్కించుకుంది. టాలీవుడ్‌లో అడుగు పెట్టిన తదుపరి ఏడాదిలోనే డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రామ్ కి జోడీగా ఇస్మార్ట్ శంకర్ సినిమాలో నటించే అవకాశం దక్కించుకుంది. ఆ సినిమాలో నటనతో మరోసారి తన సత్తా చాటింది. ఇస్మార్ట్ శంకర్ సూపర్ హిట్ కావడంతో పాటు నభా నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి, ఆమె డైలాగ్ డెలివరీ అన్నింటికి పాజిటివ్ రెస్పాన్స్ దక్కింది. ఇస్మార్ట్ శంకర్ తర్వాత పలు సినిమాల్లో నటించిన నభా నటేష్ కొన్ని కారణాల వల్ల 2022, 23 లో సినిమాల్లో కనిపించలేదు. గత ఏడాది



'డార్లింగ్' అనే వెబ్ మూవీలో కనిపించింది. మరోసారి తన నటనతో మెప్పించింది. డార్లింగ్‌తో మరోసారి నభా నటేష్ బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం స్వయంభూ సినిమాలో నటిస్తున్న నభా నటేష్ మరో రెండు మూడు సినిమాలకు సంబంధించిన చర్చలు జరుగుతున్నట్లు సమాచారం అందుతోంది. త్వరలో నభా నటేష్ కొత్త సినిమాలకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉ ందని తెలుస్తోంది. సినిమాలతో ఈమధ్య కనిపించకున్నా నభా నటేష్ ఫోటో షూట్స్‌లతో ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంది. తాజాగా మరోసారి అందమైన ఫోటోలతో కన్నుల విందు చేసింది. నభా నటేష్ ఆకట్టుకునే రూపం కారణంగా చీర కట్టులో ఎప్పుడూ చాలా చక్కగా అందంగా కనిపిస్తూ ఉంటుంది. ఎప్పటిలాగే తాజాగా మరోసారి చీర కట్టు ఫోటోల్లో ఆకట్టుకుంది. ఈసారి అంతకు మించి అనిపించేలా అందమైన చీర కట్టులో జుట్టులో మల్లెపూలు ధరించి కొంటెగా చూస్తూ కెమెరాకు ఫోజ్ ఇచ్చింది. అందమైన నభా నటేష్ ఈ చీర కట్టులో మరింత అందంగా కనిపిస్తుంది అంటూ నెటిజన్స్, అభిమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నభా నటేష్ అందమైన ఫోటో షూట్ వైరల్ కావడం కొత్తేం కాదు. గతంలో ఎన్నో సార్లు ఆమె స్కిన్ షో చేసిన ఫోటోలు వైరల్ అయ్యాయి. అయితే ఇలా నిండైన చీర కట్టులోనూ అందంగా కనిపిస్తుంది అంటూ ఈ ఫోటోలను సైతం నెటిజన్స్ తెగ షేర్ చేస్తున్నారు. చీర కట్టు ఫోటోలకు ఈ స్థాయి రెస్పాన్స్ దక్కడం చాలా అరుదుగా ఉంటుంది. నభా నటేష్ మోడ్రన్ డ్రెస్‌లతో పాటు ఇలా చీర కట్టులోనూ చాలా అందంగా ఉందంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. నభా నటేష్ ఇంతటి అందానికి దక్కాల్సిన ఆఫర్లు దక్కడం లేదని, ఇండస్ట్రీలో టాప్ స్టార్ హీరోయిన్‌గా ఈ అమ్మడు సినిమాలు చేయాలని ఫ్యాన్స్ అంటున్నారు.

## సొంత గుర్తింపు కోసం శ్రుతిహాసన్ నిజాయితీ

వరుసగా రెండుసార్లు ప్రేమలో వైఫల్యం, నటిగా ఆరంభం ఫ్లాపులు ఎదురైన తర్వాత కూడా శ్రుతిహసన్ అగ్ర కథానాయికగా పరిశ్రమలో ఎదిగింది. స్టార్ హీరోల సరసన వరుసగా అవకాశాలు అందుకుంది. ఇటీవల ఈ భామ మూడు బ్లాక్ బస్టర్లలో అవకాశాలు దక్కించుకుంది. కంబ్యాక్ లో ఈ మూడూ తనకు సంతృప్తికరమైన ఫలితాన్ని అందించాయి. ఆ మూడు సినిమాలు వీరసింహారెడ్డి, వాల్తెయిర్ వీరయ్య, సలార్: పార్ట్ వన్ - సీజ్ ఫైర్. సలార్ 2 తర్వాత రజనీ-లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లోని కూలి చిత్రంలో నటిస్తోంది. అలాగే విజయ్ సేతుపతితో కలిసి ట్రైన్ అనే ప్రయోగాత్మక చిత్రానికి సంతకం చేసింది. దళపతి విజయ్ తదుపరి చిత్రం జననాయకన్‌లో శ్రుతి ఓ కీలక పాత్రను పోషిస్తుందని కూడా ఊహాగానాలు చెలరేగాయి. దిగ్గజ నటుడు కమల్ హాసన్ కుమార్తె అయినా కానీ, తండ్రి పేరును



ఉపయోగించుకునేందుకు శ్రుతి పూర్తిగా వ్యతిరేకం.

తన తండ్రిని గుర్తించినంతగా తనను గుర్తించరనే భయం తనకు ఉంది. అందుకే తాను చదువుకునేప్పుడు.. కెరీర్ ప్రారంభించిన రోజుల్లో తండ్రి పేరును ఎక్కడా ఉపయోగించలేదని తెలిపింది. అలాగే స్నేహితులకు తన ఐడెంటిటీని కూడా చెప్పేదానిని కాదని వెల్లడించింది. కమల్, సారికల గురించి ప్రజలకు తెలిస్తే వారి గురించి మాట్లాడుతారు కానీ, తన గురించి ఎవరైనా మాట్లాడుతారా? అని కూడా శ్రుతి ఆందోళన చెందింది. తన స్నేహితులకు ఫేక్ ఐడెంటిటీని పరిచయం చేయడం ద్వారా కూడా తప్పించుకుంది. అయితే కథానాయిక అయ్యాక మాత్రం అజ్ఞాతవాసాన్ని దాచలేకపోయింది.

అయినా నటిగా తనదైన ముద్ర వేసి ముందుకు సాగేందుకు చాలా హార్డ్ వర్క్ ను ఆశ్రయించింది. ఇప్పుడు అగ్ర కథానాయిక హోదా వెనక తన కృషి పట్టుదల అసాధారణమైనది.




## అన్ని సినిమాలు బలగం కాలేవు..!



వేణు యెల్దండి డైరెక్షన్ లో వచ్చిన బలగం సినిమా సెన్సేషనల్ హిట్ అందుకుంది. కమెడియన్ గా చేసిన వేణు ఇంత గొప్ప సినిమా ఎలా తీశాడు అనే రేంజ్ లో ఆడియన్స్ అంతా షాక్ అయ్యారు. సినిమా కథ కథనం నటీనటుల ప్రతిభ అన్నీ బలగం సినిమాకు కలిసి వచ్చాయి. అంతేకాదు ఆ సినిమాకు భీమ్స్ ఇచ్చిన మ్యూజిక్ కూడా సినిమాకు బలంగా నిలిచింది. ఊరు పల్లెటూరు సాంగ్ తోనే సినిమాపై ఒక బజ్ ఏర్పడింది. ఐతే బలగం సినిమాను చూసి అలాంటి సినిమాలనే చేయాలని కొందరు ప్రయత్నించారు. ముఖ్యంగా వేణుతో సమకాలీకుడు అయిన కమెడియన్ ధన్ రాజ్ కూడా మెగా ఫోన్ పట్టి సినిమా చేశాడు. రామం రాఘవం అంటూ ఒక ఫాదర్ అండ్ సన్ సినిమా చేశాడు. ఐతే ఆ సినిమా లాస్ట్ వీక్ రిలీజ్ కాగా అంత ఇంపాక్ట్ క్రియేట్ చేయలేకపోయింది. ఐతే డైరెక్టర్ గా వేణు సక్సెస్ అయ్యాడు కాబట్టి ధన్ రాజ్ సినిమా చేయలేదు. తనలో ఉన్న కథకుడిని ప్రేక్షకుడికి పరిచయం చేయాలని రామం రాఘవం చేశాడు. సినిమా ఫలితం ఏంటన్నది పక్కన పెడితే డైరెక్టర్ ధన్ రాజ్ పాస్ మార్కులు తెచ్చుకున్నాడనే చెప్పొచ్చు. ఇక బలగం తరహాలోనే ఈమధ్యనే బాపు అనే సినిమా ఒకటి రిలీజైంది. ఈ సినిమా కూడా బలగం ఫార్మెట్ లోనే వచ్చింది. ఎమోషనల్ డ్రామాగా వచ్చిన ఈ సినిమా ప్రేక్షకులకు కనెక్ట్ కాలేకపోయింది. ఐతే ఈ సినిమాలో బ్రహ్మాజి నటించడం వల్ల అందరికీ తెలిసింది కానీ సినిమా మాత్రం ఆడియన్స్ కు పెద్దగా ఎక్కలేదు. సో బలగం వచ్చింది కదా అని రామం రాఘవం, బాపు సినిమాలను చూసేయరు. ఒక సినిమా హిట్ అయ్యింది అంటే ఆ సినిమాకు అలా కుదురుతుంది మళ్లీ అలా సెట్ అవ్వాలి అంటే కష్టమే. ఐతే తెలుగు ఆడియన్స్ కూడా మంచి సినిమాలను ఆదరిస్తున్నారు కానీ ఒకటే ఫార్మెట్ లో రెండు మూడు సినిమాలు వస్తే మాత్రం ఆడియన్స్ ఆదరించే అవకాశం లేదు. ఐతే కథ కథనాలు నటీనటుల ప్రతిభ దర్శకుడి ఎఫర్ట్ గుర్తిస్తే మాత్రం ప్రేక్షకులు ఆ సినిమాను ఎంకరేజ్ చేసే ఛాన్స్ ఉంటుంది.

## లక్కీ భాస్కర్.. నెట్ ఫ్లిక్స్ లో కూడా సంచలనమే..




సినిమా థియేటర్లలో ఘన విజయం సాధించటమే కాదు, ఓటీటీలోనూ దూసుకుపోతున్న చిత్రం లక్కీ భాస్కర్. బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా వంద కోట్ల కలెక్షన్స్ తో దుల్కర్ కెరీర్ లోనే బిగ్ హిట్ గా నిలిచింది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా, ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్‌లో అదిరిపోయే రికార్డు క్రియేట్ చేసింది. 13 వారాల పాటు నెట్‌ఫ్లిక్స్ ట్రెండింగ్ లిస్ట్‌లో కొనసాగిన తొలి దక్షిణాది సినిమా గా నిలిచింది. ఇటీవల విడుదలైన ఎన్నో పాన్ ఇండియా సినిమాలు ఓటీటీలో సక్సెస్ అయినా, అంతటి నిలకడను కొనసాగించిన సినిమాలు చాలా తక్కువ. కానీ లక్కీ భాస్కర్ మాత్రం భారీ రెస్పాన్స్‌తో ఏకంగా మూడు నెలల పాటు నెట్‌ఫ్లిక్స్ టాప్ ట్రెండ్స్‌లో కొనసాగింది. సినిమా కథ, కథనం, దుల్కర్ పెర్ఫార్మెన్స్, టెక్నికల్ వాల్యూస్ ఇవన్నీ కలిసి ఈ సినిమాను ఓటీటీలో మరో స్థాయికి తీసుకెళ్లాయి. థియేట్రికల్‌గా విజయవంతమైన ఈ సినిమా, బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబట్టి దుల్కర్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ఇప్పుడు అదే ఊపును నెట్‌ఫ్లిక్స్‌లో కొనసాగిస్తూ, సౌత్ ఇండస్ట్రీ సినిమాల హవాను అంతర్జాతీయ స్థాయిలో చూపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాకు అదిరిపోయే రెస్పాన్స్ లభిస్తుండటంతో, నెట్‌ఫ్లిక్స్ మేనేజ్‌మెంట్ కూడా ప్రత్యేకంగా హైలైట్ చేస్తోంది. సినిమా ప్రీమియర్ అయిన వెంటనే, 15 దేశాల్లో నెట్‌ఫ్లిక్స్ టాప్ 10 లిస్ట్‌లో మొదటి స్థానాన్ని దక్కించుకుంది. అంతే కాదు, 17.8 బిలియన్ నిమిషాల స్ట్రీమింగ్‌తో రెండు వారాల పాటు ప్రపంచవ్యాప్తంగా రెండవ స్థానంలో నిలిచింది. ఇది దక్షిణాది సినిమాలలో ఒకటిగా చూస్తే అనూహ్యమైన రికార్డ్. ప్రస్తుతం 13 వారాల ట్రెండింగ్ రికార్డుతో, సౌత్ ఇండియా సినిమాలకు ఓటీటీలో భారీ మార్కెట్ ఉందని మరోసారి రుజువు చేసింది. ఈ ఘనతను సాధించినందుకు చిత్ర బృందం ఎంతో ఆనందంగా ఉంది. నిర్మాతలు, దర్శకుడు వెంకీ అట్లూరి, హీరో దుల్కర్, ఇతర నటీనటులు ఈ విజయాన్ని అభిమానులతో పంచుకున్నారు. ఇంకా ఈ సినిమాను ఎవరైనా మిస్ అయ్యారా? అయితే నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులో ఉన్న ఈ విజువల్ మాస్టర్‌పీస్‌ను వెంటనే చూడండి.

## ఆ కేసులో తమన్నా.. కాజల్ ను విచారణకు ఆ పోలీసుల నిర్ణయం!


ప్రముఖ సినీ నటీమణులు తమన్నా.. కాజల్ కు కొత్త కేసు కష్టం ఎదురైనట్లుగా చెప్పాలి. గతంలో వారు పాల్గొన్న కార్యక్రమాలు ఇప్పుడు కేసు ఉచ్చు వారికి బిగుసుకునేలా చేయటమే కాదు.. పోలీసుల విచారణకు హాజరు కావాల్సిన పరిస్థితి ఏర్పడినట్లుగా తెలుస్తోంది. ఈ ఇద్దరు అగ్ర నటీమణులను విచారించాలని పుదుచ్చేరి పోలీసులు నిర్ణయించారు. తమ వద్ద జరిగిన క్రిప్టో కరెన్సీ మోసానికి సంబంధించి విచారణకు హాజరు కావాలని కోరనున్నారు. క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెడితే అధిక లాభం పొందొచ్చన్న ఆశ చూపి.. పుదుచ్చేరికి చెందిన పది మంది నుంచి సుమారు రూ.2.4 కోట్ల మొత్తాన్ని వసూలు చేశారని.. తమను మోసం చేసినట్లుగా అశోకన్ అనే రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగి పోలీసులకు కంప్లైంట్ చేశారు. క్రిప్టో



కరెన్సీ కంపెనీ 2022లో కోయంబత్తూరు హెడ్డాఫీసుగా స్టార్ట్ అయ్యింది. ఈ ఆఫీసు ప్రారంభోత్సవ కార్యక్రమానికి సినీ నటి తమన్నా .. ఇతర ప్రముఖులు హాజరయ్యారు. అంతేకాదు.. ఈ కంపెనీకి చెందిన మరో కార్యక్రమం మహాబలిపురంలోని ఒక స్టార్ హొటల్లో జరిగింది. దీనికి కాజల్ అగర్వాల్ పాల్గొన్నారు. అనంతరం ముంబయిలో ఒక పార్టీని నిర్వహించారు. వేలాది మంది నుంచి డబ్బుల్ని సేకరించారు. ఈ వ్యవహారాలకు సంబంధించి 36 ఏళ్ల నితీష్ జెయిన్.. 40 ఏళ్ల అరవింద్ కుమార్ లను ఇప్పటికే పుదుచ్చేరి పోలీసులు అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా తమన్నా..కాజల్ అగర్వాల్ ను విచారించాలని పుదుచ్చేరి పోలీసులు నిర్ణయించారు. వారికి దీనికి సంబంధించిన సమాచారాన్ని అందజేయనున్నారు.

## చైతూ ఫోటో.. శోభిత హార్ట్ మెల్ట్!

యంగ్ హీరో అక్కినేని నాగచైతన్య, హీరోయిన్ శోభిత ధూళిపాళ్ల.. గత ఏడాది వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. డిసెంబర్ 4వ తేదీన చైతన్య, శోభితల వివాహం గ్రాండ్ గా జరిగింది. కొంత కాలంపాటు ప్రేమలో ఉన్న వీరిద్దరూ.. ఇరు కుటుంబాల అంగీకారంతో హైదరాబాద్ లోని అన్నపూర్ణ స్టూడియోస్ లో వేద మంత్రాల మధ్య ఒక్కటయ్యారు. ఆ తర్వాత నుంచి వివిధ సందర్భాల్లో వార్తల్లో నిలుస్తూనే ఉన్నారు. శోభిత.. చైతూపై లవ్ ను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో వ్యక్తపరుస్తుంటారు. రీసెంట్ గా కొన్ని నెలల తర్వాత చైతూ క్లీన్ షేవ్ ఫేస్ ను చూడనున్నట్లు తెలిపారు. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయం సాధించిన తండేల్ కోసం కొన్ని నెలలుగా నాగచైతన్య గడ్డం పెంచిన విషయం తెలిసిందే. ఇప్పుడు తన భర్త క్యూట్ పిక్ ను పోస్ట్ చేసింది శోభిత. ఇన్ స్టా స్టోరీలో పోస్ట్ చేసిన ఆమె.. హార్ట్ సింబల్ యాడ్ చేయడంతో ఫుల్ వైరల్ గా మారింది. డీజే ప్లేస్ లో ఉన్న చైతూ ఫోటో షేర్ చేసి.. హార్ట్ ఏ chay అంటూ క్యూట్ గా పోస్ట్ పెట్టింది. క్రీమ్ కలర్ స్వెట్



షర్ట్ వేసుకుని చైతూ.. ఫుల్ హ్యాపీ మూడ్ లో ఉన్నట్లు కనిపిస్తున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో శోభిత పోస్ట్ వైరల్ గా మారగా.. నెటిజన్లు స్పందిస్తున్నారు. వావ్, సూపర్ పిక్ అని కామెంట్లు పెడుతున్నారు. హార్ట్ ఎమోజీస్ తో కామెంట్ బాక్స్ నింపేస్తున్నారు. శోభిత పోస్ట్ స్క్రీన్ షాట్ ను వైరల్ చేస్తున్నారు. తమ సోషల్ మీడియా వాల్స్ లో పోస్ట్ చేస్తూ ఫుల్ ఖుషీ అయిపోతున్నారు అక్కినేని ఫ్యాన్స్. మరోవైపు, ఇటీవల శోభిత, చైతూ మంచి మనసు చాటుకున్నారు. క్యాన్సర్ తో పోరాటం చేస్తున్న చిన్నారులను కలిసి వారితో గడిపారు. కొంతసేపు మాట్లాడారు. హైదరాబాద్ లోని సెయింట్ జూడ్ ఇండియా చైల్డ్ కేర్ కు వెళ్లి.. పలువురు చిన్నారులతో సరదాగా గడిపారు. వారికి ధైర్యం కూడా చెప్పారు శోభిత, చైతూ. అంతేకాదు ఆ కేర్ సెంటర్ సిబ్బందితో కూడా మాట్లాడారు. పిల్లల ఆరోగ్యం గురించి వివరాలను క్లియర్ గా అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక సహాయం కూడా చేసినట్లు తెలుస్తోంది. అనంతరం పిల్లలు, కేర్ సిబ్బందితో ఫొటోలు దిగారు. అందుకు సంబంధించిన ఫొటోలు ఇటీవల నెట్టింట వైరల్ గా మారాయి. కొత్త జంట మంచి మనసును అంతా కొనియాడారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA. PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536